తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

శుక్రవారం 21.06.2024 | సంపుటి : 10 సంచిక : 342 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698




# మోదీజీ.. యుద్ధాలు ఆపారు లీకేజీలు ఆపలేరా!



## వ్యక్తుల చేతుల్లోకి విద్యావ్యవస్థ • అయినా పట్టని ప్రధాని

## మోదీ సర్కారు అదుపు తప్పింది • కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్

**దిల్లీ,జూన్ 20(జనంసాక్షి):** ఒకవైపు 'నీట్- యూజీ ప్రవేశపరీక్ష 2024లో అవకతవకలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలు వస్తోన్న తరుణంలోనే.. అక్రమాలు జరిగాయన్న ప్రాథమిక ఆధారాలతో యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ వరుస పరిణామాలపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. "దేశ విద్యావ్యవస్థపై కొందరి నియంత్రణ కారణంగానే ఈ పేపర్ లీక్‌లు జరుగుతున్నాయి. ఈ నియంత్రణకు మోదీజీ అవకాశం ఇచ్చారు. వైస్ ఛాన్సలర్ల నియామకాలు ప్రతిభ ఆధారంగా జరగడం లేదు. స్వతంత్ర విద్యావ్యవస్థ ధ్వంసమైంది. ఇలాంటి పరిణామాలకు కారకులైన వారికి శిక్ష పడాలి. ఈ పరిస్థితి మారనంత కాలం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఇది దేశ వ్యతిరేక చర్య. ఈ అవకతవకలను మేం పార్లమెంట్‌లో లేవనెత్తుతాం" అని రాహుల్ వెల్లడించారు. అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి క్లీన్ చిట్ ఇవ్వ డాన్ని తప్పుపట్టారు. తాము ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉన్నామో ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు."ఇప్పుడు మోదీ ప్రధాన ఎజెండా స్పీకర్ ఎన్నిక. ఆయన తన ప్రభు త్వం, స్పీకర్ పదవి గురించి ఆలోచిస్తున్నారు. మోదీ ప్రజలను భయపెడుతూ ప్రభుత్వాన్ని నడిపిస్తుంటారు. కానీ

మిగతా 2లో..



## నీట్ బండారం బట్టబయలు

**మాకు పేపర్ ముందే అందింది**

- పోలీసుల విచారణలో ఒప్పుకున్న అరెస్టైన విద్యార్థులు
- లీకేజీ జరిగిందని వెల్లడి
- ఒక్కో పేపర్ రూ.30 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం
- మరోసారి సుప్రీంలో విచారణ.. అన్ని కేసులు ధర్మాసనానికి బదిలీ
- కేంద్రం, ఎన్‌టీఏకు నోటీసులు జారీ

వార్త 2లో

## యూజీసీ నెట్ పరీక్ష రద్దు

- అవకతవకలు జరిగినట్లు గుర్తించిన కేంద్రం
- సీబీఐ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- త్వరలోనే మళ్లీ పరీక్ష
- కొత్త తేదీ ప్రకటిస్తాం
- కేంద్ర విద్యాశాఖ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అవకతవకలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దేశంలోని అనేక నగరాల్లో ఓఎమ్మార్ (పెన్ను, పేపరు) విధానంలో మంగళవారం యూజీసీ నెట్ పరీక్ష జరిగింది. దీనిని ఎన్‌టీఏ

మిగతా 2లో..

## సింగరేణిపై భాజపా, భారాస

# కుట్ర

## ఎట్టిపరిస్థితుల్లోనైనా సంస్థను కాపాడుకుంటాం

### గనులు దక్కించుకోకపోతే సింగరేణి కాలగర్భంలో కలిసిపోతుంది

### అవసరమైతే ప్రధానిని కలుస్తాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం(జనంసాక్షి):** సింగరేణిని కాపాడుకునేందుకు ప్రధానిని కలుస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విపక్షనేతలను కలుపుకుని వెళ్లి కలిసి పరిస్థితిని వవరిస్తామని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి..ఈ సంస్థ తెలంగాణకు తలమానికమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయిపోతే ఆ ప్రాంతంలో ఉన్న వేలాది మంది ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్థ కోసం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనీ కలుస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధానిని కలుస్తామని తెలిపారు. తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తాం, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసం తాము ఈ పని చేస్తామని తెలిపారు. ఇవన్నీ రాష్ట్ర ప్రయోజనాల కోసం చేస్తున్నావేనని అన్నారు. తమకు మద్దతు తెలిపిన సీపీఐ, మిగతా రాజకీయ పార్టీలను కలుపుకుని మోదీ దగ్గరకు వెళ్తామని వివరించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం మల్లు భట్టి విక్రమార్క మీడియా సమావేశం

మిగతా 2లో..





## సింగరేణిని పరిరక్షించుకోవాలి

### వేలం పాటలను ఎందుకు అడ్డుకోరు:కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా.. ఉద్దేశ పూర్వకంగా కుట్ర జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో..



## లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

వార్త 10లో




## రిజర్వేషన్ పెంపుపై బీహార్ సర్కారుకు చుక్కెదురు

### రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టేసిన హైకోర్టు

**పట్నా(జనంసాక్షి):** బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. ఈ పెంపు రాజ్యాంగ విరుద్ధమన్న న్యాయస్థానం.. 65శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ గురువారం సంచలన తీర్పు వెలువరించింది. బిహార్ వ్యాప్తంగా కులగణన చేపట్టి ఆ నివేదికను నీతీశ్ సర్కారు గతేడాది నవంబరులో అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అదే సమయంలో విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను పెంచుతూ సవరణ బిల్లును తీసుకొచ్చారు. ఈ బిల్లుకు రాష్ట్ర శాసనసభ

మిగతా 2లో..

## కాటేసిన కల్తీ సారా

### 37 మంది మృతి

- తమిళనాడులోని కల్లకురిచి జిల్లాలో ఘటన
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



**వేళచ్చేరి(జనంసాక్షి):** తమిళనాడులో నాటు సారా తాగిన ఘటనలో మృతుల సంఖ్య 37 కు చేరింది. కల్లకురిచి జిల్లా కరుణాపురం ప్రాంతంలో మంగళవారం పలువురు సారా తాగి అనారోగ్యానికి గురయ్యారు.వారిలో మరికొంత మంది బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాటుసారా ఘటనపై తమిళనాడు సీఎం స్టాలిన్ విచారణకు ఆదేశించారు. కల్లకురిచి కలెక్టర్‌పై బదిలీ వేటు వేయడంతో పాటు ఎస్పీని సస్పెండ్ చేశారు. కాగా తమిళనాడులో నాటు సారా తాగి 37 మంది మృతి చెందిన ఘటన రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ విషాదానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే డిమాండ్ చేస్తోంది.ఈ దారుణం వెనక డీఎంకే కార్యకర్తల హస్తం ఉందని మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే నేత పళనిస్వామి ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించి కంటితుడుపు చర్యలు చేపడుతోందని విమర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు సాయం చేయాలన్నారు. సీఎం స్టాలిన్‌కు పరిపాలన చేతకాదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే

మిగతా 2లో..

## కర్ణాటకలో ఉండాలంటే కన్నడ నేర్చుకోవాలి

### సీఎం సిద్ధరామయ్య హుకుం

**బెంగళూరు(జనంసాక్షి):** కన్నడ భాష, ప్రాంతం, నీటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి కన్నడ వాసికి ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో కన్నడ సంస్కృతి ప్రతిబింబించేలా ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చిన ఆయన.. రాష్ట్రంలో నివసించే వారంతా స్థానిక భాషను నేర్చుకోవాలని సూచించారు."కన్నడిగులు ఉదారంగా ఉంటారు. అందుకే కన్నడ రాకున్నా.. ఇతర భాషలు మాట్లాడేవారు కూడా ఇక్కడ స్వేచ్ఛగా నివసిస్తున్న వాతావరణం ఉంది. కన్నడ మీద ప్రేమ పెంచుకోవాలి. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా మతోన్మాదులుగా మారకూడదు. భాష, ప్రాంతం, దేశం మీద ప్రేమ, గౌరవం

మిగతా 2లో..



## కేజ్రీవాల్‌కు బెయిల్

### మంజూరు చేసిన దిల్లీ కోర్టు • సత్యమే గెలిచిందన్న ఆప్



**దిల్లీ(జనంసాక్షి):** మద్యం విధానానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భారీ ఊరట లభించింది. ఈ కేసులో దిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.ఈ నేపథ్యంలో 48 గంటల పాటు బెయిల్ ఆర్డరును నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో మార్చి 21న ఈడీ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం ఉదయం తీర్పు రిజర్వ్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు.. అదే సాయంత్రం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, బెయిల్ బాండుపై సంతకం చేసేందుకు వీలుగా 48 గంటలపాటు స్టే విధించాలని న్యాయస్థానాన్ని ఈడీ కోరింది. తద్వారా ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేసేందుకు వీలు కలుగుతుందని విన్నవించింది. అయినప్పటికీ ఈడీ వాదనను తోసిపుచ్చిన కోర్టు.. అందుకు నిరాకరించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడంపై ఆప్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆప్ నేత, దిల్లీ మంత్రి అతిశీ

మిగతా 2లో..

## త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్

- గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు ప్రకటిస్తాం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** అతి త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ధర్నా చౌక్‌లో విద్యార్థుల ధర్నాపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. త్వరలోనే గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాల ఖాళీలను గుర్తించి అతి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చారు. కొందరు విద్యార్థులు, నిరుద్యోగ మిత్రులు ఈరోజు ధర్నా చేస్తున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో లీగల్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నిపుణులతో చర్చిస్తున్నామని అన్నారు. జీవో 46 బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా అతి త్వరలో మంథని లో ఐటి సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక చిన్న ఐటీ సంస్థ తో మాట్లాడడం జరిగిందని వారు అతి త్వరలో మంథనిలో ఐటి సంస్థను ఏర్పాటు కాబోతుందని తెలిపారు. మొదటగా 50 మంది యువతకు నెల రోజుల లోపు ఉపాధి కల్పుతుందని అన్నారు. మార్కెట్ లో వచ్చే కొత్త కోర్సులు, ట్రెండ్స్ నైపుణ్యాలు విద్యార్థులకు అందించడం కోసం ఐటిఐ లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. 65 అడ్వాన్స్ లెర్నింగ్ కేంద్రాలను దాదాపు 2234 కోట్ల రూపాయలు, టాటా కంపెనీ సౌజన్యంతో

మిగతా 2లో..

## ఏపీ ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి

**అమరావతి(జనంసాక్షి):** కూటమి ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో ఏపీ ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి , అనగాని

మిగతా 2లో..



## సౌదీ అరేబియాలో ఉష్ణ ప్రతాపం

- వడగాలులతో ఉక్కిరిబిక్కిరవుతున్న హజ్ యాత్రికులు
- 51.8 డిగ్రీలు నమోదు
- వెయ్యి దాటిన మరణాలు!



**రియాద్(జనంసాక్షి):** సౌదీ అరేబియాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం క్రితం అత్యధికంగా 51.8 డిగ్రీలు నమోదైనట్లు అక్కడి వాతావరణశాఖ వెల్లడించింది.ఈ నేపథ్యంలో హజ్ యాత్రకు వెళ్లిన వారిలో వడదెబ్బ కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య 1000 దాటినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. వీరిలో అత్యధికులు ఈజిప్టు దేశస్థులే కాగా.. భారత్, పాకిస్థాన్, జోర్డాన్, ఇండోనేషియా, ఇరాన్, సెనెగల్, ట్యూనిషియాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం.మృతి చెందినవారిలో అత్యధికంగా ఈజిప్టు వాసులే ఉన్నట్లు అరబ్ రాయబారి వెల్లడించారు. గురువారం ఒక్కరోజే ఆ దేశానికి చెందిన 58 మంది చనిపోగా.. మొత్తం మరణాల సంఖ్య 658కి చేరింది. వీరిలో 630 మంది అనుమతి లేని యాత్రికులే ఉన్నట్లు సమాచారం. మొత్తంగా 10 దేశాలకు చెందిన 1081 మంది యాత్రికులు ఎండ దెబ్బకు మరణించినట్లు తెలిసింది. ఆయా దేశాల రాయబార కార్యాలయాల ప్రకటనల ఆధారంగా ఈ సంఖ్యను లెక్కించినట్లు సమాచారం. మెడికల్ కాంప్లెక్సు వద్ద కొంతమంది మృతుల వివరాలు ప్రకటించారు. జాబితాలో అల్జీరియా, ఈజిప్టుతోపాటు భారత్‌కు చెందినవారి పేర్లు కూడా ఉన్నాయి.అయిదు రోజుల హజ్ యాత్రలో భాగంగా ఈ ఏడాది మొత్తం 18.3 లక్షలమంది

మిగతా 2లో..

## రాష్ట్రంలో మరోసారి ఈడీ సోదాలు

### పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో తనిఖీలు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఈడీ సోదాలు మరోసారి కలకలం రేపుతున్నాయి. ఎన్నికల ముందు వరకు ఐటీ, ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం వేడెక్కిన విషయం తెలిసిందే. ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం ఆసక్తిరేపుతోంది. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం

మిగతా 2లో..

## నాగర్‌కర్నూల్‌లో అమానవీయ ఘటన

- చెంచు మహిళపై కౌలురైతు దాడి
- గృహంలో నిర్బంధించి చిత్రహింసలు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఉదంతం
- కఠిన చర్యలకు మంత్రి జూపల్లి ఆదేశం

**కొల్లాపూర్(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లిలో దారుణం జరిగింది. ఓ చెంచు మహిళపై ఇద్దరు విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఈశ్వరమ్మ, ఆమె భర్త ఈదన్న వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ కౌలుకు తీసుకున్నాడు ఆ పొలంలోనే వారిద్దరు

మిగతా 2లో..

# నాగర్‌కర్నూల్‌లో అమానవీయ ఘటన

కూలీ పని చేయిస్తున్నారు. ఇటీవల భార్యాభర్తలు గొడవపడటంతో ఈశ్వరమ్మ తన తల్లిగారి ఊరు చుక్కాయపల్లికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వెంకటేశ్.. తల్లిగారి ఇంటి నుంచి ఈశ్వరమ్మను మొలచింతపల్లి గ్రామానికి తీసుకొచ్చి తన ఇంట్లో బంధించాడు. తన భార్య శివమ్మ, బాధితురాలి బంధువు లక్ష్మమ్మ భర్త లింగస్వామితో కలిసి వెంకటేశ్ ఆమెపై దాడి చేశాడు.పది రోజుల కిందట ఈ దాడి జరగగా శరీరంపై కాల్చిన గాయాలున్నాయి. అప్పటి నుంచి ఆమెను ఇంట్లోనే ఉంచి గ్రామంలోని ఓ ఆర్ఎంపీతో వైద్యం అందించారు. అయితే విషయం తెలుసుకున్న ఈదన్న.. గ్రామస్థులతో కలిసి ఈదమ్మను పంపించమని కోరగా వెంకటేశ్ బెదిరింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెళ్లి బాధితురాలిని ఇంటికి తీసుకొని రాగా దాష్టీకం బయటకు వచ్చింది. విషయం తెలుసుకున్న నేషనల్ ఆదివాసి లిబర్టీ కౌన్సిల్ సంస్థ (ఎన్ఏఎస్‌సీ) సభ్యులు బుధవారం ఆమె ఇంటికి వెళ్లగా జరిగిన విషయం వారికి చెప్పింది. దీంతో వారు ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ ఆదేశాలతో ఎస్ఐ రిషికేశ్, జిల్లా సఖి కేంద్రం నుంచి సరిత, అనిత గ్రామానికి వెళ్లి విచారించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం కొల్లాపూర్ దవాఖానకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ జనరల్ హాస్పిటల్‌కు తరలించినట్లు సఖి సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా స్పందించారు. బాధిత మహిళలకు అండగా ఉంటామన్నారు. జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి కేసు పురోగతిని తెలుసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

# త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్

ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాటారం ఐటిఐ ఆధునీకరణ కోసం 6 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులంతా భవిష్యత్తులో నేను సెల్యూట్ చేసే స్థాయికి చేరుకోవాలని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి గా స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా కోకో కోలా అనే బహుళ జాతి కంపెనీ తీసుకోని వస్తున్నామని అన్నారు. చిన్న సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు తీసుకోని వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ కాలనీలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని, అదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మన యువకులకు వచ్చేలా అవసరమైన నైపుణ్యం అందజేస్తామని మంత్రి తెలిపారు.

# రిజర్వేషన్ పెంపుపై బీహార్ సర్కారుకు చుక్కెదురు

ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతో ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనకబడిన వర్గాలు, అణగారిన వర్గాల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతానికి పెరిగాయి. ఇక, ఆర్థికంగా వెనకబడినవారిని ఉద్దేశించిన 10శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి. ఈ పెంపుతో ఎస్సీలకు 16 నుంచి 20 శాతం, ఎస్టీలకు ఒక శాతం నుంచి రెండు శాతం, ఓబీసీ, ఈబీసీలకు కలిపి 30శాతం ఉన్న రిజర్వేషన్ 43 శాతానికి పెరిగింది. అయితే, ఈ పెంపుపై కొన్నివర్గాల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం ఈ ఏడాది మార్చిలో తీర్పును రిజర్వు చేసింది. తాజాగా 65శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ గురువారం తుది తీర్పు వెలువరించింది.

# కాటేసిన కల్తీ సారా

నిందితులను అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తరహా ఘటనలను నివారించడంలో విఫలమైన అధికారులపైనా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నవారి గురించి ప్రజలకు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాజాన్ని నాశనం చేసే ఇలాంటి నేరాల్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. విషాదంపై సీబీ సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.కళ్లకురిచ్చి జిల్లాలోని కరుణాపురం ప్రాంతంలో నాటుసారా తాగి మంగళవారం నుంచి ఇప్పటి వరకు 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న 18 మందిని పుదుచ్చేరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మరో ఆరుగురిని సేలంలోని మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనలో కె.కన్నకుట్టి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. 200 లీటర్లకు పైగా అక్రమ సారాను సీజ్ చేశారు.

# జమ్మూకాశ్మీర్‌లో తర్వలో ఎన్నికలు

### అసెంబ్లీ ఎలక్షన్లకు సన్నాహాలు షురూ : ప్రధాని మోదీ

**శ్రీనగర్(జనంసాక్షి):**జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల కోసం సన్నాహాలు మొదలయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కేంద్రపాలిత త్వరలోనే రాష్ట్ర హోదాను కూడా పొందనుందని అన్నారు.శ్రీనగర్‌లో రూ.1500 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రదాడులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. శత్రువులకు తగిన సమయంలో దీటైన సమాధానం ఉంటుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న డాల్ సరస్సు వద్ద ఏర్పాటు చేసే కార్యక్రమంలో మోదీ పాల్గొన నున్నారు.జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 అడ్డుగోడ తొలగిపోయిందని.. రాజ్యాంగ ఫలాలు అందుతున్నాయని అన్నారు. భారత్ రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలవుతోందన్నారు. ఇక్కడ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం గత పదేళ్లుగా కృషి చేస్తోందన్నారు. గడిచిన శతాబ్దంలో దేశం అస్థిర ప్రభుత్వాలను చూసిందని.. పదేళ్లలో ఐదుసార్లు సాధారణ ఎన్నికలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఎన్నుకో వడం ద్వారా ప్రపంచానికి భారత్ బలమైన సందేశం ఇచ్చిందన్నారు.ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్‌లోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొందని.. తద్వారా వారు ప్రజాస్వామ్య విజయాన్ని సాధించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 2వేల మంది స్థానిక యువతకు నియామక పత్రాలు అందజేశారు.





# మోదీజీ.. యుద్ధాలు ఆపారు.. లీకేజీలు ఆపలేరా!

ఇప్పుడు ప్రజలు భయపడటం లేదు. ఈ ఎన్నికల ఫలితాలు ఆ విషయాన్ని వెల్లడిచేశాయి. వినయం, గౌరవం, రాజీ వంటి పదాలకు మాజీ ప్రధానులు అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ గౌరవమిచ్చారు. నరేంద్రమోదీకి వాటిపై నమ్మకం లేదు" అని రాహుల్ దుయ్యబట్టారు. ఇదిలా ఉంటే.. జూన్ 21న యోగా డే రోజున నీట్‌లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

**నీట్ పేపర్ లీక్ వెనక తేజస్వి సహాయకుడు**

'నీట్– యూజీ ప్రవేశపరీక్ష 2024లో జరిగిన అవకతవకలు, పేపర్‌లీక్ వెనక ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ సహాయకుడి ప్రమేయం ఉందని బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఆరోపించారు. ఈమేరకు మీడియాతో మాట్లాడారు.నీట్ కుంభకోణం దర్యాప్తు నిమిత్తం బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేయగా.. ఇప్పటివరకు 14 మంది అరెస్టయ్యారు. వారిలో ఒక జూనియర్ ఇంజినీర్ కూడా ఉన్నారు. తేజస్వి సహాయకుడు బిహార్ రోడ్ కన్‌స్ట్రక్షన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగికి ఫోన్ చేసి.. ఆ ఇంజినీర్ కోసం ఒక గది బుక్ చేయించినట్టు సిన్హా ఆరోపించారు. పరీక్ష జరగడానికి నాలుగురోజుల ముందు ఈ కాల్ వెళ్లినట్లు చెప్పారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వారికి అధికారం లేకపోయినా.. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటున్నారని విమర్శించారు. పట్నాలోని ఎన్‌హెచ్‌ఏఐ గెస్ట్‌హౌస్‌లో ఆ రూమ్ బుక్ చేసిన ఆర్‌సీడీ ఉద్యోగితో పాటు మరో ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు సిన్హా చెప్పారు. దీనిపై బిహార్ ఎన్‌హెచ్‌ఏఐ స్పందించింది. తమకు పట్నాలో అసలు గెస్ట్‌హౌస్ సౌకర్యమే లేదని చెప్పింది. మరోవైపు ఆర్జేడీ అదేతరహా ఆరోపణలు చేసింది. ఇతర నిందితులతో భాజపా, జేడీయూకు సంబంధాలు ఉన్నాయని వెల్లడించింది.అటు నీట్ పేపర్ లీక్ ఘటన కలకలం సృష్టిస్తుంటే.. ఇటు జాతీయ పరీక్ష సంస్థ మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహిం చిన యూజీసీ–నెట్ జూన్–2024 పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి కీలక పరీక్షల్లో పదేపదే అవకతవకలు చోటుచేసుకోవడంపై విపక్ష ఇండియా కూటమి నేతలు ఎక్స్ (ట్విటర్) వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. కొందరైతే ఈ పరిస్థితులను ఎడ్యుకేషన్ ఎమర్జెన్సీ అని వ్యాఖ్యానిం చారు."మీరు పరీక్షల గురించి చాలా మాట్లాడతారు. మరి నీట్ పరీక్ష గురించి ఎప్పుడు మాట్లాడతారు. యూజీసీ–నెట్ రద్దు లక్షలాది మంది ప్రజల విజయమని అన్నారు.

# యూజీసీ నెట్ పరీక్ష రద్దు

రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. అయితే ఇందులో అక్రమాలు జరిగాయని కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి (ఐసీసీసీసీ) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం బుధవారం యూజీసీకి నివేదిక ఇచ్చింది. అందులోని వివరాల ప్రకారం.. పరీక్షల్లో అవకతవకలు జరిగాయనడానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని యూజీసీ నిర్ధారించింది. దీంతో పారదర్శకత, విశ్వసనీయత కోసం ఈ పరీక్షను రద్దు చేస్తున్నామని కేంద్ర విద్యాశాఖ బుధవారం ప్రకటించింది. త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించింది. తేదీని తరువాత ప్రకటిస్తామని తెలిపింది. అదే సమయంలో అవకతవకలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నామని వెల్లడించింది. యూజీసీ నెట్ పరీక్షకు దాదాపు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత సాధించడానికి ఈ పరీక్షను కేంద్రం నిర్వహిస్తోంది. ఇప్పటికే ఎన్‌టీఏ నిర్వహించిన నీట్ పరీక్షపై తీవ్ర వివాదాలు ముసురుకున్న నేపథ్యంలో నెట్ పరీక్ష లోనూ అవకతకవలు జరగడం, పరీక్ష రద్దు కావడం సంచలనం సృష్టించింది.

**త్వరలోనే యూజీసీ నెట్ పరీక్ష**

ఈ ఏడాది జరిగిన యూజీసీ నెట్ జూన్–2024 పరీక్ష లో అక్రమాలు జరిగినట్లు నివేదిక అందడంతో కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా కేంద్ర విద్యాశాఖ అధికారులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షపై తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సుమోటోగా చర్యలు చేపట్టినట్లు విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ గురువారం వెల్లడించారు. త్వరలోనే కొత్త పరీక్ష తేదీని ప్రకటిస్తామని తెలిపారు. "నెట్ పరీక్ష లో అవకతవకలు జరిగాయని, విశ్వసనీయత దెబ్బతిందని ఏజెన్సీలు ఇచ్చిన నివేదికతో మాకు అర్థమైంది. అందుకే పరీక్షను రద్దు చేశాం. ప్రస్తుతం దీనిపై దర్యాప్తును సీబీఐకి అప్పగించినందుకు ఇంతకంటే వివరాలను మేం వెల్లడించలేం. త్వరలోనే మళ్లీ పరీక్షను నిర్వహిస్తాం. బాధ్యులు ఎవరైనా సరే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని జైశ్వాల్ వెల్లడించారు. జూన్ 18వ తేదీన దేశంలోని అనేక నగరాల్లో ఓఎమ్మార్ (పెన్ను, పేపరు) విధానంలో యూజీసీ నెట్ (జఉఅ ఔఇు) పరీక్ష జరిగింది. దీనిని ఎన్‌టీఏ రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. అయితే ఇందులో అక్రమాలు జరిగాయని కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి (ఐసీసీసీసీ) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం బుధవారం యూజీసీకి నివేదిక ఇచ్చింది. దీంతో పరీక్షను రద్దు చేశారు. ఓవైపు నీట్ యూజీ పరీక్షలో అక్రమాలపై వివాదం కొనసాగుతున్న వేళ యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేయడం తీవ్ర దుమారం రేపింది. దీనిపై ప్రతిపక్షాలు కేంద్రంపై ధ్వజమెత్తాయి. లీక్‌లు, మోసాలు లేకుండా మోదీ సర్కారు పరీక్షలు నిర్వహించలేకపోతోందంటూ ఎద్దేవా చేశాయి. 'పరీక్షా పే చర్చా' అంటూ హంగామా చేసే ప్రధాని.. ఈ లీక్‌లపై మాట్లాడుతారా? అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు.

# నీట్ బండారం బట్టబయలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్– యూజీ ప్రవేశపరీక్ష 2024 లో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు సమాచారం రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దీన్ని తోసిపుచ్చింది. అయితే, పేపర్ లీక్ నిజమేనని తాజాగా బయటికొచ్చింది. ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం తమకు అందిందని బిహార్‌లో అరెస్టయిన కొందరు విద్యార్థులు పోలీసుల ఎదుట అంగీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఇందులోభాగంగానే ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. వీరిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్‌తో పాటు ముగ్గురు నీట్ అభ్యర్థులు కూడా ఉన్నారు. వీరిలో ఓ అభ్యర్థి జూనియర్ ఇంజినీర్‌కు స్వయానా మేనల్లుడు కావడం గమనార్హం. రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కు ప్రిపేర్ అవుతున్న నాకు మామయ్య ఫోన్ చేశారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశానని, ఇంటికి రమ్మని పిలిచారు. నీట్ పరీక్ష మే 5 తేదీకి ఒక రోజు ముందు అంటే మే 4వ తేదీ రాత్రి నా స్నేహితులను తీసుకుని నేను మామయ్య వద్దకు వెళ్లాను. అక్కడ నాకు నీట్ ప్రశ్నపత్రం, ఆన్సర్ షీట్ ఇచ్చారు. రాత్రంతా వాటిని మేం బట్టీపట్టాం. మరుసటి రోజు పరీక్షా కేంద్రానికి వెళ్లిన తర్వాత ప్రశ్నపత్రాన్ని చూస్తే.. ముందు రోజు మామయ్య ఇచ్చిన పేపర్‌తో పూర్తిగా మ్యాచ్ అయ్యింది' అని ఆ నీట్ అభ్యర్థి పోలీసులకు వెల్లడించాడు. ఇదే విషయాన్ని లిఖిత పూర్వకంగా రాసిచ్చాడు. దీంతో నీట్ అక్రమాల వ్యవహారం మరింత తీవ్రమైంది. మరోవైపు, నీట్ పరీక్షలో అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పలు హైకోర్టుల్లో జరుగుతున్న విచారణలపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అన్ని పిటిషన్లను సుప్రీంకు బదిలీ చేయాలని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ కోరడంతో ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. ఇదే సమయంలో నీట్ యూజీ 2024 పరీక్ష రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేంద్రం, ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. అయితే నీట్ కౌన్సెలింగ్ పక్రియను ఆపేది లేదని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై నివేదిక ఇవ్వాలని బిహార్ ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ రాష్ట్రంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో బుధవారం కేంద్రం ఈ ఆదేశాలిచ్చింది. ప్రశ్న పత్రం లీకేజీతోపాటు మరిన్ని అక్రమాలు జరిగాయనే ఆరోపణలొచ్చాయి.

# కేజ్రీవాల్‌కు బెయిల్

సత్యమే గెలిచిందన్నారు. సత్యానికి కొన్నిసార్లు ఇబ్బందులు రావొచ్చేమో గానీ.. ఓటమి మాత్రం ఉండదన్నారు.

# కర్ణాటకలో ఉండాలంటే కన్నడ నేర్చుకోవాలి

పెంచుకోవాలి. రాష్ట్రంలో కన్నడ సంస్కృతి ప్రతిబింబించేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. అందు కోసం రాష్ట్రంలో నివసించే వారంతా కన్నడ నేర్చుకోవాలి. కన్నడ తప్ప మరే భాష మాట్లాడకూడదని ప్రతిజ్ఞ చేయాలి" అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు.తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో ఇటువంటి పరిస్థితి లేదని కర్ణాటక సీఎం పేర్కొన్నారు. వాళ్ల మాతృభాషలోనే మాట్లాడుతారని.. ఇక్కడ కూడా స్థానిక భాషలోనే మాట్లాడాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. విధాన సౌధలో ఏర్పాటు చేయనున్న నాదాదేవీ భువనేశ్వరి మాత కంచు విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

# రాష్ట్రంలో మరోసారి ఈడీ సోదాలు



మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున ఈడీ అధికారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంట్లో కూడా ఏక కాలంలో తనిఖీలు చేపట్టారు. ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గూడెం మహిపాల్ రెడ్డి సోదరులు ఇద్దరు మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఓ కేసులో మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధు అరెస్ట్ కాగా ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అల్లుడి ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేస్తున్నారు. గతంలో లక్డారం గనుల వ్యవహారంలో వీరిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సోదాల సమయంలో గూడెం మహిపాల్ రెడ్డి సోదరుల ఇళ్ల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు మహిపాల్ రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు కేంద్రబలగాలతో భద్రత ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా మహిపాల్ రెడ్డి అల్లుడు తాజాగా రూ.3కోట్ల ఖరీదైన విలాసవంతమైన కారు కొన్నట్లు సమాచారం.

# సింగరేణిపై భాజపా, భారాస కుట్ర

నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరానికి సంబంధించి, రాష్ట్ర, దేశ ప్రజలకు తెలియాలని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల అవసరాలు గురించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలంమొదలు పెడుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో వేలం జరగబోతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు రాష్ట్రాన్ని పాలించింది. తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం మాటలు ఉన్నాయి. దాదాపు నలభై రెండు వేల మంది ఉద్యోగస్తులు నేరుగా సింగరేణిలో పని చేస్తున్నారు, 26 వేల మంది ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇన్ని వేల మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థ గురించి రాష్ట్ర ప్రజలకు తెలియాల్సి ఉంది. 40 బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026 కి పూర్తిగా పడిపోతుంది. బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2031, 32 వరకు నిలబెట్టుకోవాలన్న సింగరేణి కొత్త బొగ్గు గనులను సంపాదించుకోవాలి. లేదా సింగరేణి అనేది చరిత్రలా నిలిచిపోతుంది. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి, నేరుగా జీ 2 జీ చేయాలి. కేంద్రంలో ఉన్న బీజేపీ 1957 చట్టం ప్రకారం సవరణ తీసుకుని వచ్చి దేశంలో ఉన్న బొగ్గు గనులు అన్నింటినీ ఆక్షన్ ద్వారా నిర్వహించే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇకపోతే తెలంగాణ ప్రయోజనాల గురించి బీఆర్ఎస్ మాట్లాడటం సరికాదని భట్టి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ ఇప్పుడు మేము పదేళ్లు సింగరేణిని కాపాడమని మాట్లాడుతున్నారు. 2021అక్టోబర్‌లో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. నవంబర్ 5 న గత సీఎం కేసీఆర్ ఒక కోర్ కమిటీ నిర్వహించారు. కేసీఆర్ గోదావరి ప్రాంతాల గనులు తీసుకోకూడదని ఆదేశాలు జారీ చేశారు. రెండు కంపెనీలు బీఆర్ఎస్ పార్టీకి దగ్గరి వాళ్లవి కాబట్టి సింగరేణికి కాకుండా వాళ్లకు ఇచ్చేశారు. ఒరిస్సాలో బల్క్ ఈ బ్లాక్ అని ఉంది. దాని ఒక్కదానికి బిడ్ వేయాలని ప్రయత్నం చేశారు. ఇప్పుడు కూడా తెలంగాణ మీద ప్రేమ ఉన్నట్లు బీజేపీ మంత్రులు మాట్లాడుతున్నారు. తెలంగాణలో తలమా నికంగా ఉన్న ఈ శాఖ మీ దగ్గరకు వచ్చింది. సింగరేణి తరఫున రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బొగ్గు గనుల శాఖ మం త్రి కిషన్ రెడ్డిని కలుస్తాం.రాష్ట్రంలో నిజంగా సమయం తీసుకుని ప్రధానిని, కిషన్ రెడ్డిని అందరం కలిసి కలుద్దాం. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా 0.5 పర్సంట్ చూపించి కేంద్ర ప్రభుత్వాన్ని కోరతాం. ఆ రెండు బ్లాక్‌లు కూడ మేము అడుగుతాం ఆ రెండు సంస్థల సమయం కూడా మించి పోయింది కాబట్టి వాటిని ఇతర కంపెనీలకు ఆక్షన్ పెట్టకుండా అడుగు తాం. ఎవరో వ్యక్తి అంటున్నాడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పని చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ కానీ ఇంకా ఎవరైనా మాట్లాడటానికి, చర్చకు కాగితాలతో రావాలని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.



# సింగరేణిని పరిరక్షించుకోవాలి

ఆనాడు 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మకంగా ఉంటామని కేసీఆర్ చెబితే.. వాటితో ఏం చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 16 ఎంపీ సీట్లు వచ్చిన తెదేపా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో భాజపా, కాంగ్రెస్‌కు చెరో 8 సీట్లు ఉన్నాయి. బొగ్గు గనుల వేలం పెట్టవద్దని గతం లో పీసీసీ అధ్యక్షుడిగా రేవం త్‌రెడ్డి.. ప్రధాని మోదీకి లేఖ రా శారు. ఒడిశాలో రెండు గనులను వేలం లేకుండా నైవేలీ లిగ్నైట్‌కు అప్పగించారు. అలాగే గుజరాత్‌లో రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు 2015లో వేలం లేకుండానే నేరుగా నాలుగు గనులు కేటాయించారు. తమిళనాడులో కూడా బొగ్గు గనులను వేలం నుంచి మినహాయించాలని ఆ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రిని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్లే నష్టాల్లోకి వెళ్లింది. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్ల అనే గనిని క్యాప్టివ్ మైన్ కింద కేటాయించాలని వైజాగ్ స్టీల్ ప్లాంట్ అడిగితే కేంద్రం ఇవ్వలేదు. ఆప్షన్‌లో అదానీకి అప్పగించింది. సొంతగని లేకపోవడంతో నష్టాల్లోకి వెళ్లిన విశాఖ ఉక్కును అమ్మాలని చూశారు. ఇప్పుడు సింగరేణి విషయంలో కూడా అదే విధమైన వ్యూహం అలవంబించబోతున్నారు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్ర ఇది. 2021 డిసెంబరు 11 నాడు సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి వైఖరి ఎందుకు మారింది? వేలంలో పాల్గొంటామని ఇప్పుడు చెబుతున్నారు. తెలంగాణలోని బొగ్గు గనులు వేలం వేయకుండా ఇప్పటి వరకు భారాస రక్షణ కవచంలా నిలిచిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని ఖతం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం బొగ్గు గనుల యాక్షన్‌ను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. 16ఎంపీల పవర్ ఏంటో ఏపీని చూస్తే తెలుస్తుందని ఉద్ఘాటించారు. రేవంత్ ఎందుకు ఆపడం లేదు. కేసుల భయమా? అని ఎద్దేవా చేశారు. అందుకే 16ఎంపీలు గెలిపించాలని ప్రజలను కోరామన్నారు. సింగరేణి మెడ మీద కేంద్రం కత్తి పెడితే సీఎం రేవంత్ ఆ కత్తికి సాన పడుతున్నారని సెటైర్లు విసిరారు. సింగరేణికి ప్రమాదం వస్తే కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. సింగరేణిని కార్పొరేట్ గద్దలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామ న్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నిర్ణయాన్ని అడ్డుకుంటామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆలోచించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒరిస్సా, గుజరాత్‌లో ప్రభుత్వ సంస్థలకు ఇచ్చి ఇక్కడ సింగరేణికి బొగ్గు బ్లాక్స్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సింగరేణి వేలంలో ఎందుకు పాల్గొనాలని నిలదీశారు.

# ఏపీ ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి

సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఎస్.సవిత, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు, ఏలూరి సాంబశివరావు, ఎం.ఎస్ రాజు, సుంకర విజయ్ కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి బుచ్చయ్య చౌదరి ఎన్నికైన విషయం తెలిసిందే. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన పలుమార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. సీనియర్ ఎమ్మెల్యే కావడంతో ఆయనే ప్రొటెం స్పీకర్‌గా ఎంపికయ్యారు.

# సౌదీలో రికార్డు ఉష్ణోగ్రతలు

హజ్ యాత్ర పూర్తి చేసుకున్నారు. ఇందులో 22 దేశాలకు చెందిన యాత్రికులు 16 లక్షలమంది ఉండగా, సౌదీ పౌరులు రెండు లక్షలకు పైగా ఉంటారని సౌదీ హజ్ అధికార యంత్రాంగం తెలిపింది.యాత్ర అనుమతి కోసం భారీగా ఖర్చు అవుతుండటంతో చాలామంది అక్రమ మార్గాల్లో మక్కాకు చేరుకుంటున్నారు. ఇలా వచ్చే వేల మందిని స్థానిక అధికారులు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ.. వారి సంఖ్య ఎక్కువగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. యాత్ర ముగిసిన తర్వాత.. రిజిస్టర్ చేసుకున్న వారికే అక్కడ అధికారులు ఏర్పాటు చేసిన తాత్కాలిక ఏసీ షెల్టర్లలో బస చేసేందుకు అనుమతి ఉంటుంది. అందుకే మరణిస్తున్న వారిలో రిజిస్టర్ చేసుకోని వారే అధికంగా ఉన్నారని అధికారులు చెప్పారు.



# విద్యార్ధుల ప్రాణాలకు రక్షణేదీ?

- సమస్యలతో సహవాసం
- స్లాబు నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- ఊడిపోతున్న తలుపులు, కిటికీలు
- అపరిశుభ్రంగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు
- ఇది ఎన్ఎస్పి క్యాంపు లోని ఎస్సీ (సి), ఆనంద నిలయం వసతిగృహం దుస్థితి
- జిల్లా కలెక్టర్ దృష్టి సారించినా..?






**ఖమ్మం జిల్లా ప్రతినిధి, జూన్ 20 (జనం సాక్షి):** విద్యా సంవత్సరం పునః ప్రారంభమైంది.. విద్యార్థులు విద్యాసంస్థలకు పరుగులు పెడుతున్నారు.. నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు ఎక్కువ మంది విద్యార్థులు జిల్లా కేంద్రమైన ఖమ్మం వైపు చూస్తున్నారు.. ఇప్పటికే పాఠశాలల్లో చేరిన విద్యార్థులు సీట్ల కోసం వసతి గృహాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.. జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని ఎన్ఎస్పి క్యాంపులో ఉన్న ఎస్సీ వసతి గృహాలకు ప్రతి సంవత్సరం విద్యార్థుల తాకిడి అధికంగా ఉంటుంది.. ఈ వసతి గృహాలకు కూతవేటు దూరంలోనే పాఠశాల ఉండటంతో విద్యార్థులు వీటిలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తారు. అయితే ఎస్సీ బాలుర వసతి గృహం (సి), బాలుర ఆనంద నిలయం వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. ఈ వసతి గృహాల్లో చదివే విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేదంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఈ విషయం ఆ రెండు వసతి గృహాల్లోకి ప్రవేశించిన వెంటనే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. స్లాబు నుండి ఊడిపోతున్న పెచ్చులు, దాని కిందే నిద్రిస్తున్న విద్యార్థులు, అపరిశుభ్రతకు మారుపేరుగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు, రాత్రి వేళలో విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన తలుపులు, కిటికీలు ఊడిపోతూ విద్యార్థుల రక్షణను ఎక్కిరిస్తున్నాయి. గతంలో ఎన్ఎస్పి క్యాంపులోని బాలికల వసతి గృహంలో స్లాబ్ నుండి లీకైన వాననీటి వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక బాలిక మృతి చెందింది. ప్రస్తుతం ఈ వసతి గృహంలోనూ స్లాబు అలాగే లీక్ అవుతుంది. వసతిగృహం పునః ప్రారంభం మొదట్లోనే అన్ని రక్షణ చర్యలు తీసుకోవలసిన సంక్షేమాధికారి ఏం చేస్తున్నాడో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. దళిత విద్యార్థుల రక్షణ పై ఖమ్మం జిల్లా కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే మారుమూల ఉన్న వసతి గృహాల మాటేమిటని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ వసతి గృహాల దుస్థితిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి దారించాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ రెండు వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపంలా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.







### శంషాబాద్ నుంచి కౌలాలంపూర్ వెళ్తున్న

## విమానానికి తప్పిన ప్రమాదం

- విమాన సిబ్బందితోపాటు 130 మంది ప్రయాణికులు సురక్షితం




**శంషాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కౌలాలంపూర్ వెళ్తున్న మలేషియా విమానానికి తప్పిన పెను ప్రమాదం. టేక్ ఆఫ్ అయినా 15 నిమిషాలకే కుడివైపు ఇంజిన్ లో మంటలు రావడంతో మంటలను గుర్తించిన పైలట్ వెంటనే లాండింగ్ కి అనుమతి కోరారు. కొద్దిసేపు పాటు విమానాన్ని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చక్కర్లు కొట్టింది. ప్రమాద తీవ్రతను గుర్తించి అత్యవసర లాండింగ్ కి అనుమతించిన ఏటి సి అధికారులు మలేషియా ఎయిర్లైన్స్ విమానాన్ని పైలెట్ సేఫ్ గా లాండింగ్ చేయించారు. విమానంలో సిబ్బందితోపాటు 130 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. విమానం సేఫ్‌ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానం క్యాన్సల్ కావడంతో సగం మంది ప్రయాణికులు తమ టికెట్ను క్యాన్సిల్ చేసుకున్నారు. మిగతా సగం మంది ప్రయాణికులకు హోటల్ వసతి కల్పించారు.

## ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌కు ఘనసన్మానం

- వీడ్కోలు పలికిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది



**జగిత్యాల్ బ్యూరో, జూన్ 20 (జనం సాక్షి) :** జగిత్యాల ఎస్పి గా విధులు నిర్వహించిన సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ బదిలీ పై సూర్యాపేట జిల్లాకు వెళు న్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పి కి పోలీస్ అధికారులు వినూత్నంగా రీతిలో వీడ్కోలు పలికారు.జిల్లాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొని పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా శాంతి కోసం రాజీపడకుండా తనతో పాటు అంకితభావంతో సమిష్టిగా కృషి చేసినందుకు పేరు పేరునా హెూం గార్డ్ ఆఫీసర్స్ నుండి ఉన్నత అధికారుల వరకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చిన్న అవాంఛనియ సంఘటనలు జరగకుండా, గొడవలు లేకుండా ప్రశాంతవాతావరణం లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా విధులు నిర్వహించిన అందరికీ అభినందనలు తెలిపారు. గడిచిన 10 నెలల పాటు జిల్లాలో పని చేసే అవకాశం రావడం సంతోషాన్ని ఇచ్చిందని , ప్రభుత్వ అధికారులు ఉత్తమ సేవలందిస్తే గుర్తింపు పొందుతారని, పోలీస్ అధికారులు సిబ్బంది రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎస్పీకి పోలీస్ అధికారులు గజమాలతో సత్కరించి పోలీస్ వాహనంలో ఎక్కించి అందరు పోలీసు అధికారులు వాహనాన్ని తాడుతో లాగుతూ ర్యాలీ గా ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వినోద్ కుమార్ , భీమ్ రావు ,డిఎస్పి లు రవీంద్ర కుమార్, రఘు చంధర్, ఉమా మహేశ్వర రావు, డి సి ఆర్ బి, ఎస్ బి, సి సి ఎస్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, నాగేశ్వర రావు, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, సిఐలు వేణుగోపాల్,రామ్ నరసింహారెడ్డి, రవి, సురేష్ ,నవీన్, ఆర్ఐలు , జనీమియ, వేణు ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్ఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కరీంనగర్ బ్యూరో, (చిగురుమామిడి) జూన్ 20 (జనం సాక్షి) :** చిగురుమామిడి మండ లంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరితను కలిసి విన్నవించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి చిటమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చీల లక్ష్మా రెడ్డిలు మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు, మాడల్ స్కూల్ పిల్లలకు రవాణా సౌకర్యం మెరుగు పర్చాలని కోరగా ఆర్ యం, డిప్యూటీ ఆర్.యం భూపతి రెడ్డి సానుకూలంగా స్పందించారు. హుస్నాబాద్ నుండి చిగురుమామిడి, చిన్న ముల్కనూర్, ఇందుర్తి మీదుగా హైద్రాబాద్ వరకు, హుస్నాబాద్ నుండి కరీంనగర్ వయా పీచుపల్లి, మాడల్ స్కూల్ బస్ గాగిరెడ్డి పల్లి నుండి లంబాడి పల్లె మీదుగా, హుస్నాబాద్ నుండి సుందర గిరి, ఇందుర్తి, ముదిమాణిక్యం, రామంచ ముల్కనూర్ మీదుగా కరీంనగర్, కరీంనగర్ నుండి కోహెడ వెళ్లే బస్ రామంచ మీదుగా పునరుద్దరించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు రూట్లలో తక్షణమే బస్ సర్వీస్ కలిపిస్తామని, కొత్త బస్సులు రాగానే మిగతా రూట్లలో సౌకర్యం కలిపిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి చొరవ చూపి బస్ సౌకర్యం కల్పించడం పట్ల కాంగ్రెస్ నాయకులు ధన్యవాదములు తెలిపారు.

### పర్యాటక భవన్‌లో

## మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీ

- ఉద్యోగులు లేక.. దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు

**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** హిమాయత్ నగర్ పర్యాటక భవన్‌ను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు పట్టిక, బయోమెట్రిక్ అటెండెన్స్ పరిశీలించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోవడం, హాజరుశాతం తక్కువగా ఉండటంపై మంత్రి ఆగ్రహించారు. ప్రతీ ఫ్లోర్ తిరిగి ఉద్యోగులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ కుర్చీలే ఎక్కువగా దర్శనం ఇవ్వడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సంవత్సర కాలానికి సంబంధించిన అటెండెన్స్ జాబితా తయారు చేయాలని వెంటనే ఆదేశించారు. హాజరుశాతం, ఉద్యోగులు పనితీరుపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. ఉన్నతాధికాల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకూ బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సుస్పష్టం చేశారు.

## నిరుద్యోగ యువత ఆందోళన

- నోటిఫికేషన్లు ఇవ్వాలంటూ ధర్నా



**హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని నిరుద్యోగులు ధర్నాల బాట పట్టారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 పిలవాలని, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ఈ ధర్నాకు పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు. గ్రూప్-2లో 2 వేల పోస్టులు, గ్రూప్ -3లో 3 వేల పోస్టులకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్-2, 3 రాతపరీక్షలను డిసెంబర్ వరకు వాయిదా వేయాలన్నారు. ఇక జీవో 46ను రద్దు చేయాలన్నారు. ధర్నాకు హాజరైన అభ్యర్థులు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేరుస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, చింతపండు నవీన్ కుమార్ ఇద్దరు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఎన్నో హామీలిచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీలు అయ్యాక నిరుద్యోగుల బాధలను పట్టించుకోవడం లేదని వాపోయారు. నిరుద్యోగుల సమస్యలపై వారిద్దరూ స్పందించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి వంత పాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా, ఇప్పటి

## వరంగల్ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు

- అభివృద్ధికి బడ్జెట్ దిక్సూచి
- నగరానికి ముంపు నివారణ చర్యలు
- నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు



**వరంగల్ ఈస్ట్, జూన్ 20 (జనంసాక్షి) :** వరంగల్ నగరపాలక సంస్థ బడ్జెట్ ఆమోదం పొందిన తర్వాత గురువారం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ...ముఖ్యమంత్రి మరియు మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశనంలో మంత్రివర్యులు కొండా సురేఖ, ఎంఎల్ఏలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని. అందరి సహకారంతో రానున్న రోజుల్లో వరంగల్ నగరాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి బడ్జెట్ దిక్సూచి అని, ప్రజలపై భారం లేకుండా పాలకవర్గ బడ్జెట్ ను ప్రవేశ పెట్టామన్నారు. వరంగల్ మహానగర పాలకవర్గం కొలువుదీరిన తర్వాత మూడవ సారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని, నగర ప్రజలకు ఎలాంటి పన్నుల భారం లేకుండా ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనాలు-వ్యయాలు సిద్ధం చేయడం జరిగింది. బల్దియా బడ్జెట్ లో వాస్తవాలకు దగ్గరగా ఉండేందుకు కొన్ని సవరణలు జరిగింది. ఈ బడ్జెట్ డివిజన్ల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. బల్దియా స్వంత ఆదాయం ద్వారా వచ్చే 237 కోట్ల 2 లక్షల రూపాయలలో 80 కోట్ల రూపాయలు సిబ్బంది జీత బత్యాలు, 25 కోట్ల 80 లక్షల రూపాయలు పారిశు ద్య నిర్వహణకు, 18 కోట్ల 45 లక్షల రూపాయలు విద్యుత్ చెల్లింపులకు, 23 కోట్ల 70 లక్షల రూపాయలు గ్రీన్ బడ్జెట్ కు, 25 కోట్ల 75 లక్షల రూపాయలు ఇంజనీరింగ్ విభాగానికి, 18 కోట్ల 50 లక్షల రూపాయలు సాధారణ నిర్వహణకు, 1 కోటి 20లక్షల రూపాయలు టౌన్ ప్లానింగ్ కోసం, కోటి 50 లక్షల రూపాయలు డిజాస్టర్ రెస్పాన్స్ కొరకు కేటాయించడం జరిగిందని అన్నారు. విలీన గ్రామాలలో, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాలలోని మురికివాడల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 14 కోట్ల 4 లక్షలు, ప్రజా సౌకర్యాల కల్పన, పార్కుల అభివృద్ధి, జంతువధ శాలలు, వీధి వ్యాపారులు వెండింగ్ జోన్లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు రూ. 5 కోట్ల 20 లక్షలు, వార్డుల వారిగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను రూ. 22 కోట్ల 88 లక్షల రూపాయాలు కేటాయించడం జరిగిందని తెలిపారు.వరంగల్ నగరం ముంపుకు నివారణ చర్యల్లో భాగంగా కాలువలు నిర్మాణం చేపట్టుటకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి టి యు ఎఫ్ ఐ డి సి క్రింద నగరానికి 250 కోట్ల రూపాయలు మంజూరు చేయడం పట్ల వరంగల్ నగర ప్రజల పక్షాన మరియు మన పాలకవర్గం తరఫున ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందుకు సహకరించిన జిల్లాకు చెందిన రాష్ట్ర అటవీశాఖ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి వరంగల్ తూర్పు శాసన సభ్యురాలు కొండ సురేఖ కి, వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య , వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఈ కౌన్సిల్ సమావేశం ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసశారు. ఈ సందర్భం గా ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం గా ఉన్నదని బడ్జెట్ కేటాయింపులపై వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు , పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి లు, పలువురు కార్పొరేటర్ లు హర్షం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఎం ఎల్ సిలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పరకాల శాసనసభ్యులు రేవురి ప్రకాష్ రెడ్డి, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు, హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, హన్మకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డెప్యూటీ మేయర్ రిజ్వాన శమిమ్ మసూద్, కార్పొరేటర్లు, బల్దియా వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే మేడ్చల్‌లో దొంగలదోపిడీ

- బంగారం షాపులో చొరబడి దోచుకున్న దుండగులు

**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో పట్టపగలు భారీ చోరీ జరిగింది. మేడ్చల్ కేంద్రంలో పట్టపగలే పెద్ద దొంగతనం జరిగింది. బంగారం షాపులోకి వచ్చిన దోపిడీ దొంగలు.. కత్తితో షాపు ఓనర్‌ను పొడిచి.. బంగారం దోచుకుని.. బైక్ పై వెళ్లిపోయారు.. సమీపంలోనే పోలీస్ స్టేషన్ సైతం ఉండటం మరింత సంచలనంగా మారింది. గురువారం మధ్యాహ్నం మేడ్చల్ పోలీస్ స్టేషన్ కు ఆనుకొని ఉన్న జగదాంబ జ్యూవెలరీ షాపుకు ఇద్దరు వచ్చారు. ఇందులో ఒకరు మాస్క్, మరొకరు బురఖాను ధరించి షాపులోకి వచ్చారు. బంగారం కొనే విధంగా నటించిన బురఖా దొంగ తన దగ్గర ఉన్న కత్తితో షాప్ ఓనర్ శేషారంపై దాడి చేసి దొరికినంత బంగారాన్ని ఎత్తికెళ్లారు. వెంటనే షాప్ ఓనర్ కేకలు వేయడంతో దొంగలు బైక్ పై అక్కడినుండి పరారయ్యారు. పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ ను సైతం లెక్కచేయకుండా బంగారం దోపిడీ చేసి పారిపోయారు దొంగలు. ఇదంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలతో రికార్డు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. దొంగలను అంతరాష్ట్ర ముఠాగా గుర్తించారు. బంగారం ఎంత పోయిందో తెలియాల్సి ఉంది. ఇద్దరు దొంగలు క్షణాల్లో ఓ బంగారం షాపులోకి చొరబడి ఉన్నది మొత్తం ఊడ్చుకుపోయారు. మేడ్చల్‌లో ఉన్న జగదాంబ బంగారం షాపునకు ఇద్దరు దుండగులు బుర్కా వేసుకుని వచ్చారు. కత్తితో షాపు యజమాని మెడ కింద పొడిచి బంగారం ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు ఓ పల్సర్ బైకుపై నగల దుకాణానికి వచ్చారు. ఆ బైకును షాపు ముందే పార్క్ చేసి ఉంచి.. ఇద్దరూ లోనికి వెళ్లారు. ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు బుర్ఖా వేసుకోగా.. మరొక దొంగ సాధారణ దుస్తుల్లోనే ఉన్నాడు. షాపులోనికి ప్రవేశించిన కొన్ని క్షణాల వ్యవధిలోనే తొలుత అక్కడున్న సేల్స్ పర్సన్‌ని బుర్ఖా వేసుకున్న వ్యక్తి బెదిరించారు. అతను వెంటనే లోనికి వెళ్లిపోగా.. ఓనర్ ను బెదిరించి వారు తెచ్చుకున్న బ్యాగుల్లో కొన్ని బంగారు వస్తువులను దోచుకొని బయటికి పరుగులు తీశారు. అప్పటికే ఓనర్ పై బుర్ఖా వేసుకున్న వ్యక్తి కత్తితో దాడి చేశాడు. బయటకు పరుగున వచ్చి బైక్ పై పారిపోతున్న వారిపై ఓ ఇనుప స్టూలుతో సేల్స్ మేన్ దాడి చేశాడు. అయినా వారు బైక్ పై ఉడాయించారు.

## కమ్యూనిస్టులకు కాలం చెల్లింది

- జాతీయ బిసి కమిషన్ సభ్యుడు, బిజెపినేత ఆచారి

**మహబూబ్‌నగర్, జూన్20 (జనంసాక్షి) :** కాంగ్రెస్, కమ్యూనిస్టులు తమ మౌలిక సిద్ధాంతాలు వదిలేసి రాజకీయం చేస్తున్నారని జాతీయ బిసి కమిషన్ సభ్యుడు, బిజెపినేత ఆచారి ఆరోపించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోయిందని, కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీ ఎదుగుతోందని చెప్పారు. రైతుల రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు బీజేపీ ప్రత్యేక ఉద్యమం చేపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సాయం అందించి ఆదుకుంటోందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సాయం అందించటంతో పాటు గ్రామీణ వ్యవస్థలో సమూలు మార్పులు తెచ్చేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

# నాయకులకు పౌరుల ప్రోగ్రెస్ రిపోర్ట్ అవసరం

మానవ సంబంధాల మధ్య, కుటుంబ సంబంధాల మధ్య కంజూమరిజం ప్రవేశించి ఏది ప్రధానం,ఏది అప్రదానం అనేది మనిషి నేడు మరచిపోతున్నాడు. ప్రపంచీకరణ నేడు ప్రతి ఇంటి గదిలోకి ప్రవేశించింది..సహజంగా ఏర్పడాల్సిన ఆత్మీయ బంధాలు,సంబంధాలు నేడు కూడికలు, తీసివేతలు అయ్యాయి. విద్యాలయాల తరగతి గదుల్లో ఉండాల్సిన మేథమేటిక్స్ నేడు కుటుంబ సంబంధాల మధ్యకీ,మానవ సంబంధాల మధ్యకీ జొరబడింది .ఇది మరో ట్రాజెడీ.మనిషి తనతో తాను బాగా ఉండడం లేదు. అవతలి వ్యక్తితోనూ బాగా ఉండడం లేదు. అసలు తనకేం కావాలి తనకే తెలీని వింత పరిస్థితి. ఆనందాన్ని అరచేతిలో ఉంచేస్తానని ఘోష పెడుతోన్న ప్రపంచీకరణ మనిషి నుండి ఆనందాన్ని దూరం చేస్తోంది.

అవతలి ప్రపంచం కోసం మనం గ్రూమింగ్ అవ్వడం నేర్చారు. ఇందుకోసం పెద్ద గ్రూమింగ్ పరిశ్రమ ఆవిర్భవించింది. వేల కోట్ల రూపాయల వ్యాపారం నడుస్తోంది. అయితే,ఈ గ్రూమింగ్ పరిశ్రమ అయినా కనీసం మహిళలకు ఆత్మ విశ్వాసం ఇచ్చిందా? వారి జీవితాలను ఉన్నతంగా మార్చిందా? హ్యాపినెస్ ఇండెక్స్‌లో మరి మనదేశం 126 వ స్థానానికి ఎలా దిగిపోయింది? ఫిన్ ల్యాండ్ 1వ స్థానం లో ఉంది. ఇజ్రాయిల్ 5 వ స్థానం లో ఉంది. నేపాల్ 93 వ స్థానం లో ఉంది. ఇవన్నీ కూడా పెట్టుబడిదారీ దేశాలే. 5 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ గా భారతదేశం అబివృద్ధి చెందబోతుందని వింటున్నాం. దేశం అభివృద్ధి అయితే ఎవరికీ వద్దు? మన ఇల్లు అభివృద్ధి అయితే మనం సంతోషించమా? మరి ఇంటి అభివృద్ధి అంటే ఇంటిలో కంజుమర్ గూడ్స్ అభివృద్ధి కాదు కదా. ఇన్ని ట్రిలియన్ డాలర్స్ అభివృద్ధి ఫలాలు మనకు ఆనందాన్ని ఎందుకు ఇవ్వడం లేదు? ఆనందంలో మనం అంత దూరంలో జరిగిపోయాం ఎందుకు? మనం నాయకుల్ని ప్రశ్నించడం అలవాటు చేసుకోవడం లేదు. ఈ పని ఎవరో అరుంధతీ రాయ్ లూ,రవీష్ కుమార్ లూ,ధృవ్ రాఠీలు చెయ్యాల్సిన పని అనీ మన యువత అనుకోవడం మరో ట్రాజెడీ. మనకు పాలించేవారు మనం ఎన్నుకున్న నాయకులు. ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ లో ఎవరికి ఎక్కువ వోట్లు దొరికాయో వారే నాయకులు. వీరు దేవుడు పంపించిన దూతలు కాదు. ఇది ప్రజాస్వామ్యం రాకముందు, అమాయక ప్రజలను నమ్మించిన పనికి రాని, తర్క విహీనమైన సిద్దాంతం. నాయకుల్ని దేవుని దూతలుగా చిత్రీకరించి దేశంలో ఫాసిస్టు సామ్రాజ్యాలను స్థాపించడం ఒక ఎత్తు. బయట ఉన్న ధ్రువ్ రాఠీలు ఈ విషయంలో చైతన్యం కలిగిస్తున్నారు. ఇంకా మన యువతలో అధిక భాగం మత్తులోనే ఉన్నారు. నిద్రలోనే ఉన్నారు. నిస్క్రియాపరులైన పౌరులుగా మారిపోయి ఉన్నారు. ప్రశ్నకు దూరంగా జరిగిపోయి ఉన్నారు. అలా దూరంగా జరగడం వెనుక బ్రెయిన్ వాషింగ్ పరిశ్రమలో గత పది సంవత్సరాలుగా కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు అయి ఉన్నాయి. అలా ప్రశ్నించకుండా చెయ్యడానికి ఇతర అంశాలతో బిజీ చేస్తారు. పలానా ఆ మతం వారు పలానా ఐటం తిన్నారని, పలానా వారు ఆవుని తీసుకొని వెళ్లిపోతున్నారని, పలానా మతం వారు జనాభాలో పెరిగిపోతున్నారని , వీరు పెరిగిపోతే మనకు తరిమేస్తారని పనికిరాని, తర్క విహీనమైన , అత్యంత అమానవీయమైన వ్యాఖ్యలతో, విద్వేషపు రాజకీయాలతో యువత మెదళ్లను కడిగే ప్రక్రియ గత పది సంవత్సరాలనుండి కొనసాగుతోంది. తమ తమ రంగాల్లో అపారమైన జ్ఞానాన్ని సంపాదించిన చాలామంది మేధావులు కూడా దేశ రాజకీయాల విషయం వచ్చేటప్పటికి ఇలానే ఆలోచిస్తున్నారు. ఇదో పెద్ద ట్రాజెడీ. అవతల ధ్రువ్ రాఠీలకు అర్థమైన చిన్న విషయాలు మనవాళ్ళకు అర్థం కావడం లేదు. భారత పౌరులు క్రియాశీల పాత్ర నుంచి బయటికి వచ్చి నాయకుల భక్తిలో మునిగి తేలిపోయే ప్రక్రియ కొనసాగింది. ఇటీవల సోషల్ మీడియా నుండి దూసుకు వచ్చిన కొంతమంది యూ ట్యూబర్లు భారత ప్రజాస్వామ్యం ఫాసిజంలోకి పరిణమించకుండా అసాధారణమైన సేవ చేశారు. కార్యకర్తలు , రచయితలు, డిజిటల్ మీడియా, బాధ్యతాయుతమైన ప్రింట్ మీడియా కూడా అపారమైన సేవ చేసింది. అవి ఎన్నికల ఫలితాల్లో కనిపించాయి. ఒక నాయకుడు రాజు కాకుండా బలమైన ప్రతిపక్షం కనీసం సిద్ధమయింది.

రవీంద్రనాథ్ ఠాగూర్ 1950లలో రష్యా సందర్శించి అక్కడ విద్యావిధానం అభివృద్ధి చెందే విధానం మీద చాలా ఆశ్చర్యపడ్డాడు. భారతదేశంలో నాటికి అక్షరాస్యత అయిదు శాతం. భారతదేశం రష్యా, జపాన్ లాగా విద్యను అభివృద్ధి చెయ్యాలని ఆశించాడు. అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించాడు. రవీంద్రుడు వూహాజనిత కవితలు మాత్రమే రాయలేదు. దేశం అభివృద్ధి కోసం కలలు కన్నాడు. ఆ దేశాలు అప్పుడే నూరు శాతం అక్షరాస్యతను సాధించాయి. కానీ మన ప్రైమరీ, సెకండరీ విద్యాలయాల్లో నేటికీ అవసరమైన ఉపాధ్యాయులు లేరు. జపాన్ ఆనాడే అత్యంత క్రమశిక్షణతో తన విద్యావిధానం అంచెలంచెలుగా అభివృద్ధి చేసింది. అమృత్ భారత్ స్లోగన్ లు తప్ప మనకు అవేవీ కనిపించవు. వైద్యం అదే పరిస్థితిలో ఉంది. ఒక నీట్ పరీక్ష కనీసం సక్రమంగా నిర్వహించలేక పోతున్నారు. నాయకులకు పౌరులు ఎన్నుకున్నది వారు మందిరాలూ, మసీదుల్లో తపస్సు చెయ్యడం కోసం కాదు. ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు ఎలా అందించాలి? మెడిక్లెయిం పాలిసీ దయాదాక్షిణ్యాల మీద పౌరులకు విడిచి పెట్టడం కాకుండా తమవంతుగా రాజ్యం ఏ మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి మొదలైనవి ఓ ప్రణాళిక వెయ్యడం కోసం. అవతలి పెట్టుబడిదారీ దేశాలే అయినా చైనా, జపాన్ లాంటి అసంఖ్యాకమైన దేశాలు ఉత్పత్తి రంగం లోనూ, ఉద్యోగ కల్పనలోనూ అసాధారణ ప్రతిభ చూపిస్తోంటే ఇక్కడ ఇంకా ఫ్రీబీలతోనే దేశం నడుస్తోంది . విద్యార్థులకు ఒక ప్రత్యేక కోర్సు తర్వాత ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తారు. నాయకులకు కూడా ఇలానే పౌరుల ప్రోగ్రెస్ రిపోర్ట్ అవసరం.



**కేశవ్**

# 'శ్రావణపల్లి' బాయి వస్తే! విధ్వంసమే!







**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు**
**9951865223**

కేంద్రం ఈనెల 21 న దేశంలోని 60 నూతన బొగ్గు బ్లాక్లను వేలం కు పెట్టే ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. 2015 చట్టం ప్రకారం దేశంలో కొత్త బొగ్గు బ్లాకుల సింగరేణి కి, కోల్ ఇండియా కు రావాలంటే, ప్రైవేట్ సంస్థలకు సమానంగా తప్పనిసరిగా వేలంలో పాల్గొనాల్సిందే!ఈ 60 బ్లాక్ల లో తెలంగాణ లోని మంచిర్యాల జిల్లా మందమర్రి సమీప, నెన్నెల మండలం 'శ్రావణ పల్లి ' బ్లాక్ కూడ ఉన్నది. 70 శాతం ఫారెస్ట్, 30 శాతం పక్కా ఇండ్లు,వ్యవసాయ భూములు, సుమారు వెయ్యి ఎకరాల్లో 50 వేలకు పైగా మామిడి చెట్లు ఉన్న తోటలు ఇక్కడ ఉన్నాయి.భారతదేశం లోనే అతి పెద్ద మామిడి పంట ఎగుమతి అవుతున్న పరిస్థితి ఇక్కడ నుంచి ఉన్నది.సింగరేణి ఆరేండ్ల కింద ఈ బాయి ని ప్రారంభించడానికి సర్వే కు వచ్చినపుడు, అప్పటి మందమర్రి సింగరేణి జనరల్ మేనేజర్ అంథోని రాజ్ ను స్కూల్ భవనంలో, గనిని వ్యతిరేకించిన రైతులు నిర్భందించారు.

## దుమ్ము, ధూళితో విధ్వంసం

గని వల్ల తమ ప్రాంతం గ్రామాలు అన్నీ, దుమ్ముమయం అవుతాయని, పెద్ద ఎత్తున విధ్వంసం జరిగే ప్రమాదం తో పాటు, తమ జీవితాలు నాశనం అయిపోతాయి అని గ్రామాల రైతులు వ్యతిరేకించారు. ఆందోళనలు కొనసాగాయి.ఇక్కడ ఓపెన్ కాస్ట్ గని వస్తది. అందులో 12 మిలయన్ టన్నుల వరకు బొగ్గు ఉన్నది. ఇక్కడి నుంచి 11 కిలోమీటర్ల పాటు బెల్ట్ వేసి, బొగ్గును సింగరేణి కి చెందిన జైపూర్ మండలం లోని 1200 మేఘవాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ కు బొగ్గు సరఫరా చేయాలని ప్లాన్ కూడ సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ మంచి నాణ్యత గల 'సి' 'సి' హై గ్రేడ్ బొగ్గు ఉన్నట్లు గుర్తించారు. బొగ్గు కూడ పది మీటర్ల డెప్త్ లోనే లభిస్తుంది. అయితే ఫారెస్ట్ భూమి, ప్రైవేట్ పక్కా ఇండ్లు, మామిడి తోటల కు మొత్తం పరిహారం చాలా ఎక్కువ అవుతుందని, అప్పట్లో లెక్కలు వేసి, సింగరేణి ఈ గనిని తవ్వ దానికి వెనక్కు తగ్గింది. మూడేండ్ల కింద వేలంలో ఈ బ్లాక్ ఒక ప్రైవేట్ కంపెనీ తమకు ఇవ్వాలని, దరఖాస్తు చేసుకున్నప్పటికి, నిబంధనల ప్రకారం ఒక్కరే దరఖాస్తు చేసుకున్నాడు కాబట్టి, ఇవ్వలేదు. తాజాగా ఇప్పుడు హైదరాబాద్ లో జరుగబోయే 60 బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ కు సంబందించిన జాబితాలో శ్రావణ్ పల్లి ఉన్నది. సింగరేణి ఈ బ్లాక్ కు దరఖాస్తు చేస్తుందా? వేలంలో పాల్గొంటుందా? లేదా, ఇంకా నిర్ధారణ కాలేదు! అయితే సింగరేణి పాల్గొన్నా, పాల్గొనకున్నా, ఎవరైనా ప్రైవేట్ కంపినీలు పాల్గొంటే, ఏమిటి పరిస్థితి,ఇప్పటికే కొన్ని కార్మిక సంఘాలు, ముఖ్యంగా బిఆర్ఎస్ సింగరేణి కి వేలంలో పాల్గొనకుండానే బొగ్గు బ్లాక్ లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. గతంలో కోయగూడం, సత్తుపల్లి లలో ఇలాగే వేలంలో సింగరేణి పాల్గొనలేదు, అయితే అరబిందో ఇతర ప్రైవేట్ కంపెనీలు వేలంలో పాల్గొని పై బ్లాక్లను దక్కించుకున్నాయి.అయితే ఆ ప్రాంతం కార్మిక సంఘాల, ప్రజల ఆందోళన వల్ల ఆ బ్లాకులు గ్రౌండ్ చేయలేక పోయారు. రేపు శ్రావణ పల్లి పరిస్థితి కూడ అంతే అవుతుంది, లా పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2015 లో ఈ వేలం చట్టం పార్లమెంట్ లో తెచ్చినపుడు, గుడ్డిగా కొందరు, అన్నీ తెలిసి మరికొందరు ఎంపీ లు సపోర్ట్ చేసి ఇప్పుడు వేలం ను అడ్డుకుంటామని చెప్పడం సమంజసమా?

## ప్రభుత్వ రంగం నిర్వీర్యంకు కుట్ర!

ఏది ఏమైనా ప్రభుత్వ రంగ సంస్థలు అయిన సింగరేణి ని, కోల్ ఇండియా ను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఈ మన బొగ్గు బ్లాక్ లను మనకు కేటాయించడం కోసం, ప్రైవేట్ వారి మాదిరి వేలంలో ఫీజులు కట్టి పాల్గొనడం దారుణం, అన్యాయం, బొగ్గు శాఖకు మంత్రి గా ఉన్న జి. కిషన్ రెడ్డికి ఈ పరిస్థితి అంతా తెలుసు కాబట్టి, ప్రభుత్వ రంగం కు చెందాల్సిన బొగ్గు బ్లాక్లను సింగరేణి కి, అటు కోల్ ఇండియా కే దక్కేటట్లు చర్యలు తీసుకోవాలి! సింగరేణి మనుగడకు బొగ్గు బ్లాకులు అవసరం!అందరి అభీష్టం మేరకు ఏ ప్రాంతం బ్లాకులు ఆ ప్రాంతం ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పజెప్పాలి.ఉత్పత్తి, లక్ష్యాలు, ప్రధానంగా ఉపాధి అవకాశాల ను దృష్టిలో పెట్టుకుని పాలకులు చర్యలు తీసుకోవాలి!శ్రవణ్ పల్లి బ్లాక్ ను తవ్వడానికి వీలు లేదని, ఆగని వస్తే పెద్ద ఎత్తున జీవన విధ్వంసం జరుగుతుంది అని, తమ నోటికాడి, బుక్క అయిన వ్యవసాయం స్థానంలో, దుమ్ము, దూళి బుక్కాల్సి వస్తుందని రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని, వారి విజ్ఞాపనను కూడ పరిశీలిస్తే మంచిది!

## 500కు పైగా బ్లాకుల వేలం!

500 కు పైగా బొగ్గు బ్లాకులను వేలం వేసి లక్ష కోట్ల రూపాయలు ఆదాయం గదించాలనుకున్న కేంద్రం, ప్రైవేటీకరణ, కార్పొరేటికరణకు ఈ విధంగా పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నది. చత్తిస్ గడ్ లోని హస్దేవ్ అడవిని అంతా బొగ్గు బ్లాక్లను అదానిలాంటి వాళ్లకు ఇచ్చి సర్వనాశనం చేయడం జరిగింది. అక్కడ ఆదివాసుల జీవితాల్లో నిప్పులు పోస్తున్నది బీజేపీ డబుల్ ఇంజెన్ సర్కార్!ప్రభుత్వ రంగం పుట్టిందే చావడానికి అని పేర్కొన్న పీఎం నరేంద్ర మోడీ మాటలు ఇలాంటి సందర్భంలలో పదే పదే గుర్తుకు వస్తుంటాయి. పోరుబాట తప్ప, మన బొగ్గు మనకు దక్కే పరిస్థితి కనిపించడం లేదు!

ఇక్కడ ఇంకో సూచన ఏమంటే, సింగరేణి లో భూగర్భగనుల నుంచి ఉత్పత్తి చేసే బొగ్గు బ్లాక్లను సైతం, వేగిరంగా బొగ్గును తీయాలనే ఆలోచనతో ఓపెన్ కాస్ట్ గనులకే ప్రాధాన్యత ను ఇస్తున్నారు. భూగర్భ గనుల వల్ల విధ్వంసం కు అవకాశాలు తక్కువ ఉంటాయి. ఉపాది కి అవకాశాలు ఎక్కువ ఉంటాయి, అందుకే అవకాశం ఉన్న మేరకు భూగర్భ గనుల తవ్వకానికి అవకాశం ఉన్న 'శ్రావణ్ పల్లి' లాంటి బ్లాక్ ల విషయంలో పరిశీలన చేయాలి! తొందర పడి అత్యధిక జీవన విధ్వంసం జరిగే ఓపెన్ కాస్ట్ గనుల వైపు దృష్టిని తగ్గించాలి!కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి లు ఆ దిశన ఆలోచిస్తే మంచిది. ఒక మైనింగ్ నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి విషయం మీద కసరత్తు చేయాలి! స్టడీ చేయాలి! పర్యావరణ, జీవన విధ్వంసం ను ఆపాలి! తగ్గించాలి!

# చెంచె మహిళను లైంగిక వేధింపుల దోషులను అరెస్టు చేయాలి

చెంచు మహిళను నిర్బంధించి చిత్రహింసలు పెట్టి లైంగిక వేధింపులు,తీవ్రంగా గాయరచడం అత్యంత హేయమైన చర్య ను చైతన్య మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తుంది.దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి. నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి లోని చెంచు భ్రమరాంబ కాలనీకి చెందిన కాట్రాసు ఈదమ్మ, ఈశ్వరమ్మలు భార్యాభర్తలు వీరికి ముగ్గురు ఆడపిల్లలు భార్యాభర్తల గొడవ వలన భార్య ఈశ్వరమ్మ పుట్టింటికి వెళ్ళింది. ఈ విషయం తెలిసి తమ పొలానికి కాపలా గా ఉండే పని తప్పించుకోవడానికి ఈశ్వరమ్మ వెళుతుందని భావించి ఆమెకు మంచి మాటలు చెప్పి తీసుకువచ్చి ఒక ప్రదేశంలో నిర్బంధించి ఆమెను వివస్త్రను చేసి అత్యంత దారుణంగా ఆమెను కొట్టడమే కాకుండా ఆమె మర్మంగాలలో, నోటిలో కారంపొడి పెట్టి అత్యంత కిరాతకంగా 10 రోజులు పాటు చిత్రహింసలకు గురి చేశారు. భార్య కోసం వెతుకుతున్న భర్త ఈదన్నాకు విషయం తెలిసి కొంతమంది మనుషులతో తన భార్యను విడిపించుకుని వచ్చాడు. పోలీస్ వారికి విషయం తెలిసి ఆమెను అత్యవసర చికిత్స కోసం నాగర్ కర్నూలు తరలించడం జరిగింది. ఒక చెంచు మహిళను నిర్బంధించి అత్యంత పాసవికంగా కొట్టడమే కాకుండా లైంగికంగా దాడి చేయడం అమానీయ సంఘటన. ఈ మొత్తం సంఘటనపై విచారణ జరిపి చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి అక్రమ నిర్బంధం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార లైంగిక వేధింపులు చట్టాలను పెట్టి దోషులకు శిక్షపడేలాగా చర్యలు తీసుకోవాలని చైతన్య మహిళా సంఘం డిమాండ్ చేస్తుంది ప్రభుత్వం చెంచు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని మరింత మెరుగైన వైద్యం బాధితులకు ప్రభుత్వం అందించాలని విజ్ఞప్తి చేస్తుంది.

**చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్**
**జ్యోతి కో కన్వీనర్ రాధ,శ్రీదేవి**


# 23న యుద్ధంలో పావురం ఆవిష్కరణ సభ

ఖలీల్ విద్యార్థి జీవితంలోనే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమంలోకి, విభజనలు, విద్వేషాలు కాక మనుషుల మధ్య వికసించవల్సిన సమసమాజ స్వప్నాలలోకి ఎదుగుతూ యువజన, కార్మికోద్యమాలల్లో కార్యకర్త నాయకుడైనాడు. ఈ క్రమం అతడిలోని కవిని మేల్కొల్పింది. చాలా కవిత్వం రాశాడు. అతను కాపాడగలిగిన మేరకు అందివవచ్చిన కవిత్వాన్ని కాలానికి అవసరమైన సంభాషణను అందించిన కవిత్వంగా గుర్తించి పాలమూరు అధ్యయన వేదిక 'యుద్ధంలో పావురం' కవిత్వ సంపుటి ప్రచురించింది. మహబూబ్‌నగర్ తూర్పు కమాన్ మార్కెట్ దగ్గర అల్మాస్‌ఫంక్షన్ హాల్‌లో 23న ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ పుస్తకావిష్కరణ సభ ఉంటుందని పాలమూరు అధ్యయన వేదిక తెలిపింది. దీనికి అధ్యక్ష వర్గంగా ఎ.తిమ్మప్ప, ఎండీ ఇక్బాల్ పాషా ఉండనున్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించనున్నారు. కవి యాకూబ్, జిలుకర శ్రీనివాస్, పి.ప్రసాద్, శ్రీదేవి వక్తలు ఉపన్యాసం ఇవ్వనున్నారు.

# సాధారణ పరిపాలన విధానాన్ని వీడనాడుతున్న రాజకీయ పాలకులు!

సివిల్ సొసైటీ అభివృద్ధి కోసం రాజకీయ పరిపాలన వ్యవహారాలు సాధారణ పరిపాలన విధానాన్ని విడనాడుతున్న విషయాన్ని మనం గమనించవచ్చు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యపద్ధంగా అధికారాన్ని చేజిక్కించుకొని పాలిస్తున్నారంటే వీటెంతటికి ప్రజాస్వామ్య ఓటింగ్ విధానం ద్వారా( సివిల్ సొసైటీ) ఓట్లతో గెలిచిన నాయకులే! కానీ అధికారాన్ని చేపట్టిన తర్వాత సివిల్ సొసైటీని, సాధారణ పరిపాలన విధానాన్ని పూర్తిగా పక్కన పెట్టి తమ రాజకీయ లబ్ధికి ఉపయోగపడే పరిపాలన వ్యవస్థను రూపొందించుకొని తున్న విషయాన్ని మనం గమనించాలి. గత ప్రభుత్వాలు చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే ప్రజలు ఒక రాజకీయ పార్టీని దించేసి, మరొక రాజకీయ పార్టీ పరిపాలనకు అవకాశం కల్పించిన విషయం గమనించాలి. సివిల్ సొసైటీ సాధారణ పరిపాలన వ్యవహారాలు నిర్వాణ విధానం అమలు చేసిన రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. కాబట్టి ప్రజాభీష్టం మేరకు పరిపాలన ఉండాలి. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా గ్రామీణ జీవన వ్యవస్థ, ఆర్థిక బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, వ్యవసాయ రంగం, పారిశ్రామిక గ్రామీణ అభివృద్ధి, ఉపాధి కల్పన వంటి రంగాలపై ప్రధాన దృష్టి కేంద్రీకరించాలి. ముఖ్యంగా పెరుగుతున్న ధరల నియంత్రణ, ద్రవయోల్బణం కట్టడి వంటి చర్యలకు సాధారణ పరిపాలన వ్యవహారాలుగా గుర్తిస్తారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపట్టడంలో ఉన్న శ్రద్ధ సాధారణ పరిపాలన వ్యవహారాలపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2.పరివర్తన పరిపాలనల యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం ఏమిటంటే, పబ్లిక్ పాలసీని అమలు చేయడానికి , అవసరమైన ప్రజా సేవలను అందించడానికి టోకు బాధ్యతతో మధ్యంతర పరిపాలనా నిర్మాణాల స్థాపన , నిర్వహణ-ప్రభుత్వం యొక్క ప్రధాన విధులు. సివిల్ అడ్మినిస్ట్రేటివ్ విధులను నిర్వర్తించే ఉద్దేశ్యంతో అవలంబించిన నిర్మాణాలు , పద్ధతులను , ఈ సంస్థలకు స్థానిక ప్రభుత్వ సంస్థలకు ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తుంది. పరివర్తన అధికారులు బలహీనమైన రాష్ట్రాలు లేదా భూభాగాలను విడిచిపెట్టకుండా ఉండాలంటే, స్వల్పకాలిక సమర్థవంతమైన, సమర్థవంతమైన అంతర్జాతీయ పరిపాలన ,దీర్ఘకాలికంగా స్థానిక సామర్థ్యాన్ని బలోపేతం చేయాలనే డిమాండ్ల మధ్య మెరుగైన సమతుల్యతను సాధించాల్సిన అవసరం ఉందని ఇక్కడ వాదించారు. వారి వారసత్వంలో పరిపాలన అంటే ప్రలోభాలు వాగ్దానాలు రాయితీలు కాదు. అసమానతలు అంతరాలను అంతం చేసే ఎత్తుగడ. అభివృద్ధి సంక్షేమాలను సమాంతరంగా నడిపే సాహసోపేత నిర్ణయం . కనీస అవసరాలను కల్పించి మానవాభివృద్ధిని సాధించే మహోన్నత ఆశయం .పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజా వ్యతిరేక విధానాలపై మోపే ఉక్కు పాదం. పరిపాలన అంటే ప్రగల్భాలు పలకడం వాగ్దానాలు చేయడం హామీలు ఇవ్వడం ఇష్టం ఉన్నట్టుగా రాయితీలు ప్రకటించడం ఆచరణకు సాధ్యం కానీ వరాలు కుమ్మరించడం కానే కాదు. అది అత్యాశ అంతే కాదు అధికారానికి రావడం కోసం చేస్తున్న పెనుగులాట మరో రకంగా ప్రజలను ప్రజాస్వామికవాదులను చేస్తున్న మోసం దగా దోపిడీ అన్న తప్పులేదు. ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలంటే ప్రధానమంత్రి గతంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని రైతుల యొక్క ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలైన విషయం మనకు తెలుసు. ఇక తెలంగాణ రాష్ట్రంలో గతంలో దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని దళితులకు మూడెకరాల భూమి ఉచితంగా ఇస్తామని ఇచ్చిన మాట నీటిమూటలే. పైగా ప్రజలను రైతులను దళితులను సామాన్యులను వంచించడమే అవుతుంది. ఆంధ్రప్రదేశ్లో గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరుతో హామీలు ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పత్రిక విలేకరులు ప్రతిపక్షాలు, స్వపక్షాలను కూడా వంచించిన తీరు మనందరికీ తెలుసు. అంతేకాకుండా తెలంగాణలో 2023 డిసెంబర్లో ఏర్పడినటువంటి ప్రభుత్వం ఎనలేనటువంటి హామీలు వాగ్దానాలు గ్యారంటీలను ఇచ్చి ప్రతిపక్షాల యొక్క ఆగ్రహానికి వెనువెంటనే గురైన విషయం కూడా మనకు తెలుసు. అందుకే ఇదంతా పరిపాలనలో భాగం కానే కాదు ఇది కేవలం ఎన్నికల డ్రామా, ప్రజలను మోసం చేసే విధానం, పరిపాలనకు వికృత రూపమే ఈ హామీల ప్రగల్భాలు. ఇవి పరిపాలనలో భాగం కానేకాదు పాలకులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి గుణపాఠం తెచ్చుకొని హామీలను మానుకొని వాగ్దానాలకు తె రదించాలి.అభివృద్ధి పలాలు సమాజం యావత్తు అనుభవించే విధంగా నిర్మాణాత్మకమైనటువంటి కార్యక్రమాలను చేపట్టడం పరిపాలనలో ప్రధానమైన ఘట్టం. వంతెనలు ప్రాజెక్టులు కాలువలు నిర్మాణాలు గృహవసతీ , పట్టణాలు నగరాలు పరిశ్రమలు పారిశ్రామిక కేంద్రాలు నిర్మించడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రజలందరికీ మహోన్నతమైనటువంటి సౌకర్యాలు అందించడానికి అవకాశం ఉంటుంది. ఈ వైపుగా దృష్టి సారించిన ప్రభుత్వమే నిజమైనటువంటి సమయస్ఫూర్తి గల ప్రభుత్వం అనబడుతుంది. ఇక అల్పాదాయ వర్గాలు పెట్టుబడిదారీ సంపన్న వర్గాలతో పోటీ పడలేని పరిస్థితిలో వారిని పైకి తీసుకురావడానికి దారిద్రరేఖ దిగు వన గల వర్గాలను మానవాభివృద్ధి క్రమంలో చేర్చడానికి ఆదాయ ప్రాతిపదిక మీద సమానత్వాన్ని సాధించే క్రమంలో పేదవర్గాలకు ఊరట కల్పించవలసిన అవసరం ఉంది. అదే సందర్భంలో పేదలకు పన్ను నుండి మినహాయింపు ఇవ్వడంతో పాటు సంపన్న వర్గాలకు పురోగమి పన్ను విధించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకోవాలి. ఇది సత్తా గల ప్రభుత్వాలకే సాధ్యం. ముందుగా భూమిలేని పేదవర్గాలు, రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు వలస కార్మికులు చేతివృత్తులు చిరు వ్యాపారులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆ వర్గ ప్రయోజనం కోసం వారిని సర్వే చేసి ఆయా సంస్థల్లో పనిచేస్తున్న వీరి డేటాను సమీకరించి వారికి సంస్థాపరంగానూ ప్రభుత్వపరంగానూ అవకాశాలను మెరుగుపరచడం కోసం సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వాల యొక్క బాధ్యత.



ఎత్తుగడలో ప్రభుత్వం కీలక పాత్ర వహించాలి ఈ దేశ సంపద ప్రజలందరికీ చెందాల్సినది పోయి కొద్ది సంపన్న కుటుంబాలకు మాత్రమే అందుబాటులో ఉండడం రాజ్యాంగ రీత్యా దుర్మార్గం నేరం వ్యతిరేకం శాపం కూడా. అందుకు ఆ స్థితికి కారకు లై న పాలకులకు ఎంత కఠిన శిక్ష విధించినా తప్పులేదు. 77 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ పరిపాలనలో ప్రస్తుతము దేశ సంపద 40 శాతం ఒక్క శాతం సంపన్న వర్గాల చేతిలో ఉన్నదంటే దానికి పాలకులు బాధ్యులు కాదా ఈ అసమానతలు అంతరాలను కొనసాగించాలని చూస్తున్నటువంటి ఆగంతకులైనటువంటి పాలకులకు కఠిన శిక్ష విధించాల్సిందే. రాజ్యాంగం అందుకు అనుమతించి సర్వోన్నత న్యాయస్థానం శిక్ష విధించాలి. గత పది ఏళ్లలో దేశంలో 14 లక్షల కోట్ల మొండి బకాయిలను రద్దుచేసి కేంద్రం పెట్టుబడిదారులకు వ0త పాడితే ఇటీవల బడ్జెట్లో కేంద్రం సంపన్న వర్గాల యొక్క పన్ను రాయితీ నీ ప్రకటించడం ద్వారా సంపన్న వర్గాలను ఊడిగం చేయడమే కాదు అసమాన తలను మరింత పెంచి పోషించడం ఇది ప్రజాస్వామ్య విరుద్ధం అంతేకాదు అశాంతికి పోరాటాలకు వర్గ సంఘర్షణకు దారితీస్తుందని సోయి లేకపోతే ఎలా? ఇప్పటికీ 15% జనాభా దారిద్రరే క దిగువ న జీవిస్తుంటే పేదరికం ఉపాధి అవకాశాల లేమి కారణంగా కోట్లాది ప్రజానీకం రెండవ శ్రేణి పౌరులుగా అనాధలుగా జీవిస్తుంటే పాలకులకు ఇసుమంత కూడా రోషం లేకపోతే ఎలా ? అసమానతలు అంతరాలను నిర్మూలించే క్రమంలో సమయస్ఫూర్తిని ప్రదర్శించడం ద్వారా దేశ సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేసే క్రమంలో ఉదాత్తమైనటువంటి నిర్ణయాలను తీసుకోవడమే నిజమైన పాలన. లేకుంటే ఆ పరిపాలన ప్రజల చేతిలో బలి కాక తప్పదు. మానవాభివృద్ధి ప్రభుత్వ బాధ్యత కనీస అవసరాలైన కూడు గూడు గుడ్డ చదువు వైద్యం విద్యుత్ శక్తి ఇతర అవసరాలను సమకూర్చుకోలేనటువంటి దుస్థితిలో కోట్ల కుటుంబాలు ఈ దేశంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అందుకే జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ అమర్త్యసేన్ కనీస అవసరాలను తీర్చుకోగలిగిన మానవాభివృద్ధిని సాధించకపోతే ఆ ప్రభుత్వానికి అర్థం లేదు అది పరిపాలన కానే కాదు అని నిష్కర్షగా విమర్శించిన తీరు పాలకులకు గుర్తు రాకపోతే ఎలా? అన్నపు రాశులు ఒకచోట ఆకలి మంటలు మరొకచోట, భవనాలు ఆస్తులు అంతస్తులు ఒకచోట బక చిక్కిన డొక్కలు మాడిన మనుషులు మరొకచోట ఇంత దౌర్భాగ్యమైనటువంటి వివక్షత ఈ దేశంలో కొనసాగుతుంటే ఇది మానవాభివృద్ధి ఎలా అవుతుంది?/ కనీస అవసరాలకు కూడా నోచ నటువంటి కోట్లాదిమందిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి కూడా మనసొప్పని పాలకులకు కఠిన శిక్ష విధించాల్సిందే.

అవసరాలను గుర్తించడం, ఆదాయాల మార్గాలను సమకూర్చడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, ప్రజా సంపదను పేద వర్గాలకు వివిధ రూపాలలో సమకూర్చడం ద్వారా ఆ కుటుంబాలను జనజీవన స్రవంతీలోకి థీ సుకురావడం ద్వారా మానవాభివృద్ధిని సాధించడానికి అవకాశం ఉంటుంది. ఆర్థికవేత్తలు సామాజికవేత్తలు సామాజిక నిపుణుల సహకారాన్ని పరిశీలించకుండా ఒంటెద్దు పోకడలో వ్యవహరిస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా ప్రజల చేతిలో పరాభవాన్ని ఎదుర్కోక తప్పదు .

**ప్రజా వ్యతిరేక విధానాల పైన ఉక్కు పాదం** : ప్రభుత్వాలు ప్రజల ఓట్ల ద్వారా ఎన్నుకోబడినప్పుడు ప్రజలకు బాధ్యత వహించవలసి ఉంటుంది ఆ క్రమము లోపల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజల అవసరాలను గుర్తించి అసమానతలు అంతరాలను సరిదిద్దే క్రమంలో కఠిన నిర్ణయాలను తీసుకునే క్రమము లోపల పెట్టుబడిదారీ పారిశ్రామికవేత్తలకు వంత పాడకుండా ప్రజల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేయాలి. కానీ ఇటీవలి కాలంలో పెట్టుబడిదారీ వర్గాల కోసం మాత్రమే పాలకవర్గాలు పనిచేస్తూ వాళ్ళు ఇచ్చే డబ్బు రాయితీలు ప్రకటనలు ప్రచార సామాగ్రికి దాసోహమై ఎన్నుకున్న ప్రజలకు దూరమవుతున్నారు. అంతే స్థాయిలో ప్రజల యొక్క విశ్వాసాన్ని కోల్పోతున్న విషయాన్ని కూడా మనం గమనించక తప్పదు. మద్యం మత్తు పానీయాలు కల్తీ వ్యాపారం ధూమపానం క్లబ్బులు పబ్బులు ఈవెంట్లు, అశ్లీల అత్యాచార శృంగార విభిన్న ప్రదర్శన అంశాలు రాజ్యమేలుతుంటే సామాజిక రుగ్మతలు ఈ దేశంలో పెచ్చు మేరి పోతున్న కూడా పట్టించుకోనటువంటి పాలకవర్గాలకు పోలీసు వ్యవస్థ తొత్తులుగా మారిన సందర్భంలో తాత్కాలికంగా ప్రయోజనం పొందవచ్చు. కానీ ప్రభుత్వాలు మారిన సందర్భంలో పోలీసు వ్యవస్థ పైన కొత్త ప్రభుత్వాలు ఉక్కు పాదం మోపడాన్ని గనక గమనిస్తే పోలీసు వ్యవస్థ ఏ పాలకులకు అనుగుణంగా కాకుండా చట్టానికి అనుగుణంగా పని చేస్తేనే మంచిది అనే విషయం ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు కూడా హెచ్చరించిన విషయాన్ని గమనించవలసి ఉంటుంది .చట్టసభల్లో నేరస్తులు నేర చరిత్ర గల వాళ్లు ఒకవైపు కొనసాగుతుంటే కేవలం ఆరోపణ పేరుతో కోట్లాదిమంది పేద వర్గాలను నేరస్తులుగా చిత్రీకరించి విచారణ ఖైదీలుగా చేస్తున్నటువంటి దుర్మార్గమైన వ్యవస్థ ఈ దేశంలో కొనసాగుతున్నది. ఇక మేధావులు బుద్ధి జీవులు సామాజిక కార్యకర్తలు ప్రొఫెసర్లు ప్రజల పక్షాన పని చేసినటువంటి పాపానికి మానవ పౌర హక్కుల సంఘాల బాధ్యులను ఇస్టారాజ్యంగా అణచివేత నిర్బంధం పేరుతో శిక్షించిన తీరు ఇటీవల కాలంలో హృదయ విదారకం . యూపీఏ హయాంలో అమల్లోనికి వచ్చినటువంటి ఉపా చట్టాన్ని ఎత్తివేయడంతో పాటు ప్రజల యొక్క పౌర ప్రజాస్వామిక హక్కులను కాపాడ డానికీ ప్రభుత్వాలు గ్యారెంటీ ఇవ్వాల్సినటువంటి అవసరం ఉంది .అది మాత్రమే నిజమైన పాలన కానీ ప్రశ్నించి ప్రతిఘటించి నిలదీసే ప్రజాస్వామిక శక్తులను అణచివేయడమే పరిపాలన అనుకుంటే అందుకు తగిన మూల్యం పాలకవర్గాలు చెల్లించుకోక తప్పదు అని ఆధునిక ప్రజాస్వామ్యంలో పాలకవర్గాలు గుర్తించడం చాలా అవసరం. ఇది ఒక ప్రాంతానికి రాష్ట్రానికి పరిమితం కాదు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పాలకవర్గాలకు ఇదే నిబంధన వర్తిస్తుంది. ఏది ఏమైనా రాజకీయ వ్యవహారాలు సాధారణ పరిపాలన వ్యవస్థ పై ప్రధానమైన పరిపాలన వ్యవస్థగా అమలు చేయనంతవరకు ఆయా రాజకీయ వర్గాలకు ప్రజా మద్దతు ఉండదు.

**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**



# నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తా

## ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ జూన్ 20 (జనం సాక్షి)**

నియోజకవర్గ అభివృద్ధికి తాను శాయశక్తుల కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ కాలనీలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో తాను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాజకీయాల కతీతంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి పరచడంలో తాను ముందుంటానన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే భూగర్భ డ్రైనేజ్, వీధి దీపాలు తదితర అత్యవసర పనులను తక్షణమే పూర్తిచేశాల చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి జ్ఞానేశ్వర్ గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

## శేర్లింగంపల్లి ప్రజలకు ఎమ్మెల్యే అరికపూడి పిలుపు




శేరిలింగంపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :

రాష్ట్రంలో ఓట్లేసి గెలిపించిన ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని, గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడడం ప్రభుత్వ విద్యుక్త ధర్మమని ఏది లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 3.96 లక్షల రూపాయల మంజూరి పత్రాలను గురువారం వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఆయన బాధితులకు అందజేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గం పరిధి చందానగర్ కు చెందిన శివకుమార్‌కు 6 వేలు, లింగంపల్లి రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి చెందిన షేక్ జాయిద్ ముహయుద్దీన్ కు 7 వేల 500 రూపాయలు, చందానగర్ కు చెందిన సాయి కృష్ణకు 43 వేల 500 రూపాయలు, కూకట్పల్లి అస్ బెస్ట్ ఆఫ్ కాలనీ ప్రాంతానికి చెందిన విమలకు 8 వేల రూపాయలు, శేరిలింగంపల్లి కి చెందిన శివకుమార్‌కు 42 వేలు, శంసిగూడ శ్రీరామ్నగర్ ప్రాంతానికి చెందిన అనంతమ్మకు 15 వేల రూపాయలు, ఫ్రెండ్స్ కాలనీకి చెందిన అండాలుకు 36 వేల రూపాయలు, జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అంజమ్మకు 34 వేల రూపాయలు, గుట్టల బేగంపేట్ నవభారత్ నగర్ కు చెందిన అంజుమ్ బేగంకు 19 వేల 500 రూపాయలు, కూకట్పల్లి వెంకటేశ్వర నగర్ కు చెందిన లలితకు 17 వేల 500 రూపాయలు విజయ్ కి 57 వేల రూపాయలు, ఎల్లమ్మ బండ ప్రాంతానికి చెందిన నాగమణికి 19 వేల 5 వందల రూపాయలు, ఖాజా గూడ కు చెందిన రమేష్ బాబుకు 12 వేల రూపాయలు, ప్రశాంత్ నగర్ ప్రాంతానికి చెందిన మల్లేష్ వారికి 60 వేల రూపాయలు, లింగంపల్లి దుబాయ్ కాలనీకి చెందిన శాంతకు 18 వేల 500 రూపాయలు మంజూరు కాగా ఎమ్మెల్యే అరికపూడి, మాజీ కార్పొరేటర్ రంగారావులు వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఓట్లతో ప్రజా ప్రతినిధులుగా ప్రతి ఒక్కరూ గెలిపించిన ప్రజల కోసం తప్పకుండా సేవ చేయాల్సిన బాధ్యత ఉంటుందని, ప్రజల ఆశీర్వాదంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం సైతం తమ చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం తప్పకుండా అధికారులను ప్రజాప్రతినిధులను నిలదీయాల్సిన అవసరం ఉంటుందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంకూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గత కొంతకాలంగా అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందని అరికపూడి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ సహా ప్రభుత్వ యంత్రాంగం స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, ప్రత్యేక నివేదికలు తయారుచేసి ప్రాధాన్యత క్రమంలో వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు ఎంతో అభిమానంతో తనను గెలిపించారని, వారి అభ్యున్నతి కోసం వీలైనంతవరకు తన సహాయ సహకారాలు అందిస్తానని అరికపూడి హామీని ఇచ్చారు. అపరిష్కృతంగా ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులకు స్వేచ్ఛనివ్వాలని, అభివృద్ధి దేశంలో ఎక్కడ రాజీ పడకూడదని అధికారులను ఉద్దేశించి గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, కాశీనాథ్ యాదవ్, రామచందర్, అంకారావు, స్వప్న కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, పెండింగ్ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మేయర్



**కుత్బుల్లాపూర్ జూన్ 20 (జనం సాక్షి)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి అభివృద్ధి, పెండింగ్ పనులు తదితర అంశాలపై కమిషనర్ రామకృష్ణారావు, ఎస్ ఈ సత్యనారాయణ, ఆయా విభాగాల అధికారులతో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు ,మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో ఆమె చర్చించారు. ఈ సందర్భంగా నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నిర్మాణ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్లు ,డ్రైనేజీ, నాలా ,ట్రాఫిక్ ,రోడ్ ప్యాచ్ వర్క్, విద్యుత్ తీగలు, స్తంభాలు, వరదనీటి తొలగింపు, చెట్లు, పురాతన నిర్మాణ సముదాయాల లాంటి కీలకమైన అంశాల పట్ల జాగ్రత్త వహించాలని అధికారులను కోరారు. వర్షాకాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, చెట్ల దివాకర్, ఇంద్రజిత్ రెడ్డి, సురేష్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావం, సమగ్రతతో దేశానికి సేవ చేయాలి



- **సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుక**
- **ముఖ్య అతిథిగా పాల్గొన్న డిజిపి శ్రీ రవి గుప్త**

హైదరాబాద్ జూన్ 20 (జనం సాక్షి)

బౌరంపేట్ ప్రాంతంలోని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఓక్విండ్స్ క్యాంపస్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ రవి గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం గురువారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. వేడుకల్లో భాగంగా శ్రీ రవి గుప్తా 60 అడుగుల స్తంభంపై జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిజిపికి సిల్వర్ ఓక్స్ స్కూల్ ఎయిర్ ఎన్‌సిసి స్క్వాడ్రన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డిజిపి శ్రీ రవి గుప్త మాట్లాడుతూ.. సిలబస్‌తో పాటు పాఠ్యేతర కార్యకలాపాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విద్యతో పాటు విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదల పెంపొందించే సంపూర్ణ విద్య అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పోలీస్ శాఖ మరియు ఇతర కెరీర్‌ల పట్ల ఆసక్తిని ప్రేరేపించారు. అంకితభావం మరియు సమగ్రతతో దేశానికి సేవ చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ధనుంజయ, శ్రీ రవి గుప్తాకు, విద్యావేత్త, రచయిత్రి, బ్లాగర్, ఫిలాంత్రోఫిస్ట్ శ్రీమతి అంజలి గుప్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జానకి ధరావత్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీగా జానకి ధరావత్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని, ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. జిల్లా పరిధిలోని ప్రజలకు భరోసా కలిగించే విధంగా పోలీసు వ్యవస్థ ఉంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా విద్వేషాలను రెచ్చగొట్టేవారి పట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల అదుపు విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

# రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ఉండాలి



నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

రాష్ట్రానికి సమగ్ర వ్యవసాయ ప్రణాలిక ఉండాలనీ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్ తెలంగాణ రైతు సంఘం అద్వర్యంలో గురువారం మారుతున్నా వాతావరణం వ్యవసాయ.ప్రణాళిక పై జరిగిన జిల్లా సదస్సులో ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. పండించిన పంటకు గిట్టు ధర చట్టం తేవాలని, పంటకు ముందే మద్ధతు ధర మరియు బోనస్ నిర్ణయించాలన్నారు. పంట రేటు రైతుకు మిగిలి ఉండేవిధంగా నిర్ణయించాలి కనుక స్వామినాథన్ సిఫారసులు ప్రకారం పెట్టుబడిలో 50 షాతం కల్పి ధర నిర్ణయించాలి. కేరళలో మాదిరిగా క్వింటాల్కు బోనస్ 800 రూపాయలు ఇవ్వాలన్నారు. 60 శాతం కూరగాయలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ ప్రతి సారి పంటకు కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని వాడితే నేలలో భాస్వరం పెరిగి మొక్కకు జింకు పోషక లోపం ఏర్పడే ప్రమాదం ఉంటుందన్నారు. యురియ, పొటాషియం మాత్రమే వాడాలన్నారు. కందిలో లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్,పశు సంవర్ధక శాక అధికారి శ్రీనివాస్ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడారు. ఈ సాధనకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ అధ్యక్షత వహించారు.

# రాజకీయ కుట్రతోనే దాడులు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు జూన్20(జనంసాక్షి)**

రాజకీయంగా ఎదుర్కొనలేక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం..రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అసంబద్ధ కారణాలతో ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్.. ఐటీ శాఖల పేరుతో దాడులు చేయించడం ప్రజాస్వామ్యానికి పెనుముప్పు లాంటిదని.. తన 34 ఏళ్ల రాజకీయ జీవితం తెల్ల కాగితం లాంటిధని.. రాజకీయ కుట్రతోని దాడులు చేస్తున్నారని పటాన్చెరు శాసన సభ్యుల గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తన నివాసంలో జరిగిన ఈడి సోదాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిపిన సోదాలకు సంపూర్ణంగా సహకరించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి వ్యాపారాలు నిర్వహించలేదని తెలిపారు. చట్టపరంగా ఎదురుకోవడానికి తమ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజల మద్దతు ఆశీస్సులతో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం జరిగిందని గుర్తు చేశారు. 12 గంటల సోదాల్లో ఏమీ లభించలేదని.. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా సోదాలు ముగిశాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోవాలి తప్ప.. ఐడి, ఐటీల పేరుతో దాడులు చేయించడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారికి జవాబుదారీగా పని చేస్తానని తెలిపారు.

# నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో జూన్20 (జనం సాక్షి)**

నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు.గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) తినిపించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు మట్టిలో ఆడడం, ఆ తర్వాత నేరుగా తినడం వల్ల శరీరంలో నులిపురుగులు తయారవుతాయని వివరించారు. ఈ పురుగులు పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని తద్వారా పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల పిల్లలు భుజించిన ఆహారం ఒంటికి పట్టకపోవడం, సరైన ఎదుగుదల ఉండకపోవడం, తరచూ అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఒకటి నుండి పంతొమ్మిది సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈరోజు అల్బెండజోల్ మాత్రలు తప్పకుండా తినిపించాలని సూచించారు. ఈరోజు ఎవరైనా మాత్ర తినకుండా మిగిలిపోయిన వారికి జూన్ 27వ తేదీన ఇంటింటికీ తిరిగి మాత్రలు తినిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియా సహా అనేక రోగాలను దరి చేరనియకుండా రక్షించుకోవచ్చని సూచించారు.

### పాఠశాలల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

ప్రతి ఒక్క చిన్నారికి నులిపురుగుల మాత్రలు వేసి రక్త హీనత నివారణకు కృషి చేయాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యం, నీటి పారుదల, విద్యుత్ రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ప్రధానంగా బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్టపాకుల మహేష్, జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారి జయ చంద్ర మోహన్, జిల్లా ఉప వైద్యధికారి శ్రీనివాసులు, మునిసిపల్ కమీషనర్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు కచ్చితంగా పాటించాలి..!

## డీఎం రామ్మోహన్

**మఖ్తల్ జూన్ 20 (జనం సాక్షి)**

మీసేవ నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ మీసేవ కేంద్రాలను నడపాలని నారాయణపేట జిల్లా మీసేవ కేంద్రాల డిస్టిక్ మేనేజర్ రామ్మోహన్ సూచించారు. గురువారం నర్వ మండల కేంద్రంలోని పలు మీసేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవ కేంద్రము ఏ గ్రామానికి మంజూరు అయితే అదే గ్రామములో నడిపించాలాన్నారు. మీసేవ కేంద్రంలో కస్టమర్లకు తగిన సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వ నిబందలను పాటించాలని ఆదేశించారు. ఇదివరకు నిర్వాహకులు వద్ద ఉన్న టీఎస్ మీసేవ రసీదుల పైన టిజిటిఎస్ అని స్టాంపు వేసి కస్టమర్ లకు రసీదులు ఇవ్వాలన్నారు. మీసేవ ద్వారా అందిస్తున్న పలు రకాల సర్వీసులు, సేవలకు సంబంధించిన వివరాలను మీసేవ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మీ సేవ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివిధ పనుల నిమిత్తం ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మీ సేవ నిర్వాహకులు మల్లన్ కోటి శంకర్, టీ అంజయ్య, జే బాల్ రాజు తదితరులు ఉన్నారు.



# విద్యాను వ్యాపారం చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

## ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ డిమాండ్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

విద్యను వ్యాపారంగా చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహబూబ్ నగర్ గ్రామర్ స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను పట్టుకొని పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ఎంఈఓ అక్కడికి చేరుకొని పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న గదిని సీజ్ చేసి, పాఠశాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని, పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లి తండ్రుల కష్టార్జితాన్ని నిలువు దోపిడి చేస్తున్నాయని ఆరోపించారు. డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలకు వచ్చిన ఎంఈఓ పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా అక్కడి నుండి వెళ్లిపోయారని, ఎవరి ఒత్తిడి వల్ల పాఠశాలపై చర్యలు తీసుకోకుండా ఎంఈఓ వెళ్లిపోయారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలల పై ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న దోపిడిని స్థానిక విద్యాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల పనితీరును చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, నాయకులు అరవింద్, అరుణ్, వరుణ్, కార్తీక్, గణేష్ వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

# జులై 1నుండి నూతన చట్టాలు అమలు



- **కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన అవసరం**
- **నూతన చట్టాలపై ఒక రోజు శిక్షణ తరగతులు**
- **జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20 (జనం సాక్షి)**

జులై 1 నుండి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలు అమలులోకి తెస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కొత్త చట్టాలపై శిక్షణా తరగతులు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులను ఉద్యేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జూలై 1వ తేది నుండి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా జూలై 1వ తేది నుండి కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాలైన (1) భారతీయ న్యాయ సంహిత, (2) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (3) భారతీయ సాక్ష్యా అధినియం-2023. వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలం అన్నారు. కొత్త చట్టాలపై అవగాహణ రావాలంటే నేర్చుకోవాలనే తపన మనలో ఉన్నప్పుడే సాధ్యం అవుతుందన్నారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరం అన్నారు. కొత్త చట్టాలపై అవగాహన ఉంటేనే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్ట్, వాంగ్మూలం నమోదులో పాటించవలసిన జాగ్రత్తలు, చార్జ్‌షీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించవలసిన తీరు తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పుల గురించి వివరించారు. అనంతరం అదనపు ఎస్పీ. ఎ. సంజీవ రావ్ మాట్లాడుతూ.. భారతన్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదని , అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కొరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, నారాయణఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, యస్.బి ఇన్స్పెక్టర్స్ శివలింగం, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, యస్.హెచ్.ఒ.లు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గ్యాస్ రీఫిలింగ్ కేంద్రాలపై పోలీసుల దాడి



- **840 సిలిండర్లు, 9-గూడ్స్ వాహనాలు స్వాధీనం**
- **అదుపులో నలుగురు నిందితులు**
- **జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20 (జనం సాక్షి)**

అక్రమ గ్యాస్ రిఫిలింగ్ కేంద్రాలపై టాస్కోఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించి నలుగురు నిందితులతో పాటు, 840 సిలిండర్లు, 9-గూడ్స్ వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పెషల్ టాస్కోఫోర్స్ బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించడం జరుగుతుందని, ఈ దాడులలో భాగంగా నమ్మదగిన సమాచారం మేరకు గురువారం ఉదయం సుమారు 11.00 గంటల సమయంలో పటాన్‌చెర్వు మండలం, ఇస్నాపూర్ గ్రామంలో రోహన్ ట్రేడర్స్ పై దాడులు నిర్వహించి, రోహన్ ట్రేడర్స్ యజమాని పిట్లం గ్రామం, ప్రస్తుతం నివాసం ఇస్నాపూర్ కు చెందిన బొక్క శ్రీనివాస్ ప్రజలు గృహావసరాలకు వినియోగించే డోమెస్టిక్ గ్యాస్ ను అక్రమంగా కొనుగోలు చేసి, తన రోహన్ ట్రేడర్స్ గోడౌన్ నందు రహస్యంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ లకు రిఫిల్లింగ్ చేసి అధిక ధరకు విక్రయించడం జరుగుతున్నట్లు గుర్తించి, 9-సిలిండర్స్ రవాణా చేస్తున్న వాహనాలు, 73-ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 661- ఖాళీ గ్యాస్ సిలిండర్లు మొత్తం 734 సిలిండర్లు ముగ్గురు నిందితులతో పాటు స్వాధీనపరుచుకొన్న సొత్తు పటాన్‌చెర్వు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే పటాన్‌చెర్వు మండలం, ఇస్నాపూర్ గ్రామం సాయి కాలనీకి చెందిన మాదిరి రవీందర్ తన షాప్ నందు అక్రమంగా గ్యాస్ రీఫిలింగ్ చేస్తున్నట్లు గుర్తించి, 03-తూకం మిషన్స్, 03-గ్యాస్ రీఫిల్లింగ్ మిషన్స్, 53-ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 53-ఖాళీ గ్యాస్ సిలిండర్లు మొత్తం 106 గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనపరుచుకొని నిందితునితో పాటు స్వాధీనపరుచుకొన్న సొత్తును పటాన్‌చెర్వు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు.

# మిషన్ భగీరథ తాగునీటి సర్వేను పూర్తి చేయాలి

## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



**బిజినేపల్లి జూన్ 20 (జనం సాక్షి)**

మండలంలోని అన్ని గ్రామాలలో మిషన్ భగీరథ తాగునీటి సర్వేను 100% పూర్తి చేయాలని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని వట్టెం. రామ్ రెడ్డి పల్లి గ్రామాలలో కొనసాగుతున్న మిషన్ భగీరథ తాగునీటి ఇంటింటి సర్వే ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వట్టెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు గ్రామాల్లో సుమారు 80% మిషన్ భగీరథ తాగునీటి సర్వే పూర్తయిందని శనివారం వరకు 100% సర్వే పూర్తి చేయాలని సర్వే చేస్తున్న సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలతో మాట్లాడుతూ మిషన్ భగీరథ నల్లాల ద్వారా త్రాగునీరు వస్తుందా ప్రతిరోజు ఎన్నిసార్లు వస్తుంది ఎంత సమయం వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తాగునీటిని ప్రజలు వృధా చేయవద్దని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు అనంతరం వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ మంచిగా చేయించాలన్నారు. గ్రామంలో ఇంటి పన్ను వసూలు గురించి ఆరా తీశారు అనంతరం వట్టెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సందర్శించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అందంగా ఆదర్శంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల ఆవరణ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతిరోజు పర్యవేక్షించాల న్నారు. పాఠశాలలోని విద్యార్థులకు ఏకరూప దుస్తులు టెక్స్ట్ బుక్స్ నోటుబుక్ పంపిణీ జరిగిందా అని అధికారులు అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు అదేవిధంగా పాఠశాలలో పెండింగ్లో ఉన్న పనుల్లో వివరాలను పదును ఉపాధ్యాయుని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయాలని సూచించారు. ఇప్పటికే పాఠశాలలలో యూనిఫారం పుస్తకాలు అందజేత పూర్తయిందని పాఠశాలలో ఇంకా ఏవైనా పద్ధతులు కావాలన్నా వెంటనే పూర్తి చేయాలని అందుకు సంబంధించిన ప్రాజెక్టును విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఆయన వెంట డీఈవో కృష్ణ .గోవిందరాజులు. ఇన్చార్జి సిఈఓ గోపాల్ నాయక్, ఎమ్మార్వో శ్రీరాములు, ఎంపీడీవో కథలప్ప, ఎంపీఓ రాము నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.




# మక్తల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

## ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ జూన్ 20 (జనం సాక్షి)**

మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ పావని మల్లిఖార్జున్ అధ్యక్షతన జరిగిన పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే పాల్గొని కీలక సూచనలు చేశారు. వార్డులలో సీసీ రోడ్లు, డ్రైన్లు, వర్ష కాలం దృష్ట్యా పైప్ లైన్లు, మోటార్ రిపేర్లు , రానున్న వర్షాకాలంలో చెయ్యవలసిన పనులపై చర్చించారు. 43 ఏజండా అంశాలకు గాను అన్నీ అంశాలను తీర్మాణాలు ఆమోదించారని కమిషనర్ భోగేశ్వర్ తెలిపారు. శాసన సభ్యులు మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కావాల్సిన చేయాలసిన పనులపై తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ అఖిల రాజశేఖరరెడ్డి, వార్డు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ మెంబెర్స్, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్..గా పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం

## ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు




**పెబ్బేరు జూన్ 20 (జనం సాక్షి)**

నూతన విద్యా సంవత్సరం కావడంతో ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాపారం కొనసాగుతుంది. ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు ఇచ్చినప్పటికీ అవి కూడా పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందడం లేదు. తమ పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని తల్లిదండ్రుల ఆశలతో ప్రవేట్ పాఠశాలలు అదనుగా భావించి వ్యాపారాన్ని ఆరు కాయలుగా విస్తరింపజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, టై బెల్టులు అమ్మకూడదని ప్రభుత్వ జిఓ విడుదల చేసింది. ప్రభుత్వ నిబందనలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బేఖాతరు చేస్తూ పాఠశాలల్లోనే స్టేషనరీ షాపులు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. విద్యా ర్థులకు కావాలసిన బుక్స్, టై, బెల్ట్ లు తప్పనిసరిగా పాఠశాలలోనే కొనుగోలు చేయాలని నిబంధనలను విద్యా ర్థుల తల్లిదండ్రులకు రుద్దుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు విద్యను మాత్రమే అందించాల్సి ఉంటుంది. స్టేషనరీ వ్యాపారం చేయవద్దంటూ ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. దీనికంతటికి విద్యాశాఖ అధికారుల సహకారం లభిస్తుంది. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు చూసిన చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే విధంగా పాఠశాల్లోకి విద్యార్థులు తప్పనిసరిగా టై బెల్టు, లు యూనిఫాం, స్టడీ మెటియల్ ఉంటేనే క్లాస్ రూంకి అనుమతిస్తారు. లేదంటే ఇంటికి వెళ్లల్సిందే. ఇదే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు చదువు కంటే ఎక్కువ స్టేషనరీ వ్యాపారం పైనే ఆధారపడి వ్యాపారం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల యూనిఫాం, టై బెల్టులను మార్చుతూ తప్పనిసరిగా కొనేలా చేస్తున్నారు. అదే విధంగా విద్యార్థులకు రోజు వారి షెడ్యూల్ కోసం ప్రత్యేక డైరీలను తయారు చేసి విక్రయిస్తున్నారు. దీని ద్వారా కూడా విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బం దులకు గురి చేస్తున్నారు.

### విద్య హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్న ప్రైవేటు పాఠశాలలు

యాజమాన్యాలు పెద్ద ఎత్తున ఫీజును పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందుల పాల్చేస్తున్నారు. కొందరు పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులకు పలు కార్యక్రమాలక మీటింగ్లకు తమ పాఠశాలను వాడుకునేందుకు ఇస్తున్నారు. దీంతో మా కేంటి విద్యాశాఖ ఉన్నతాధికారులే తాము చెప్పినట్లు వింటారు. ఎవరు ఏం చెస్తారనే ధీమాతో ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులు పెంచుతున్నారు. వారే పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వర్క్ బుక్ పై కూడా తమ పాఠశాలల పేర్లు ప్రింటింగ్ చేసి విద్యార్థులకు అంట గడుతున్నారు. తప్పని సరిగా పాఠశాలోనే పాఠ్య పుస్తకాలు యూనిఫాం, వర్క్ బుక్లు, టై బెల్టులు కొనవల్సిన పరిస్థితులు కల్పించారు.

### ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం

ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తమ పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిఓ విడుదల చేశారు.. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు ఉండకుండా పాఠశాల యాజమాన్యాలు దోపిడి నుంచి విముక్తి కల్పిం చేందుకు ప్రభుత్వం సంకల్పిస్తే అవినీతి అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. ప్రైవేటు పాఠ శాలల్లో యథేచ్ఛగా స్టేషనరీతో అదనపు వ్యాపారం చేస్తున్నా విద్యా శాఖ అధికారులు నోరు మెదపడం లేదు. చదువుల భారంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.. విద్యాశాఖ అధికారులు ఎక్కడా కూడా ప్రైవేట్ పాఠశాలలను తనిఖీలు చేయడం మానేశారు.. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఇచ్చే కాసులకు కకుర్తి పడి వారు ఏమి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యం అవలంబించే విధానాలను పర్యవేక్షించే బాధ్యతను అమలు చేయాలని విద్యార్థు తల్లి దండ్రులు కోరుతున్నారు. అదే విధంగా ప్రతి ఏటా పెంచు తున్నా ఫీజులను అరికట్టడంతో పాటు నియంత్రణ చట్టం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సమాజ అభ్యున్నతికి సాహిత్యం పునాది

- **అభిరుచి ఉంటే అలవికాని రంగమే లేదు**
- **మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి, జూన్ 20, (జనం సాక్షి):**

అభ్యున్నతికి ప్రాచీన కాలం నుంచి కూడా సాహిత్యం సమ సమాజ అభ్యున్నతికి పునాదిగా నిలిచిందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివర్ణించారు. పలు సందర్భాల్లో తాను రాసిన వ్యాసాలను సీఎన్ఆర్ విద్యాసంస్థల అధ్వర్యంలో ముద్రించిన మన కల నిజం అనే సంపుటిని బుధవారం హైదరాబాద్ లోని ఆబిడ్స్ తెలంగాణ సారస్వత పరిషత్తులో రాత్రి ఆవిష్కరించారు ప్రముఖ కవి రచయిత వనపట్ల సుబ్బయ్య వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. ఇదే వేదికలో చింతల నిర్మలాదేవి,నారాయణ్ రావు గార్ల పేరు మీద నెలకొల్పిన జీవన సాఫల్య పురస్కారాన్ని వనపర్తికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త సాహితీ ప్రియుడు నాగవరం బలరాంకు ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి మాట్లడుతూ నన్ను సాహిత్యం వైపు నడిపించిని బలరాం సమాజ సేవ కోసం నిరంతరం పాటుపడుతున్నారని, అన్ని రంగాల పట్ల అద్భుతమైన ప్రజ్ఞా పాటవాలు కలగిన ఆయన అరుదైన, అపురూప వ్యక్తియని కొనియాడారు. గత పదేండ్ల కాలంలో తాను వివిధ పత్రికలకు వ్రాసిన వ్యాసాలను మన కల నిజం పేరుతో పుస్తక రూపంలో తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు.

### వనపర్తి జిల్లాను అగ్రగామిగా నిలిపిన నిరంజన్ రెడ్డి:ఘంటా చక్రపాణి

టీఎస్పీఎస్ మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ వనపర్తి జిల్లాను ఏర్పాటు చేయించి అభివృద్ధి పథంలో నిలిపిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రాజకీయ వేత్తనే కాకుండా సమాజ రుగ్మతలను రూపుమాపడంలో అగ్రగామిగా నిలిచారని ప్రశంసించారు దక్కన్ ల్యాండ్ పత్రిక ఎడిటర్ వేదకుమార్, సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్.జే.చెన్నయ్య,సాహితీవేత్తలు కోట్ల వేంకటేశ్వర రెడ్డి,చింతలపల్లి భాస్కర్ రావు ప్రొఫెసర్ సీతారాం, కిషన్ రావు,డాక్టర్ బుపేశ్ కుమార్,విమల మరియు బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**వెల్దుర్తి జూన్ 20 (జనం సాక్షి)**

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీ సాయి డయాగ్నొస్టిక్ సెంటర్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనునిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఈ డయాగ్నొస్టిక్ సెంటర్ ద్వారా పేద ప్రజలందరికీ మెరుగైన సేవలు అందించాలని ఆమె తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన డయాగ్నొస్టిక్ సెంటర్‌ను గురువారం రోజు ఆమె ప్రారంభించడం జరిగింది. అనంతరం ప్రత్యేక పూజలు చేసి డయాగ్నస్టిక్ మిషన్లను ప్రారంభించారు. నిర్వాహకుడిని మైపాల్‌ను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అభినందించారు.

# బాధిత మహిళలకు అండగా మంత్రి జూపల్లి

**అమానవీయ ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి**

**జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి కేసు పురోగతిపై ఆరా**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 20 (జనం సాక్షి):**



నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియో జకవర్గం మొలచింతల పల్లి గ్రామం లో చెంచు మహిళపై జరిగిన అమానవీయ ఘటనపై ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. పాశవిక దాడిని ఖండించి, విచా రం వ్యక్తం చేశారు. బాధిత మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి పాశవిక దాడులకు ఎవరూ పాల్పడిన ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌కు ఫోన్ చేసి.. కేసు దర్యాప్తు పురోగతిపై మంత్రి ఆరా తీశారు. ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ...మంత్రికి వివరించారు. అమానుషంగా ప్రవర్తించిన నిందితులపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.




# పేట డిపోలో కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

నారాయణ పేట డిపో నుంచి గురువారం నారాయణపేట నుండి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కొత్త డీలక్స్ బస్సు, నారాయణపేట నుండి దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి కొత్త పల్లె వెలుగు బస్సులను నారాయణపేట శాసనసభ్యులు శ్రీమతి పర్ణిక రెడ్డి ప్రారంభించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ మేనేజర్ శ్రీదేవి హాజరైనారు ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీమతి లక్ష్మీ సుధా, అలివేలమ్మ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ చంద్ర నాయక్ ఎం ఎఫ్ డిపో అధికారులు సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నారాయణపేట నుండి శ్రీశైలం కు మధ్యాహ్నము 1:50 కు బయలుదేరాను శ్రీశైలం రాత్రి 8:30 గంటలకు చేరును,మరుసటి రోజు శ్రీశైలం నుండి ఉదయము 5 గంటలకు బయలుదేరి నారాయణపేటకు 11:30 చేరును నారాయణపేట నుండి సజనాపూర్ గ్రామానికి ఉదయం 7:20 గంటలకు బయలుదేరి తిరిగి సజనాపురం నుండి ఉదయం 8:20 కు బయలుదేరను.సాయంత్రం నారాయణపేట నుండి సజనాపురం గ్రామానికి 4:45 నిమిషాలకు బయలుదేరి తిరిగి సజనాపురం నుండి 5: 15 నిమిషాలకు బయలుదేరి నారాయణపేటకు చేరుకుంటుందని తెలిపారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**

అమ్మ ఆదర్శ పాఠశాలలు ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోస్గి తిమ్మాయిపల్లి మూడో వార్డులో ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు యూనిఫార్మ్ వచ్చాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఇవ్వని పక్షంలో వెంటనే విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడి ఏం భోజనం చేశారు అని అడిగారు. భోజనం నాణ్యతగా ఉందా అని ప్రశ్నించారు. విద్యార్థులతో తరగతి పుస్తకాలను కలెక్టర్ చదివించారు. పాఠశాలలో టాయిలెట్స్ పనులు, త్వరగా పూర్తి చేయాలని నీటి సరఫరా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాల కోసిగిలో తనిఖీ చేసిన కలెక్టర్ ఎంతమంది విద్యార్థులు ఉన్నారు అడిగి తెలుసుకున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో 386 మంది విద్యార్థులు ఉన్నారని హెడ్మాస్టర్ తెలిపారు. అనంతరం టాయిలెట్స్ కాంపౌండ్ వాల్ పనులు తనిఖీ చేసి మిషన్ భగీరథ నీటిని పాఠశాలకు తీసుకోండి అని తెలిపారు. పాఠశాలకు ఫర్నిచర్ వచ్చిందా లేదా మెటీరియల్ డంప్ చేశారా అని సెక్టోరియల్ అధికారిని ఆరా తీశారు. జిల్లాలో 54 అమ్మ ఆదర్శ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అలాగే బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాలలో ఉర్దూ మీడియం తెలుగు మీడియం నడుస్తుంది అని హెడ్మాస్టర్ తెలిపారు. అనంతరం పట్టణ ప్రగతిలో పనులు చేస్తున్నందున 15 రోజులలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్,తాసిల్దార్, డీఈవో, జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల పాలిట శాపంగా నులిపురుగులు

## జెడ్పీ చైర్మెన్ లోకనాథ్ రెడ్డి



**వనపర్తి, జూన్ 20 (జనం సాక్షి):**

శారీరకంగాఎదగనీయకుండా నులిపురుగులు పిల్లల పాలిట శాపంగా మారుతున్నాయని వనపర్తి జిల్లా పరిషత్ చైర్మెన్ రాకాసి లోకనాథ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో నులి పురుగుల నిర్మూలన మాత్రలు (అల్బెండాజోల్ ట్యాబ్లెట్స్ ) పంపిణీ చేశారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ..నులి పురుగుల వల్ల పిల్లలు ఎదుగుదల మందగించడం, నీరసం, రక్తహీనత ఏర్పడుతుందని, చదువులో ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలతో బాధపడుతున్నారని అన్నారు. వీటిని నివారించేందుకు ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు మాత్రలు వేసుకోవాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పాటించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటంటే, సాధారణంగా పేగు పురుగులుగా పిలవబడే నులిపురుగుల పిల్లలు పరాన్నజీవులని, అవి కడుపులో పెరిగి పిల్లలు తిన్న ఆహారాన్ని గ్రహిస్తాయని, అందువల్ల శరీరంలో రక్తహీనత ఏర్పడుతుందని అన్నారు. నులి పురుగుల నివారణ దినోత్సవం జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుపుతున్నారని గుర్తు చేశారు.నులి పురుగుల నివారణ మాత్రలు అన్ని విద్యా సంస్థల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి మండలం ఎంపిపి శ్రీ కిచ్చారెడ్డి, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# గంజాయి రహిత జిల్లాగా చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**నారాయణపేట జిల్లా బ్యూరో( జనం సాక్షి):**


నారాయణపేట జిల్లాను గంజాయి రహిత జిల్లాగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ నార్కోటిక్స్ కంట్రోల్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగుపై నిఘా ఉండాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలు సమాచారం తెలిస్తే కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లాను గంజాయి మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ రెడ్డి, డీ.ఎస్.పి నల్లపు లింగయ్య, ఆర్టీవో మేనకా గాంధీ, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్,నారాయణపేట ఎక్సైజ్ శాఖ సిఐ అశోక్ కుమార్, కోస్గి సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యోగా.. నీలోని అంతర్గత శక్తిని వెలికి తీసే
# వజ్రాయుధం



**"ప్రపంచంలో జీవిస్తూ పరమాత్ముడితో నటించేవాడు.... మనిషి పరమాత్ముడితో జీవిస్తూ ప్రపంచంతో నటించేవాడు మహర్షి" ఇలా ప్రతి ఒక్కరు కూడా మహర్షి అంటే యోగ ధ్యానము ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది ప్రాథమికంగా యోగ ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. ఇది మనసు శరీరం మధ్య సామరస్యం తీసుకుని రావడం పై దృష్టి సారించి సూక్ష్మశాస్త్రం.**

యోగ విజ్ఞాన శాస్త్రము ప్రకారం పరిపూర్ణ జీవన సార విధానం ఆరోగ్యకరమైన శక్తిని పంచుకొని ఆనందకర అనుభూతి యోగ మతం నమ్మకం వ్యవస్థలు పుట్టకముందే యోగ శాస్త్రం కొన్నివేల సంవత్సరాల క్రితం దాని మూలాన్ని కలిగి ఉంది పురాణాల్లో శివుడిని ఆదియోగ చూస్తారు .800 నుండి 1700 సంవత్సరం వరకు శంకరాచార్య రామానుజాచార్య వంటి వారు హఠయోగాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొని వచ్చారు. 1700 నుండి 197 ఆధునిక కాలంలో రమణ మహర్షి రామకృష్ణ పరమహంస వివేకానంద వంటి వారు రాజయోగాన్ని అభివృద్ధికి కృషి చేశారు .పంచం మహావృత్తుల ద్వారా మహావీర అష్టంగా మార్గాలతో మార్గయోగాల ద్వారా బుద్ధుడు జ్ఞాన యోగాన్ని ప్రతిపాదించారు. ప్రస్తుత సమకాలీనపరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం నిర్వహించటం ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత.



నేడు ప్రపంచంలో చాలామందికి యోగా అంటే ఆసనాలు. కానీ ఆసనా లు యోగాలో ఒక సన్నాహక అంశం మాత్రమే యోగ ఒక అభ్యాసం భంగిమ కాదు ఇది ఒక మార్గం యోగ అనే పదం యూత్ అనే సంస్కృతం పదం నుండి గ్రహించబడింది యోగా పురాతనమైనది అయినప్పటికీని ఒక నిర్దేశిత లేకుండా క్లిష్టంగా ప్రజలు గ్రహించటానికి వీలుగా లేకుండా ఉండేది. పతంజలి మహర్షి యోగా యొక్క అన్ని అంశాలను ఒక నిర్దిష్ట ఆకృతిలో క్రోడీకరించి 196 సూత్రాల సమాహారంగా మార్చి ప్రజలకు అందించారు అందుకే పతంజలి ని పతంజలి మహర్షిని "ఆధునిక యోగ పితామహుడు గా" పిలుస్తారు
సూత్రం అంటే దారం.

యోగ అనేక వివిధ రూపాలలో ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంది కొందరు శారీరక భంగిమలు వేగంగాను కదిలేటట్టు కొందరు విశ్రాంతిపై దృష్టి పెడుతూ, కొందరు



డైనమిక్ శ్రమతోను కూడినటువంటిది. కానీ ఎవరైనా యోగాసనం చేస్తున్నంతసేపు మాత్రం శరీరం, మనసు, శ్వాస మధ్య సంబంధాన్ని కలిగి ఉంటారు. యోగ కష్టతర ఆసనాలతో, శ్వాసక్రియతో కూడుకున్నటువంటి ప్రక్రియ దీని ద్వారా శారీరక మానసిక సమతౌల్యం ఏర్పడుతుంది యోగాసనా లు శరీరానికి దృఢత్వాన్ని శక్తినిస్తాయి .ధ్యానం మనోధైర్యాన్ని మనోల్లాసాన్ని కుశాగ్ర బుద్ధిని పరిపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుంది.


యోగ అనేది మన జీవితంలోని అంతర్భాగమే ఇది కొత్త విషయం ఏమీ కాదు మనం పుట్టిన దగ్గరనుంచి కూడా ఏదో ఒక రూపంలో అవలంబిస్తున్నటువంటి ప్రక్రియలే. మీరు పసి పిల్లలని గమనించినట్లయితే వారు బోర్లా పడుకున్న ప్పుడు మకరాసనంలోనూ, పవనముక్తాసనములను ఎన్నోసార్లు వేస్తుండగా చూస్తూనే ఉంటాం.అందుకే యోగ "మన జీవన విధానం జీవనం గమ్యం."

ప్రస్తుతం జీవన కాలంలో నిత్యం ఆదుర్ద ,అలసట, మానసిక ఒత్తిడి, మనోలాసం కొరవడి హాయిగా నవ్వుకునే అవకాశం లేక ఈ బాధ్యతలు పని ఒత్తిడి వల్ల మానవ జీవన సారాన్ని పిప్పి చేస్తున్నాయి . ఈ జీవన ఒత్తిడి వల్ల అధిక బరువు ఆస్తమా గుండెనొప్పి, జీర్ణకోశ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు మెన్సురేషన్ డిజార్డర్స్ మతిమరుపు మైగ్రేన్ నిద్రలేమి వంటి వ్యాధులకు గురవుతున్నాం ఇటువంటి వాటిని కచ్చితంగా నయం చేయగలిగేది యోగ మాత్రమే అందువలన యోగా అనేది ఒక క్రియలా భావించక ఒక మెడిసిన్ లా భావించి యోగాభ్యసనాలు ప్రతి ఒక్కరు చేయగలిగినట్లయితే మన జీవితం సుగమం అవుతుంది. విసిగారిన మనసుతో ప్రపంచాన్ని మనం చూస్తే అంతా అయోమయం అస్పష్టం గా కనిపిస్తుంది. ఎలా అంటే దుమ్ము ధూళిని పేరుకుపోయిన అద్దంలో మనని చూసుకున్నట్లయితే అలాంటి అద్దంలో మనమే చూసుకుంటే ఎంత అస్పష్టంగా అసహ్యంగా కనిపిస్తాము అలా మలినపూరితమైన అద్దం మన మనసుకు నిదర్శనం. కనుక మనసుని దైవికమైన అద్దంలో స్వచ్ఛమైన మన ముఖం కనిపించాలంటే యోగ, ధ్యానంతోనే సుసాధ్యం అవుతుంది .అసలైన ఆనందానికి మూలమైన శక్తిని ఉత్తేజాన్ని ధ్యానం కలగజేస్తుంది .ధ్యానం చేయటం ద్వారా మన మనసు ఉత్తేజితమై మెదడులో ఎండాల్ఫిన్



పుట్టిస్తుంది. ధ్యానం విచక్షణ జ్ఞానాన్ని ఆలోచనలను, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. యోగ, ధ్యానం మెదడును తాజాగా, ఉల్లాసం గా మంచుబొట్టులా స్వచ్ఛంగా, చిగురుటాకులా తాజాగా, ఆకాశ మంత నిర్మలంగా, స్వచ్ఛమైన అమ్మ ప్రేమలా ఉంటుంది. కనుక మానవజన్మకు విశిష్టత చేకూ రాలంటే రోజు కొంత సమ యం ధ్యానం, యోగాసనా లకు కేటాయించాలి.

మనసు లేని మనిషి అంటూ ఈ భూమిపై లేరు .మనసనే కత్తికి బుద్ధి ఒక స్ఫటికం వంటిది.ఈ బుద్ధిని ఉపయోగించి ఇంద్రియ వాంఛలను అదుపులో ఉంచుకోవచ్చు. మనిషి అంతఃకరణలో మనసు బుద్ధి చెప్తాం అహం ఈ రూపం లేని వాటిని మనం అదుపులో ఉంచాలంటే ధ్యానం ఒక సాధనం ఈ జ్ఞానంతో మన జీవన మాధుర్యాన్ని తెలుసుకొని మనో మూలం ఇదం జగత్ అనుకుని జన్మ సార్ధకత ను సాధించాలి మన మనసు ఎంత విశ్రాంతి గా ఉంటుందో మనం అంత పని ఉత్తమం గా చేయగలం.



యోగ శరీరంలోని బాహ్య అంతరాభాగాల్లో ప్రతి జీవకణాన్ని ప్రభావితం చేస్తుంది. తల వెంట్రుకల నుంచి కాలిగోళ్ళ వరకు ప్రతి భాగానికి రక్త ప్రసన్న సంపూర్ణం గా జరిగేటట్లు చేసి శరీరాన్ని మనసుని ఏకీకృతం చేస్తుంది శరీరంలోని నాడీ వ్యవస్థ శుద్ధి చేసి, వాత పిత్త కఫ త్రి దోషాలు సమతూకంలో ఉంచేలా చేస్తుంది. రోజు రోగనిరోధక శక్తిని పెంచుతుంది మనోశక్తి ని పెంచుతుంది ఈనాటి కాలంలో చిన్నపిల్లల్లో మనోశక్తి అనేది కొరవడి దాని వలన చిన్న విషయాలను సైతం తట్టుకోలేక మా చెల్లి చేసుకుంటున్నారు శక్తివంతమైన మనసును చిన్న వయసు నుంచే వృద్ధి చేయాలి అలా చేయాలంటే బాల్య దశ నుంచి యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి శరీరంలో హార్మోనియం సమతుల్యం జరిగి శరీరం అందమైన ఆకృతి తో మనసు నిర్మలంగా మారుతుంది.

యోగ యొక్క ఔన్నత్యాన్ని ప్రాముఖ్యతను గుర్తించి మన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రపంచవ్యాప్తంగా యోగాన్ని ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు అందులో భాగంగానే ఉత్తరార్ధ గోళంలో అత్యంతమైన పొడవైన రోజు అయిన జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలని సెప్టెంబర్ 2014లో ఐక్యరాజ్యసమితిని కోరారు. ఐక్యరాజ్యసమితి కూడా ప్రజల శారీరక ఆరోగ్య ప్రయోజనాలు మానసిక శ్రమ అండ్ యోగ యొక్క పురాతన అభ్యసనాలు వీటన్నిటిమీద సమూలంగా తెలుసుకొని మన ప్రధాని నరేంద్ర మోడీ గారి అభ్యర్ధన మేరకు డిసెంబర్ 2021 ఐకి జనరల్ అసెంబ్లీలో జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించింది. యోగ 2024 యొక్క టీం స్వయం మరియు సమాజం కోసం యోగా యోగా మన బిజీ జీవితంలో సమతుల్యతను పునరుద్ధించడంలో సహాయపడే ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు సంపూర్ణ విధానాన్ని అందిస్తుంది. మొదటి అంతర్జాతీయ దినోత్సవం జూన్ 21 2017న ప్రపంచవ్యాప్తంగా మరియు ఆయుష్ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో జరిగింది. ఈ వేడుకలలో ప్రధాని నరేంద్ర మోడీ గారితో పాటు లక్షలాదిమందిప్రజలు, 84 దేశాలకు చెందిన ప్రముఖులు పాల్గొని 21 యోగాసనాలను కన్నుల పండుగగా వేశారు. రాజపథ్ లో జరిగిన ఈ వేడుకలు గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పింది. మొదటిది అత్యంత సంఖ్య అనగా 35985 పార్టిసిపేషన్స్ కలిగి ఉండి ప్రపంచంలో అతిపెద్ద యోగ క్లాస్ గా నిర్వహించటం. రెండవది 84 తోటి దేశాల జాతీయులను కలిగి ఉండటం.ప్రధాని మోడీ గారి 2017 అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తూ యోగ ఆలోచన ఉపనిషత్తుల నుండి వచ్చిందని ,నిరంతర సాధన ద్వారా శరీరం ఇంద్రియా లను నియంత్రించుతూ మానవ స్పృహను మార్చటా నికి యోగ ఉపయోగపడుతుందని పరమాత్మ సాక్షాత్కారానికి శరీరమే వాహనమని ,ఆధునిక యుగంలో మనం ఎదుర్కొంటు న్న సమస్యలు, వాటికి నివారణగా యోగా ఎలా ఉపయోగపడుతుందో నొక్కి చెప్పారు.

"నన్ను నేను తెలుసుకోవటానికి
నన్ను నేను మార్చుకోవడానికి"

అత్యున్నత మార్గం యోగ ధ్యాన సాధన మాత్రమే. అందుకే ప్రతిరోజు యోగా సాధన ద్వారా మన జీవన సరళిని మార్చుకొని ఆనందకరమైన జీవితం ప్రతి పౌరుడు అనుభవించాలని కోరుతూ.....



**డా: ఎన్.సి.హెచ్ కృష్ణజ్యోతి**
**పి జి టి జువాలజీ**
**టిజీఎం ఎస్ నరసింహులపేట**





## శంషాబాద్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన బి రాజేష్

**శంషాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** శంషాబాద్ జోన్ డిసిపిగా బాధ్యతలు చేపట్టిన బి రాజేష్. గతంలో హైదరాబాద్ స్పెషల్ ఇంటెలిజెన్స్ అధికారిగా ఉన్న బి రాజేష్ శంషా బాద్ జోన్ డిసిపిగా గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో శంషాబాద్ జోన్ డిసిపిగా ఉన్న నారాయణరెడ్డి తన బాధ్యతలను నూతన డీసీపీకి అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యతో పాటు ఆటల్లో కూడా ప్రతిభ కనబరచాలి





### శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ రూరల్ జూన్ 20 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభను కనపరచాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని సంగం లక్ష్మీబాయి టీజీ రెసిడెన్షియల్ పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మగవారితో సమానంగా మహిళలు కూడా ప్రతి రంగంలో రాణిస్తున్నారని, విద్యార్థి దశ నుండి విద్యతో పాటు క్రీడల్లో కూడా తమ ప్రతిభను కనబరిచా లని అన్నారు. అనంతరం సభాపతిని పాఠశాల ప్రిన్సిపల్ రమణమ్మ శాలువాతో సన్మానించారు

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ జిల్లా వైద్యాధికారి పాల్వన్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన బీజేఎంసీ భవనాన్ని సందర్శించిన ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

- గత భారాస ప్రభుత్వంలోనే రూ.12.80 కోట్లతో అభివృద్ధి పనులు
- పిలుపు రాలేదని నూతన మేయర్ వర్గం గైర్హాజర్
- కార్పొరేషన్ లో కొనసాగుతున్న ఎమ్మెల్యే వర్సెస్ మేయర్ వర్గం




**రాజేంద్రనగర్, జూన్ 20 (జనం సాక్షి) :** గత భారాస ప్రభుత్వంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరిగాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే మాజీ మేయర్ బి. మహేందర్ గౌడ్, కార్పొరే టర్లు నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత భారాస ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల సహకారంతో మున్సిపాలిటీలు కార్పొరేషన్ లలో అభివృద్ధి పనులు పుంతలు తొక్కిందని ఆయన గుర్తు చేశారు. అలాగే బండ్లగూడ జాగీర్ నూతన భవన నిర్మాణ పనులు మాజీ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్, కార్పొరేటర్ల ఎనలేని కృషితో జిహెచ్ఎంసి కార్యాలయాన్ని తలదన్నేలా రూ.12 కోట్ల 80 లక్షలతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దారని ఎమ్మెల్యే వ్యాఖ్యానిం చారు. మరికొన్ని రోజుల్లో శంషాబాద్ మున్సిపాలిటీ నూతన భవనం కూడా ప్రత్యేక హంగులతో ప్రారంభం కానుందని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి. శరత్ చంద్ర, డి.ఇ.ఇ యాదయ్య, అధ్యక్షుడు అంతారం నరేష్, కార్పొరేటర్ సాగర్ గౌడ్, నాయకులు గోకరి సురేష్ గౌడ్, సుమన్ గౌడ్, కాటా సాయిబాబా గౌడ్, మహాలింగం గౌడ్, నదీం, ప్రవీణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్ లో కొనసాగుతున్న ఎమ్మెల్యే వర్సెస్, మేయర్ వర్గం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో గురువారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నూతన భవనాన్ని సందర్శించినప్పటికీ నూతన మేయర్గా ఎన్నికైన లతా ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ పి. రాజేందర్ రెడ్డి ల మెజార్టీ కాంగ్రెస్ కార్పొరేటర్లు హాజరు కాకపోవడం కార్పొరేషన్ లో చర్చంశనీయంగా మారింది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాజీ మేయర్ మహేందర్ గౌడ్ కు మద్దతుగా నిలిచి అవిశ్వాస తీర్మానాన్ని అడ్డుకొనడంతో, మెజార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి నూతన మేయర్ పదవిని దక్కించుకున్న లతా ప్రేమ్ గౌడ్ తెలిసిన విషయమే, దీనిపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కూడా మేయర్ వర్గం ను చేరదీసి, ఆదరించడం లేదని మొన్న కార్పొరేషన్ లో నూతన అభివృద్ధి పనులకు సైతం ఎమ్మెల్యే రాకుండా పంతం పట్టారని, గురువారం ఎమ్మెల్యే రాకతో కనీసం పిలుపుకు కూడా నోచుకోలేదని మేయర్ వర్గం ఆరోపిస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే వర్సెస్ మేయర్ వర్గం తగ్గేదే లేదంటూ కార్పొరేషన్ లో వినిపిస్తున్న వాదనలు. ఈ పరిణామంపై ముందు ముందు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నూతన మేయర్ వర్గం ను చేరదీస్తారా లేక పంతంగా కొనసాగుతుందా అనే విషయంపై కార్పొరేషన్ ప్రజలు, వివిధ పార్టీల నేతలు పోటాపోటీగా విశ్లేషించుకుంటున్నారు.

## ప్రభుత్వం నుండి రావలసిన అన్ని సౌకర్యాలు కార్మికులకు కల్పిస్తాం

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్

**తాండూరు, (జనంసాక్షి) :** ప్రభుత్వం నుండి రావలసిన అన్ని సౌకర్యాలు కార్మికులకు కల్పిస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ పేర్కొన్నారు.సిఐటియు వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తాండూరు మండలంలోని సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఐ కాంటాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప ఆధ్వర్యంలో సిఐటియు సంఘంలో జాయిన్ కావడం జరిగింది. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అందరు ఏఐటీయూసీ నుండి సిఐటియు అనుబంధంగా సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్గా మార్చడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడు తూ సీసీఐ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న సీనియర్ కార్మికులను కనీస వేతనం పెంచాలన్నారు.అదేవిధంగా పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

కనీస సౌకర్యాలు కాంట్రాక్టు కార్మికులకు క్యాంటీన్ సౌకర్యము యూని ఫామ్స్ కల్పించాలన్నారు. ప్రమాద భీమా సౌకర్యం ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు సీఐటీయు ఆధ్వర్యంలో ప్రభుత్వం నుండి రావలసిన అన్ని సౌకర్యాలు కార్మికులకు కల్పించే విధంగా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వికారాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మైపాల్ రామకృష్ణ ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ చంద్రయ్య సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ మహాదేవ్ రాథోడ్ శివప్ప ప్రదీప్ కుమార్ బాలకృష్ణ రాహుల్ గోపాల్ లలితమ్మ నాగేందర్ నర్సింలు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి యోగా దివ్య ఔషదం



**నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం**
**యోగా..దివ్యౌషధం**
**సంఘటిత ఆరోగ్యానికి మెరుగైన సాధనం**
**యాంత్రిక యుగంలో పరిపూర్ణ ఆరోగ్యం**

ఐక్యరాజ్య సమితి వేదికపై 2014 సెప్టెంబర్ 27న జరిగిన 69వ సమావేశంలో ప్రధాని మోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపాలని పిలుపునిచ్చారు. ఐరాస 2014 డిసెంబర్ 11న 193 సభ్య దేశాల్లో 177 దేశాలు ఏకగ్రీవ తీర్మానానికి ఆమోదం తెలిపాయి. దీంతో ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరిపేందుకు ఐరాస ఆమోదించింది. పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రపంచ మానవాళికి యోగా ఉపకరిస్తుందని తీర్మానించారు.

యోగా పుట్టుపూర్వోత్తరాలు..
క్రీస్తు పూర్వం నుంచే హరప్పా మొహంజోదారో కాలంలో కూడా నాణెలపై ఒక యోగా ముద్ర కనిపిస్తుంది. యోగా చరిత్ర ఈ నాటిది కాదు. పురాతనమైన భారతీయ సంస్కృతిలో భాగమే. నాటి నుంచి నేటి వరకు అభివృద్ధి చెందుతూనే ఉంది. దేశంలోని అనేక గ్రంథాల్లో దీని గురించి రాసి ఉంది. క్రీస్తుకు పూర్వం నుంచి ఉన్న దీన్ని గౌతమబుద్ధుడు ఆచరించి చూపగా పతంజలి మహర్షి దాన్ని సమీకరించి క్రోడీకరించారు. వివేకానందుడు ఆధునిక యుగంలో ప్రపంచానికి చాటాడు. ధ్యానం, తపస్సు, యోగా ఎలా ఉపయోగపడుతున్నాయో తెలుసుకొని నేడు ప్రపంచంలో సుమారు వందకు పైగా దేశాల్లో ఆచరించి ఫలితాలను సాధిస్తున్నారు.

**యోగా వల్ల లాభాలు..**
యోగాతో ఏకాగ్రత, బుద్ధి కుశలతలు వికసిస్తాయి. సమగ్రంగా ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ప్రకృతి సత్యాన్ని గ్రహించడమే కాకుండా నిత్యం ఆనందంగా ఉండొ చ్చు. అన్ని రకాల అనారోగ్య సమస్యల్ని ఖర్చులేకుండా నయం చేసుకోవచ్చు. తగిన సమతుల ఆహారం తీసుకునే వీలు యోగా ద్వారానే కలుగుతుంది. ప్రాణాయామం ద్వారా కోరిన రీతిలో శ్వాస అదుపులోకి వస్తుంది. ఏకాగ్రత పెరుగుతుంది. అలసట, ఆందోళన, ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అద్భుతాలను సాధించవచ్చు.

**యోగా మన జాతి సంపద..**
భారతదేశపు సంప్రదాయ కానుక యోగా. దీని విశిష్టతను విశ్వం నలుమూలలా ప్రచారం చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ చేసిన కృషి వల్ల ఐక్యరాజ్య సమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా భారత ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజలు ఎంతో ఆనందంతో యోగాసనాల్లో పాల్పంచుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం 2016లో సామాన్య యోగా విధివిధాన క్రమాన్ని రూపొందించింది.
మనిషికి ఎంత డబ్బు, ఎంత పరపతి ఉన్న రోగ్యం లేకుంటే జ్వీవితం లొ దేన్నీ ఆస్వాదించలేరు. ఆరోగ్యం ఉంటే అన్నీ మన దగ్గరకు వస్తాయి. ఆ ఆరోగ్యం కావాలి అంటే ప్రతి రోజు యోగ చేయాలి.
శారీరక ఆరోగ్యం కోసం ఆసనాలు , ప్రాణాయామం.
మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం చేయడం ఆరోగ్యవంతుల లక్షణం
ప్రతి రోజు యోగా చేద్దాం ఆరోగ్యంగా ఉందాం

**విమలా రెడ్డి**
**నాగోల్, హైదరాబాద్**

# ఆర్ అండ్ బి అధికారులు జర చూడండి..

## ఎమ్మెల్యే సార్ అధికారులకు జర చెప్పండి..



**దమ్మపేట జూన్ 19 (జనంసాక్షి):** దమ్మపేట మండలం గట్టు గూడెం గ్రామ శివారులో హైవే పక్కన గోతులు తవ్వి వదిలేయడంతో ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. అదే కాకుండా హైవే మీద ఇసుక,కంకర పోయడంతో రాత్రి వేళల్లో వాహనదారులకు ఎంతో ఇబ్బందికరంగా మారుతుంది. వానాకాలం కావడంతో వాహనదారులు రాత్రి సమయంలో గోతులలో లేదా ఆ కంకర గుట్టలకు తగిలి ప్రాణాలు కోల్పోయే ప్రమాదము పొంచి ఉన్నది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ రద్దీగా ఉండే రోడ్డుపై ప్రాణహాని ఉందని ఆర్ అండ్ బి అధికారులకు తెలియదా అని ప్రజలు వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని అధికారులకు తగిన సలహాలు సూచనలు తెలిపితే ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు తగు చర్యలు తీసుకుని వాహనదారుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాహితం కోసం జర్నలిస్టులు పాటుపడాలి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రజాహితం కోసం జర్నలిస్టులు పాటుపడాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఉషా హరి కన్వెన్షన్‌లో అమర్‌నాథ్ ప్రాంగణంలో గురువారం జరిగిన టియూడబ్ల్యూజె(ఐజెయు) రాష్ట్ర మహాసభల్లో రెండోరోజు గురువారం మంత్రి పాల్గొని ప్రసంగించారు. జర్నలిజం కత్తి మీద సాము లాంటిదన్నారు. నీతి నిజాయితీతో పనిచేసే ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవన్నారు. జర్నలిస్టులు దారి తప్పితే సమాజానికే ప్రమాదకర మన్నారు. యాజమాన్యాలు ఒత్తిడి చేసినా వృత్తిలో నిఖార్సయిన జర్నలిస్టులు ఇంకా పని చేస్తూనే ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల ఒత్తిళ్ల తో యాజమాన్యాలు ఆంక్షలు పెట్టినా మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్న జర్నలిస్టులు ఎంతో మంది ఉన్నారన్నారు. స్వాతంత్ర పోరాటంలో పత్రికల పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ లో నిజాం రజాకార్ల దౌర్జన్యాలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల్ని చైతన్యపరచడంలో పత్రికలు ముందున్నాయన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినా, కరోనా లాంటి మహమ్మారి కరోళ నృత్యం చేసినా సామాజిక బాధ్యతగా జర్నలిస్టులు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సోషల్ మీడియా పెను సవాల్ గా మారిన వేళ విశ్వసనీయతలో పత్రికల స్థానం చెక్కు చెదరలేదుతన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో జర్నలిస్టులు ఎంతో సహకరించారని, వారి రుణం మరిచిపోనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ మంత్రిగా పనిచేసే అవకాశం దక్కింది. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్య శ్యామలం చేయడమే నా రాజకీయ లక్ష్యం. ఆ దిశగా సాగుతున్న తన ఎదుగుదలలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. జర్నలిస్టుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఎంతో సానుకూలంగా ఉన్నారన్నారు. జర్నలిస్టుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ బాధ్యులు వంశీ మాట్లాడుతూ ఏజెన్సీలో తమ ట్రస్ట్ చేస్తున్న సేవలకు జర్నలిస్టుల సహకారంతో ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కమర్తపు మురళీ, రావూరి సైదుబాబు, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, పాలెపు వెంకటరమణ, తుపాకుల ఎలగొండస్వామి, ప్రముఖ వస్త్ర వ్యాపారి గుర్రం ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ టీచర్ల సేవలు గొప్పవి..

## అంగన్వాడీలలో చదివే పిల్లలు ఉన్నతస్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** అంగన్వాడీ సెంటర్లలో టీచర్ల ద్వారా పిల్లలకు ప్రాథమిక విద్య అందించడం, వారు చేస్తున్న సేవలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనియాడారు.గురువారం కలెక్టరేట్ లో జిల్లాలోని 70 మంది అంగన్వాడీ టీచర్లకు నూతన పూర్వ ప్రాథమిక విద్యపై జరుగుతున్న శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు.అంగన్వాడీ సెంటర్లలో టీచర్ల సేవ మరువలేనిదని, అంగన్వాడీలో పిల్లలకు పౌష్టికహారంతో పాటు చదువు పట్ల మక్కువ పెరిగేలా చేసి, వారు ఉన్నత స్థాయికి చేరేలా నూతన పూర్వ ప్రాథమిక విద్యను అందించి వారిలో మానసిక, శారీరక భాష, సాంఘిక భావోద్వేగా భావాలను అభివృద్ధిపరిచే విధంగా వారి పాఠ్యప్రణాళికను రూపొందించుకొని ప్రీ స్కూల్ తరగతులు నిర్వహించాలని అన్నారు.ఇక్కడ శిక్షణ పొందిన టీచర్లు మండల స్థాయి మిగతా అంగన్వాడి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించి, పిల్లలకు నూతన పూర్వ ప్రాథమిక విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# విద్య నైపుణ్యాన్ని వెలికితీస్తుంది..

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**చంద్రుగొండ జూన్ 20 (జనంసాక్షి ):** విద్య నైపుణ్యాన్ని వెలికి తీస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పిల్లలు క్రమం తప్పకుండా బడికి హాజరు కావాలని అర్థం కాని సబ్జెక్టులను ఉపాధ్యాయులకు పదేపదే అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ రాకను తెలుసుకున్న మద్దుకూరు గ్రామ ఉపాధి హామీ పథకం కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత ఏడాది హరితహారం కార్యక్రమంలో నర్సరీ మొక్కలు నాటడం జరిగిందని నేటికీ ఆ డబ్బులు పూర్తిగా రాలేదని చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని విచారణ చేపట్టాలని కోరారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తాసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, వి ఆర్ ఈ ఈ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, సిడిపిఓ నిర్మల జ్యోతి, ఏఈ శ్రీనివాస్ హెచ్ఎం భవాని తదితరులు ఉన్నారు.

# జిల్లా కేంద్రంలోని స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్





**నల్గొండటౌన్, జూన్ 20(జనంసాక్షి):** నల్లగొండ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి,సిబ్బంది పని తీరు, వారి సమస్యలుపై ఆరా తీశారు.సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ,స్టేషన్ కేసుల స్థితిగతులు,పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు మరియు సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని క్రైమ్ రేటు ను మరింత తగ్గించేందుకు కృషి చేయాలని, కేసులను త్వరిత గతిన పూర్తిచేసి భాదితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. జిల్లాలో దొంగతనాల కట్టడిపై దృష్టి పెట్టాలి. సాయంత్రం వేళల్లో రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ లు నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎస్బి డి ఎస్ పి రమేష్, నల్గొండ డి.ఎస్.పి శివరాం రెడ్డి,వన్ టౌన్ సీఐ లు సత్యనారాయణ, టూ టౌన్ సిఐ డేనియల్ కుమార్, ఎస్బి సి.ఐ రాఘవరావు, ఎస్సైలు నాగరాజు, సందీప్ రెడ్డి, శంకర్, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మీడియా అకాడమీ ఛైర్మన్‌ను కలిసిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

**ఖమ్మం , జూన్ 20 (జనంసాక్షి):** రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ గురువారం ఉదయం ఉషాహరి కన్వెన్షన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా పూలబొకేను అందించారు. అనంతరం పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు అకాడమీ ఛైర్మన్ సూచించారు. పది రోజుల్లో ఇళ్లస్థలాలను అందచేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

# చింతకానిలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మిక తనిఖీలు



**చింతకాని,జూన్20(జనంసాక్షి)** జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం చింతకాని మండల తహశీల్దార్ కార్యాలయ ఆకస్మిక తనిఖీ చేశారు. ధరణి పెండింగు దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ స్లాట్ ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న మందులు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం చింతకానిలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నది, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ

# వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి) :** ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్ చింతకాని తహశీల్దార్ కార్యాలయ ఆకస్మిక తనిఖీ చేపట్టి, ధరణి, రిజిస్ట్రేషన్ స్లాట్ల పెండింగ్ లను అడిగి తెలుసుకున్నారు. సక్సేషన్ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి, కలెక్టర్ స్వయంగా దరఖాస్తు దారునికి ఫోన్ ద్వారా తహసిల్ కార్యాలయానికి త్వరితగతిన వచ్చి, పరిష్కరించుకోవాలని సూచించారు. సక్సేషన్ కు సంబంధించి కావాల్సిన ధృవీకరణల విషయమై సంబంధిత అధికారులకు, నిర్ణీత వ్యవధిలోగా ధృవీకరణల జారీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలానికి సంబంధించి ధరణికి సంబంధించి ఏ ఏ దరఖాస్తులు పెండింగులో ఉన్నవి, రిజిస్ట్రేషన్ స్లాట్ లు ఎన్ని ఉన్నవి అడిగి తెలుసు కున్నారు. తిరస్కరణకు గురయిన దరఖాస్తుల విషయమై, దరఖాస్తు దారునికి తిరస్కరణకు కారణం తెలుపాలన్నారు. దరఖాస్తుల పరిష్కా రానికి వ్యక్తిగత శ్రద్ధ వహించాలని కలెక్టర్ అన్నారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా చింతకాని నాయబ్ తహసీల్దార్ వీరభద్ర నాయక్, ఎంపిఓ రవీంద్ర ప్రసాద్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**మధిర ఆర్సి జూన్ 20 (జనంసాక్షి)** ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు. గురువారం ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్ రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా నియంత్రించేందుకు రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువ నమోదవుతున్నాయో వాటి నియంత్రణకై దృష్టి పెట్టాలన్నారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు.అదేవిధంగా విధి నిర్వహణలో రోల్ క్లారిటీ వుండాలని, ప్రతి కేసులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, తద్వారా బాధితులకు సరియైన న్యాయం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**చింతకాని జూన్ 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న సేవలు, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎంతమంది ఉన్నది పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి ఎక్కువగా ఏ ఏ వ్యాధుల వారు వస్తున్నది, ల్యాబరేటరీ లో ఏ ఏ తరహా పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో డయాబెటిస్ నిర్ధారణ అయిన రోగులకు ఏ విధంగా ఫాలో అప్ చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ఆరోగ్య కేంద్ర పరిధిలో 13 ప్రసవాలు కాగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 4 సాధారణ ప్రసవాలు జరిగినట్లు, 9 ప్రసవాలకు జిల్లా ఆసుపత్రికి పంపగా, ఆపరేషన్ ద్వారా డెలివరీలు జరిగాయని వైద్యాధికారి తెలిపారు. గర్భిణిగా నిర్ధారణ అయినప్పటి నుండి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పౌష్టికాహారం, యోగా, వ్యాయామాల గురించి అవగాహన కల్పించి, చైతన్యం తేవాలని, అప్పుడు అన్ని సాధారణ ప్రసవాలు జరుగుతాయని, ఈ దిశగా వైద్యాధికారి, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కమ్యూనిటీ ఆరోగ్య అధికారి తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ప్రజల్లో శుచి, శుభ్రత, పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పించాలని, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, వీరు తమ విధులు సక్రమంగా చేపడితే, ప్రజలు ఆసుపత్రులకు వెళ్లే అవసరం రాదని ఆయన అన్నారు. ప్రస్తుతం పిల్లలు, యువతలోను అనీమియా, ఎముకల బలహీనతలు వస్తున్నాయని, ఈ దిశగా రాకుండా నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. ఎంతమందికి బి.పి., షుగర్ లకు మందులు ఇస్తున్నది అడిగి, బి.పి., షుగర్ లకు మంచి మందులు పూర్తి ఉచితంగా అందజేస్తామని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కుక్క, పాము కాటుకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా వైద్యాధికారి డా. అల్తాఫ్, చింతకాని మండల నాయబ్ తహశీల్దార్ వీరభద్రనాయక్, ఎంపిఓ రవీంద్ర ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# టియూడబ్ల్యూజె(ఐజెయు) రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

## రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విరాహత్ ఆలీ, కె.రాం నారాయణ

**ఖమ్మం , జూన్ 20 (జనంసాక్షి) :** టియూడబ్ల్యూజె(ఐజెయు) రాష్ట్ర కార్యవర్గాన్ని మహాసభలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలోనే రాష్ట్ర అధ్యక్షుడిగా కె.విరాహత్ అలీని ఎన్నుకున్నారు. ఖమ్మంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభల్లో మిగతా కమిటీని ఎనుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాం నారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు ముగ్గరు, కార్యదర్శులు ముగ్గరిని, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా కె.విరాహత్ అలీ,ఉపాధ్యక్షులుగా 1. గాడిపల్లి మధు (వరంగల్), 2. ఎంఏకె ఫైసల్(సంగారెడ్డి), 3. బి.సంపత్‌కుమార్(పెద్దపల్లి)ప్రధాన కార్యదర్శి : కె.రాంనారాయణ (ఖమ్మం) కార్యదర్శులు : 1. కె.శ్రీకాంత్‌రెడ్డి(సంగారెడ్డి), 2. జి.మధుగౌడ్(వనపర్తి), 3. వి.యాదగిరి (హైదరాబాద్)

కోశాధికారి : ఎం.వెంకట్‌రెడ్డి (మేడ్చల్) కార్యవర్గసభ్యులు : ఎం.వేణుగోపాలరావు (ఖమ్మం), పి.వేణుమాధవరావు (హన్మంకొండ), ఆర్.ప్రకాష్‌రెడ్డి (మంచిర్యాల), ఎం.కర్ణయ్య(నాగర్ కర్నూల్), జి.శ్రీనివాస్‌శర్మ(మెదక్), పి.ప్రభాకర్‌రెడ్డి(నల్గొండ), సయ్యద్ అబ్దుల్ లతీఫ్(కామారెడ్డి), జె.సురేందర్‌కుమార్ (జగిత్యాల), ఏ.రవీందర్ (కరీంనగర్), ఏ.రాజేష్(హైదరాబాద్), కె.రాజిరెడ్డి(సిద్ధిపేట), సయ్యద్ గౌస్ మోహియుద్దీన్(హైదరాబాద్), కె.అనిల్‌కుమార్ (హైదరాబాద్), చలసాని శ్రీనివాసరావు(సూర్యాపేట), కంకనాల సంతోష్ (హన్మకొండ), గుడిపెల్లి శ్రీనివాస్(రంగారెడ్డి).

# విపణి



## వరుసగా ఆరో రోజు సెన్సెక్స్ లాభాల పరుగు.. నిఫ్టీ ఏ 23,550

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాల పరుగు కొనసాగుతోంది. తీవ్ర ఒడుదొడుకులు ఉన్నప్పటికీ వరుసగా ఆరో రోజూ సెన్సెక్స్ లాభాలను దక్కించుకుంది.క్రితం సెషన్‌లో గరిష్ఠాల నుంచి వెనక్కి వచ్చిన నిఫ్టీ గురువారం మళ్లీ పుంజుకుంది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 140 పాయింట్లు లాభపడి కొత్త రికార్డుతో ముగియగా.. నిఫ్టీ 23,550 మార్క్ దాటింది.ఈ ఉదయం సూచీలు ఉత్సాహంగానే ప్రారంభమైనప్పటికీ.. దేశీయంగా, అంతర్జాతీయంగా మార్కెట్‌పై ప్రభావం చూపే పరిణామాలు పెద్దగా లేకపోవడంతో ఆ తర్వాత ట్రేడింగ్‌ను స్తబ్దుగా సాగించాయి. 77,554 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 77,643 గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఒక దశలో 77,100 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 141.34 పాయింట్ల లాభంతో 77,478.93 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 51 పాయింట్లు లాభపడి 23,567 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 20 పైసలు క్షీణించి 83.64 వద్ద ఆల్‌టైం కనిష్ఠాన్ని తాకింది.ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఫార్మా రంగాల్లో అమ్మకాలు జరగ్గా.. లోహ, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, చమురు రంగ షేర్లలో కొనుగోళ్లు జరిగాయి. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, భారత్ పెట్రోలియం షేర్లు లాభపడ్డాయి. హీరో మోటార్స్, సన్‌ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, విప్రో షేర్లు నష్టపోయాయి.



# ఆదాయ పన్ను రిటర్నులు.. మీకు ఏ ఫారం వర్తిస్తుందో తెలుసా?

గత ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేసేందుకు సమయం వచ్చేసింది. జులై 31 లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఐటీఆర్ దాఖలు చేసేందుకు సరైన ఫారాన్ని ఎంచుకోవడం తప్పనిసరి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం ఇప్పటికే ఈ ఫారాలను నోటిఫై చేసింది. పొరపాటున తప్పు ఫారాన్ని ఎంచుకుంటే, ఆదాయపు పన్ను శాఖ దానిని అంగీకరించకపోవచ్చు. అప్పుడు అది 'డిఫెక్టివ్ రిటర్న్'గా పరిగణిస్తారు.

ఆదాయం, నివాస స్థితి, వ్యాపారం తదితరాల ఆధారంగా ఈ ఫారాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. మొత్తం ఏడు ఫారాలు ఉన్నప్పటికీ ప్రధానంగా మూడు ఫారాలే మనకు ఉపయోగపడతాయి.

ఐటీఆర్ 1: ఇది చాలా సరళమైనది. రూ.50లక్షల లోపు వేతనం, ఒకే ఇంటిపై ఆదాయం, వడ్డీ, ఇతర మార్గాల్లో ఆదాయం అందుకున్నప్పుడు ఈ ఫారం వర్తిస్తుంది.

ఐటీఆర్ 2: రూ.50 లక్షలకు మించి ఆదాయం, మూలధన లాభాలు, వ్యాపార ఆదాయం, విదేశీ ఆదాయం, ఒకటికి మించి ఇళ్ల ద్వారా ఆదాయం వచ్చినప్పుడు ఈ ఫారాన్ని ఎంచుకోవచ్చు.

ఐటీఆర్ 3: సాధారణంగా హిందూ అవిభాజ్య కుటుంబం (%ఎఖఛీ%), వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం ఆర్జించేవారు దీన్ని ఉపయోగించాలి.

ఐటీఆర్-4: వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, భాగస్వామ్య సంస్థలు, సెక్షన్ 44%ూఆ% లేదా 44%ూఆజు% ప్రకారం అంచనా ఆధారంగా ఆదాయాన్ని పేర్కొనేవారు, వేతనం లేదా పింఛను ద్వారా రూ.50 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నవారు, ఒక ఇంటి నుంచి రూ.50 లక్షలకు మించని ఆదాయం ఉన్నవారు, ఇతర ఆదాయమార్గాల ద్వారా రూ.50 లక్షలు మించకుండా ఆర్జిస్తున్నవారు (లాటరీ, గుర్రపు పందేల్లో గెలుచుకున్న ఆదాయం ఉంటే ఈ ఫారం వర్తించదు) ఈ ఫారం వాడాలి.



ఐటీఆర్-5: ఈ ఫారం కంపెనీలు, ఎల్ఎల్‌పీ, ఏఓపీలు, బీఓఐలు, ఆర్టిఫిషియల్ జురిడికల్ పర్సన్ , ఎస్టేట్ ఆఫ్ డిసీజ్డ్, ఎస్టేట్ ఆఫ ఇన్‌సాల్వెంట్, బిజినెస్ ట్రస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ విభాగాల పరిధిలోకి వచ్చేవారు సమర్పించాలి.

ఐటీఆర్ ఫారం-6: సెక్షన్ 11 (ఛారిటీ, మతపరమైన అవసరాల కోసం ఉన్న ఆస్తి ద్వారా లభించిన ఆదాయం) కింద మినహాయింపు కోరని కంపెనీలు ఈ ఫారంను ఉపయోగించుకోవాలి. దీన్ని కచ్చితంగా ఎలక్ట్రానిక్ రూపంలోనే దాఖలు చేయాలి.

ఐటీఆర్ ఫారం-7: సెక్షన్ 139 (4ఏ), 139 (4బీ), 139 (4సీ), 139 (4డీ), 139 (4ఈ), 139 (4ఎఫ్) ప్రకారం రిటర్నులు దాఖలు చేసే వ్యక్తులు, కంపెనీలకు ఈ ఫారం వర్తిస్తుంది. ట్రస్టులు, రాజకీయ పార్టీలు, సంస్థలు, కళాశాలలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు దీని పరిధిలోకి వస్తాయి.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.05 | ₹ 5.07 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

| | 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹66,400 | ₹72,440 |
| చెన్నై | ₹67,000 | ₹73,010 |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్ ₹ 97,100

## ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓకు సెబీ ఆమోదం..

### రూ.7,250 కోట్ల సమీకరణకు గ్రీన్ సిగ్నల్

దిల్లీ: విద్యుత్తు ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓకు సెబీ ఆమోదం లభించింది. డిసెంబర్‌లో ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూ కోసం ప్రాథమిక పత్రాలు సమర్పించింది.

సెబీ నుంచి ఐపీఓ కోసం అనుమతి పొందిన తొలి ఈవీ స్టార్టప్ ఇదే కావడం గమనార్హం.



ఐపీఓ ద్వారా మొత్తం రూ.7,250 కోట్లు సమీకరించాలని ఓలా ఎలక్ట్రిక్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. కొత్త షేర్ల జారీ ద్వారా రూ.5,500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ కింద 9.52 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఓలా ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ 47.3 మిలియన్ షేర్లను, సంస్థ ప్రారంభంలో పెట్టుబడులు పెట్టిన ఆల్ఫావేవ్, ఆల్పైన్, మ్యాట్రిక్స్ 47.89 మిలియన్ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనున్నారు.

ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మూలధన వ్యయం, రుణ చెల్లింపులు, పరిశోధన- అభివృద్ధి సహా కంపెనీ విస్తరణ, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. ఈవీలు సహా బ్యాటరీ ప్యాక్‌లు, మోటార్లు వంటి కీలక ఈవీ పరికరాలను ఈ కంపెనీ తయారుచేస్తోంది.

## 120W ఫాస్ట్ ఛార్జింగ్‌తో రియల్‌మీ కొత్త ఫోన్..



ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన GT సిరీస్‌లో మరో కొత్త ఫోన్‌ను భారత్ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. రియల్‌మీ జీటీ6 పేరిట దీన్ని తీసుకొచ్చింది. అమోలెడ్ డిస్‌ప్లేతో ఉన్న ఈ ఫోన్‌లో 4ఎన్ఎమ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్3 ప్రాసెసర్‌ను అమర్చారు. ఇతర ఫీచర్లు, ధర వంటి వివరాలు ఎలా ఉన్నాయో చూద్దాం. రియల్‌మీ కొత్త ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం256 జీబీ వేరియంట్ ధర రూ.40,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీం 256 జీబీ వేరియంట్ ధర రూ.42,999గా, 16జీబీం 512జీబీ వేరియంట్ ధర రూ.44,999గా పేర్కొంది. ఫ్లూయిడ్ స్లివర్, రేజర్ గ్రీన్ రంగుల్లో లభిస్తాయి. ప్రీ బుకింగ్ ఆర్డర్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని.. కంపెనీ వెబ్‌సైట్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఫోన్ బుక్ చేసుకోవచ్చని కంపెనీ పేర్కొంది. ముందుగా బుక్ చేసుకున్న యూజర్లకు ఆరు నెలల పాటు స్క్రీన్ డ్యామేజ్ ప్రొటెక్షన్, ఎంపిక చేసిన కార్డుపై రూ.4వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపింది. 10నెలల పాటు నో- కాస్ట్ ఈఎంఐ సదుపాయం అందించనుంది. ఇక స్పెసిఫికేషన్స్ విషయానికొస్తే.. ఇందులో 6.78 అంగుళాల ఫుల్ హెచ్‌డీం 8టీ ఎల్‌టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 120Hz రిఫ్రెష్ రేటు, 6000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 14 ఆధారిత రియల్‌మీ యూఐ 5తో పనిచేస్తుంది. వెనకవైపు 50 ఎంపీ సోనీ LYT808 సెన్సర్, 50 ఎంపీ శాంసంగ్ జేఎన్5 టెలిఫొటో సెన్సర్, 8 ఎంపీ సోనీ IMX355 అల్ట్రా వైడ్ సెన్సర్ ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ కెమెరా అమర్చారు. వెనకవైపు నార్జో 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 890 సెన్సర్‌ను అమర్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. ముందువైపు 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. బ్లూటూత్ 5.4, జీపీఎస్, వై-ఫై6 వంటి కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి. 5,500mAh బ్యాటరీ ఉంది. 120W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. కేవలం 10 నిమిషాల్లో 50శాతం ఛార్జింగ్ పూర్తవుతుందని కంపెనీ తెలిపింది.



## జపాన్‌లో ఓ తోటమాలి విలువైన పాఠం నేర్పాడు

### ఎన్విడియా సీఈవో

జీవితంలో ఏదో ఒక దశలో ఎవరో ఒకరి నుంచి మనం స్ఫూర్తి పొందుతుంటాం. వారు మనకు తెలిసిన వాళ్లే అయిఉండనవసరం లేదు. తెలియకుండానే వారి మాటలు మనలో సానుకూల మార్పు తీసుకొస్తాయి.

కొత్తగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. మనం నిజంగా దేనిపై దృష్టి పెట్టాలో నేర్పుతాయి. ఇలానే తన జీవితంలో ఓ తోటమాలి చెప్పిన మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి అంటున్నారు ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ ఆ గార్డెనర్ చెప్పిన మాటలు ప్రభావం చూపాయన్నారు.

వ్యాపార రంగంలో సవాళ్లను స్వీకరిస్తూ, అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రముఖ ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియాను ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా మార్చారు ఆ కంపెనీ వ్యవస్థాపకుడు. ఇటీవలె కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి విచ్చేసిన ఆయన అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. తన జీవితంలో మార్పు తీసుకొచ్చిన విషయాన్ని వారితో పంచుకున్నారు. ' కుటుంబంతో కలిసి జపాన్‌లోని క్యోటోలోని సిల్వర్ టెంపుల్‌ను చూడటానికి వెళ్లాం. అక్కడ వేడి తీవ్రంగా ఉంది. అలానే చుట్టూ ప్రదేశాలు చూస్తున్నాం. ఆ సమయంలో తోటమాలిని చూశా. ఇంతటి ఎండలోనూ ఆయన పెద్ద తోటను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. అది చూసి ఆశ్చర్యపోయా"

"వెంటనే ఆయన వద్దకు వెళ్లి 'ఇంతటి ఎండలో మీరు ఏం చేస్తున్నారు. ఈ తోట చాలా పెద్దగా ఉందే' అని అడిగాను. 'పిచ్చి మొక్కలు తీసేస్తున్నాను. నేనే 25 సంవత్సరాలుగా తోటను చూసుకుంటున్నాను అని సమాధానమిచ్చాడు. 'ఇంతటి తోటను చూసుకోవడానికి మీకు సమయం సరిపోతుందా' అని అడిగాను. ప్రాధాన్యత ఉన్న పనికే ఎక్కువ సమయం కేటాయిస్తా అని సమాధానమిచ్చాడు. ఆ మాటలు విని ఆలోచనలో పడ్డా" అని చెప్పుకొచ్చారు. తోటమాలి చెప్పిన మాటలు జీవితంలో విలువైన పాఠాలుగా మారాయని తెలిపారు. తన పని చేయడానికి ఎంత నిబద్ధతతో ఉన్నాడో అప్పుడే తెలిసింది. పనులను ప్రాధాన్య క్రమంలో చేసుకోవడం వల్ల ఎంత సమయం ఆదా అవుతుందో అప్పుడే అర్థమైందన్నారు. ఆ తర్వాత నుంచి ప్రతి ఉదయం ఎక్కువ ప్రాధాన్యత ఉన్న పనిని ముందుగా చేయడం మొదలు పెట్టినట్లు తెలిపారు. ముఖ్యమైన పని పూర్తి చేసిన తర్వాతే ఇతర పనులు చేయడానికి మిగిలిన సమయాన్ని కేటాయిస్తానన్నారు.

# ఏసీ ధరలకు ఎండల మంట

### ఉత్తరాదికి తరలుతున్న నిల్వలువిదేశాల నుంచి విమానాల్లో విడిభాగాల దిగుమతి

### రాగి, స్టీల్ ధరలు పెరగడం వల్ల కూడా

ఉత్తర భారతాన్ని ఠారెత్తిస్తున్న ఎండల వల్ల, ఎయిర్ కండీషనర్ల (ఏసీ)కు గిరాకీ విపరీతంగా పెరిగింది. ఫలితంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా ఏసీల నిల్వలను ఉత్తరాదికి కంపెనీలు తరలిస్తున్నాయి. డిమాండ్‌కు తగ్గట్లు ఏసీలు సత్వరం తయారు చేసేందుకు అవసరమైన విడిభాగాలను విదేశాల నుంచి విమానాల్లో దిగుమతి చేసుకుంటున్నందున, రవాణా ఛార్జీలు అధికమవుతున్నాయి. ఏసీల తయారీలో కీలకమైన రాగి, అల్యూమినియం, స్టీల్ ధరలు కూడా ఈ ఏడాది ప్రారంభంతో పోలిస్తే బాగా పెరిగినందున, మొత్తంమీద ఏసీల ధరలు 4-8% అధికమయ్యాయని కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. సాధారణంగా ఏటా జనవరి నుంచి మే నెల వరకు ఏసీలకు గిరాకీ అధికంగా ఉంటుంది. ఏసీలకు డిమాండ్‌ను అంచనా వేసుకుని, కంపెనీలు ఏటా అక్టోబరు-డిసెంబరు నెలల్లోనే విడిభాగాలు, ముడిపదార్థాలు సిద్ధం చేసుకుంటాయి. అవసరమైన వాటిని నౌకల ద్వారా దిగుమతి చేసుకుంటాయి కనుక రవాణా ఛార్జీలు అదుపులో ఉంటాయి. సాధారణంగా మే తరవాత ఏసీల అమ్మకాలు నెమ్మదిస్తాయి. ఈసారి జూన్ మూడోవారం వచ్చినా ఎండల తీవ్రత తగ్గకపోవడంతో, ఏసీలకు అధిక గిరాకీ నెలకొంది. రుతుపవనాల రాకతో జూన్ మొదటివారంలో దక్షిణాదిలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడినా, మళ్లీ ఎండలు మండుతున్నాయి. ఫలితంగా ఇక్కడా ఏసీల అమ్మకాలు సాధారణం కంటే అధికంగానే జరుగుతున్నాయని విక్రేతలు చెబుతున్నారు. కొన్ని విడిభాగాలకు దిగుమతులే ఆధారం: ఏసీలను రూపొందించడం మనదేశంలో జరుగుతున్నా, కీలకమైన కంప్రెషర్, మైక్రోప్రాసెసర్, క్రాస్ ఫ్లో ఫ్యాన్ల వంటి కొన్ని విడిభాగాలను మన కంపెనీలు చైనా, తైవాన్, థాయిలాండ్, మలేసియా, జపాన్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. అకస్మాత్తుగా పెరిగిన గిరాకీని కంపెనీలు ఊహించలేకపోవడం వల్ల, వీటి నిల్వలు అడుగంటాయి. మళ్లీ కొత్తగా దిగుమతి చేసుకుంటున్నాయి. ఫలితంగా ధరలు ఎక్కువయ్యాయి. గిరాకీకి



అనుగుణంగా సత్వరం విమానాల్లో తెప్పిస్తున్నందున, రవాణా ఖర్చులు బాగా పెరిగాయి. ఏసీలు డెలివరీ చేసినా, వాటిని ఇళ్లు/కార్యాలయాల్లో బిగించాల్సిన కంపెనీల సర్వీస్ సిబ్బంది తక్కువగా ఉండటంతో, వారు 3-4 రోజులకు కూడా రావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎండల తీవ్రత మరీ అధికంగా ఉన్నందున, ఏసీల నిల్వలను కొన్ని కంపెనీలు అటు తరలిస్తున్నాయి. విక్రయాలు 70% పెరిగాయి.. బి.త్యాగరాజన్, ఎండీ, బ్లూస్టార్: గతేడాది కంటే ప్రస్తుత వేసవి సీజన్‌లో ఏసీల విక్రయాలు 25-30% పెరుగుతాయని పరిశ్రమ అంచనా వేసింది. అయితే ఈసారి 70% వృద్ధి లభించడంతో, మార్కెట్లో ఏసీల నిల్వలు అడుగంటాయి. ఏసీల తయారీలో కీలకమైన రాగి ధర గత డిసెంబరులో టన్ను 8300 డాలర్లు ఉంటే, ఇప్పుడు 10,100 డాలర్లు అయ్యింది. స్టీల్ ధర టన్ను 585 డాలర్ల నుంచి 800 డాలర్లపైకి, అల్యూమినియం ధర టన్ను 2100 డాలర్ల నుంచి 2500 డాలర్లకు చేరింది. దీనికి తోడు విదేశాల నుంచి అత్యవసరంగా విడిభాగాలు తెప్పిస్తుండటంతో, వాటి ధర, రవాణా ఖర్చులూ అధికమయ్యాయి. అందువల్లే ఏసీల ధరలు పెరిగాయి. ప్రస్తుతం ఇంత అమ్మకాలు జరుగుతున్నందున, వచ్చే పండగల సీజన్‌లో ఏసీలకు గిరాకీ నెమ్మదించే వీలుంది.

## చేయి తెగినా వదిలేసి.. : ఇటలీ ప్రమాదంలో భారతీయుడి దుర్మరణం

రోమ్: పొట్టకూటి కోసం ఇటలీ వెళ్లి పని చేసుకుంటున్న ఓ భారతీయుడు అత్యంత దయనీయ స్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుమించిన క్రూరత్వం ఉండదంటూ అక్కడి నేతలు మండిపడుతున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?



భారత్‌కు చెందిన సత్నామ్ సింగ్(31) ఎలాంటి అధికారిక ధ్రువపత్రాలు లేకుండా ఇటలీలోని లాటినాలో నివసించేవారు. ఆ ప్రాంతంలో భారత్ నుంచి వలసవచ్చిన ఎంతోమంది కార్మికులు జీవిస్తుంటారు. అక్కడికి దగ్గర్లోని వ్యవసాయ క్షేత్రంలో సింగ్ పని చేసేవాడు. సోమవారం ఎండుగడ్డిని కత్తిరిస్తున్న సమయంలో అతడి చేయి తెగింది. వెంటనే అక్కడి సిబ్బంది అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిపోయి.. ఒక చెత్తబస్తాను పడేసినట్టుగా ఇంటిదగ్గర వదిలేశారని స్థానిక ట్రేడ్ యూనియన్ ఆరోపించింది. తర్వాత బాధితుడి భార్య, స్నేహితులు పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించడంతో.. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాల కారణంగా అతడు బుధవారం ప్రాణాలు కోల్పోయాడని లాటినా ప్రాంత పోలీసులు వెల్లడించారు.

ఈ ఘటనపై ఇటలీ కార్మికశాఖ మంత్రి స్పందించారు. ఇది అత్యంత క్రూరమైన చర్య అంటూ ఖండించారు. దీనిపై విచారణ జరుగుతోందని, బాధ్యులకు శిక్ష పడుతుందని హామీ ఇచ్చారు. శ్రమ దోపిడీకి మారుపేరైన ఈ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను నాగరికతకు ఓటమిగా అక్కడి విపక్ష నేతలు అభివర్ణించారు. ఇదిలాఉంటే.. ఈ ఘటనపై ఇటలీలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ఆ కుటుంబానికి సహకరించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది.

# జనంసాక్షి జాతీయం అంతర్జాతీయం

## దేశం మొత్తం చిమ్మచీకట్లో.. కొన్ని గంటలు నరకం అనుభవించిన ఈక్వెడార్..!

నగరం మొత్తం ఒకేసారి కరెంటు పోతేనే మనం విలవిల్లాడుతాం. అలాంటిది దేశం మొత్తం కొన్ని గంటలపాటు విద్యుత్తు లేకపోతే పరిస్థితి ఏమిటీ..?

ఆస్పత్రులు, ఇళ్లు, సబ్‌వేలు, రైల్వేలైన్లు ఇలా ప్రతీఒక్క వ్యవస్థ అస్తవ్యస్తమైపోతుంది.

ఇలాంటి పరిస్థితే దక్షిణ అమెరికా దేశమైన ఈక్వెడాం లో తలెత్తింది. ఇక్కడ బుధవారం దేశం మొత్తం ఒకేసారి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. జనజీవనం ఒక్కసారిగా స్తంభించింది. ట్రాఫిక్ సిగ్నళ్ల నుంచి రైల్వే లైన్ల వరకు అన్నిరకాల వ్యవస్థలు నిలిచిపోయాయి. విద్యుత్తు నిర్వహణ, ట్రాన్స్‌మిషన్‌లో సమస్య కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్లు అధికారులు చెప్పారు. చిన్నపిల్లల ఆస్పత్రులు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాయి.

"కొత్త పంపిణీ వ్యవస్థ ఏర్పాటుకు, నిర్వహణకు సరైన నిధుల కేటాయింపు లేకపోవడంతోనే నేడు విద్యుత్తు వ్యవస్థ కుప్పకూలింది" అని పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మంత్రి రాబర్టో లూక్యూ పేర్కొన్నారు. కొన్ని గంటలపాటు అంధకారం తర్వాత బుధవారం అర్ధరాత్రికి తిరిగి దేశంలో 95శాతం ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. 2004 తర్వాత ఈ దేశంలో విద్యుత్తు వ్యవస్థ కుప్పకూలడం ఇదే తొలిసారి.

ఈక్వెడార్ గత కొన్నేళ్లుగా విద్యుత్తు సమస్యతో తీవ్ర అవస్థలు పడుతోంది. ఇటీవల ఏప్రిల్‌లో దేశాధ్యక్షుడు ఎనర్జీ ఎమర్జెన్సీని ప్రకటించారు. దీంతోపాటు రోజువారీ ఎనిమిది గంటలపాటు కరెంటు కోతలు కూడా అమలుచేస్తున్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
21.06.2024



## శంకర్‌యాదవ్‌కు నివాళులర్పించిన మంత్రి శ్రీధర్‌బాబు

**మంథని/గోదావరిఖని(జనంసాక్షి) :** మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు తలసాని శంకర్‌యాదవ్ దశది నకర్మకు మంత్రి శ్రీధర్‌బాబు, హాజరై చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ఒడితల ప్రణవ్ పరామర్శ



**వీణవంక (జనంసాక్షి)** మండలంలోని ఘన్ముకుల గ్రామంలో ఇటీవల మృతి చెందిన పెండ్యాల మల్లా రెడ్డి. గాజుల అంకుస్. ఇటీవల అనారోగ్యానికి గురి అయిన ఇదే గ్రామానికి చెందిన ఎండీ నసీరొద్దీన్ కూతురు హర్షిన్ ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం హర్షిన్ ఆరోగ్య పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారి కుటుంబ సభ్యులకు వివరించారు వారి వెంట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్. నాయకులు నల్ల కొండల్ రెడ్డి. కాంగ్రెస్ నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ఎండి సజ్జద్.చదువు జైపాల్ రెడ్డి.కట్కూరి ఉపేందర్ రెడ్డి.మల్లారెడ్డి.సమ్మిరెడ్డి.నల్ల కొండల్ రెడ్డి.ఎండి రషీద్.ఎండి సలీం. మద్దుల ప్రశాంత్.మోహన్ రెడ్డి.సంపత్ రెడ్డి.తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు

## డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలి

**గోదావరిఖని, జూన్ 20, (జనంసాక్షి) :** వ్యాపార సంస్థల యజమానులు డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ రుసుం వెంటనే చెల్లించి సహకరించాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించే గడువు గత మార్చి నెలతో ముగిసిపోయిన నేపథ్యంలో ప్రస్తుతం 25 శాతం పెనాల్టీతో వసూలు చేయడం జరుగుతుందని అన్నారు.ఈ పెనాల్టీ జూలై 1 నుండి 50 శాతానికి పెరుగుతుందని అన్నారు.త్వరపడి స్థానిక వ్యాపార సంస్థల యజమానులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వెంటనే చెల్లించి ఆర్థిక భారం తగ్గించుకోవాలని సూచించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సంజయ్



**మల్లాపూర్ జూన్ 20(జనంసాక్షి)** మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆవిష్కరించారు.తెలంగాణ కోసం మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అన్నారు తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిది కొని యాడారు. అనంతరం మల్లాపూర్ మండల పద్మశాలి అధ్యక్షులు అయ్యోరి దశరథం మాట్లాడుతూ నేను పద్మశాలి అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించడం నాకు ఎతో అదృష్టంగా భావిస్తానన్నారు అనంతరం విగ్రహ దాత పద్మశాలి జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ ,ఎమ్మెల్యే సంజయ్ నీ పద్మశాలి గౌరవ అధ్యక్షులు సిరిపురం రవీందర్ చేనేత వస్త్రాలతో సన్మానించారు. జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ సరోజన ఆదిరెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, మరిపెల్లి మల్లయ్య సత్తెమ్మ, పద్మశాలి జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, సాంబార్ ప్రభాకర్, రాపెల్లి సురేష్, మల్లాపూర్ మండల పద్మశాలి అధ్యక్షులు అయోరి దశరథం, ఇబ్రహీం పట్నం మండల అధ్యక్షులు గణేష్, విష్ణు, మల్లాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు రవీందర్, రుద్ర లక్ష్మీరాజం, సాంబార్ శంకర్, గడ్డం మధు, మండల పద్మశాలి ప్రచార కార్యదర్శి మోర సతీష్, గొల్లవత్తిని విజయ్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు పోతు గోపి, మల్లాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు సిరిపురం వినోద్ కుమార్, మండల పద్మశాలి సంఘ సభ్యులు, యువజన సంఘం సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలనే లక్ష్యం

- విద్యార్థులకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలి
- పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనం సాక్షి)** :నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి. నులిపురుగులను పూర్తిగా నిర్మూలించేందుకు 1 నుంచి 19 వయస్సున్న చిన్నారులు, విద్యార్థులందరికీ వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం సప్తగిరి కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగర మేయర్‌సునీల్ రావు తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజు శుభ్రత పాటించాలని, చేతులు, కాళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులను పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. అపరిశుభ్రంగా ఉండడం వల్లే అనారోగ్య సమస్యలు తరుచూ వస్తుంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలని సూచించారు. గురువారం మాత్రలు వేసుకోని వారు 27వ తేదీన వేసుకోవాలని పేర్కొన్నారు. నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని వ్యాసం రాయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. తద్వారా చక్కగా చదువుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ కోసం విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మేయర్ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.స్థానిక కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, డీఈవో జనార్దన్ రావు, డీఐఓ సాజిదా అతహరి, సల్ల రవీందర్, కార్పొరేటర్లు బండారి వేణు, కచ్చు రవి, సెక్టోరల్ అధికారి అశోక్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ నాజియా ఫాతిమా, ఎంఈఓ మధుసూదనా చారి, ఆర్బీఎస్ కే డాక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి

**మంథని(జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ సురేష్ రెడ్డి మందులు పంపిణీ చేశారు. పిల్లలు అందరు ఆల్బెం డజోల్ టాబ్లెట్ వేసుకోవాలని దీనివల్ల కడుపులోని నులిపురుగులు తగ్గిపోతాయని వీటిని నిర్మూలించడం వల్ల రక్తహీన తను నియంత్రణలోకి వస్తుందని పోషకాహార అవసరాన్ని మెరుగుపరుస్తుందని వ్యాధి నిరోధకత మెరుగవుతుందని అన్నారు. ఎంపీపీ కొండ శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాణయ్య, కౌన్సిలర్స్ రవి, రమేష్, హెచ్.ఎం సుమలత, మెడికల్ ఆఫీసర్ సృజన్, సంపూర్ణ దేవి, హెచ్ ఈ ఓ ఉమాదేవి,ఆశా వర్కర్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## నులిపురుగుల మాత్రలు పంపిణీ చేసిన 'ఆది'

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



**వేములవాడ(జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వేములవాడలోని మహాత్మా జ్యోతిబా పూలే, తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర,బాలికల,తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులబాలుర, బాలికల, కస్తూర్బా గాంధీ బాలికలవిద్యాలయంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు.తన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి హామీ లిచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన పిల్లలందరూ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలన్నారుశరీరకంగా బలంగా ఉన్నప్పుడే మనం చదువులో ముందుంటారన్నారు.నులిపురుగుల ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండక పోవడం,వ్యాధి నిరోధక శక్తి తగ్గతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారుప్రయివేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తున్నామన్నారు.పదవ తరగతి విద్యార్థులు 10/10 సాధించి వేములవాడ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండే విధంగా ఉండాలన్నారు.. విద్యార్థిని,విద్యార్థులకు తన వంతు ప్రోత్సాహకం సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారుజిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్,ఆర్డీఓ రాజేశ్వర్ , మున్సిపల్ కమిషనర్ అవినాష్,పట్టణ సిఐ వీర ప్రసాద్,మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ లు,కౌన్సిలర్లు,వైద్య సిబ్బంది,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌తో జీఎం శ్రీనివాస్ భేటీ



**గోదావరిఖని, జూన్ 20, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్షను పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌జీ-1 ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ భేటీ అయ్యారు.ముందుగా పుష్ప గుచ్చేం ఇచ్చారు.ఈ సందర్భంగా అర్‌జీ-1 ఏరియాకు సంబంధించి భూసేకరణ అనుమతులు, అర్ అండ్ అర్ ప్యాకేజీ గురించి కలెక్టర్‌తో చర్చించారు.ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, సాంబశివరావు, అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

## యోగా శిక్షకులతో కిరణ్‌బాబు సమావేశం..

**గోదావరిఖని, జూన్ 20, (జనంసాక్షి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం ఏరియా-1 జీఎం కార్యాలయ సమావేశ హాలులో పర్సనల్ మేనేజర్,సేవా కో-అర్డినేటింగ్ ఆఫీసర్ కిరణ్‌బాబు పలువురు యోగా శిక్షకులతో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు యోగా శిక్షకులతో మాట్లాడారు. ఆంజీ-1లోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్స్‌లలో ఉదయం సామూహిక యోగాసానాలు నిర్వహించాలని, ఆలాగే అందరి చేత యోగ ప్రతిజ్ఞ చేయించి ఉదయం మొదటి షిఫ్ట్ సమయంలో ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కల్పించాలన్నారు.అందుకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు నిత్య జీవితంలో ఒక్క గంట సమయం కేటాయిస్తూ తమ ఆరోగ్యాన్నీ కాపాడుకోవాలని తెలిపారు.యోగా శిక్షకులు రఘుసింగ్ బాపుజీ, బాలయ్య, లక్ష్మినారాయణ, లత, సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.



## 'సాప్'లో అన్ని వివరాలు పొందుపరిచారు



**గోదావరిఖని, జూన్ 20, (జనంసాక్షి) :** సింగరేణి ఆర్‌జీ-1 జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో క్వార్టర్‌లకు సంబంధించి..ప్రస్తుతం ఉన్న అన్ని కార్యకలాపాలు సాప్ ద్వారా మాత్రమే అన్ని వివరాలు పొందుపరిచారు.ఇందుకు సంబంధించి కార్పొరేట్ నుండి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షా గురువారం నిర్వహించారు.క్వార్టర్ వెకేషన్, క్వార్టర్ అలాట్‌మెంట్, క్వార్టర్‌కు సంబంధించిన అన్ని వివరాలను సాప్‌లో నమోదు చేయటం వలన వివరాలను సులువుగా ,కచ్చితంగా బద్రపరచవచ్చు,అదే కాకుండా కంపెనీ క్వార్టర్‌లను ఎవరు కూడా అక్రమంగా ఆక్రమణ చేయకుండా నిలిపివేయవచ్చు అని వెల్ఫేర్ ఏజీఎం శ్రీనివాస్ కార్పోరేట్ ఏరియా పదికారులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఎస్.ఈ (సివిల్) వరప్రసాద్,ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం, ఏరియా అధికారి వర్క్‌షాప్ జితేందర్ సింగ్, సీనియర్ పిఒ హనుమంతరావు పాల్గొన్నారు.

# కుట్రదారులకు దేవుడు బుద్ధిచెప్పాడు

- ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎంపీనీ ఒడిస్తామన్న బీఆర్ఎస్ నేతల హామీ ఏమైంది?
- కలిసి కట్టుగా శ్రమిస్తే 2028లో కరీంనగర్ ఎమ్మెల్యే సీటు మనదే
- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బల్దియాపై ఎంఐఎం జెండా ఎగురవేస్తాం
- ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

**కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి)** తనను ఎంఐఎం అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని కుయుక్తులు పన్ని, ఎంఐఎం పార్టీలో చీలికలు తెచ్చి విచ్ఛిన్నం చేయాలనే పన్నాగంతో, నాతో తమపార్టీ కార్పొరేటర్లు లేరని, ఎంఐఎంలో గులాం అహ్మద్ ఒంటరి వాడ య్యాడని అసత్య ప్రచారాలకు తెరలేపారని కుట్రలు చేసిన వారు పదవులు కోల్పోయారని, వారిని దేవుడే దండించాడని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో గులాం అహ్మద్, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనని గెలిపిస్తే, పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ శక్తులకు కరీంనగర్లో చోటు లేకుండా చేస్తానని, కొందరు బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీ ఏమైందని, వాళ్లు కరీంనగర్ ప్రజలకు ఇచ్చిన మాట ఎందుకు నిలబెట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. రాబోయే



మున్సిపల్ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో పొత్తు ఉండదని ఖచ్చితంగా ఈసారి ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని, నగరపాలక సంస్థపై ఎంఐఎం జెండాను ఎగురవేస్తామన్నారు.కలిసికట్టుగా శ్రమిస్తే 2028లో కరీంనగర్ ఎమ్మెల్యే స్థానం సైతం మనదేనన్నారు.మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిఫ్ ఆతిన, ఖమరొద్దీన్, ఖాజా, ఇబ్రహీం, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు అలీ బాబా, అజర్, మాజిద్ హుస్సేన్, వాజిద్ అలీ, సాజిద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



## లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

**ఢిల్లీ(జనంసాక్షి):**లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఒడిశాకు చెందిన సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్ వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.ఒడిశాలోని కటక్ నుంచి ఏడుసార్లు విజయం సాధించిన భర్తృహరి.. స్పీకర్ ఎన్నిక పూర్తయ్యే వరకు లోక్‌సభ ప్రిసైడింగ్ అధికారిగా కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారని.. ఆయనకు కె.సురేష్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే)తో పాటు రాధామోహన్ సింగ్ (భాజపా), ఫగ్గన్ సింగ్ కులస్తే (భాజపా), సుదీప్ బంధోపాధ్యాయ (టీఎంసీ) ఛైర్‌పర్సన్‌ల ప్యానెల్ సహాయంగా ఉంటుందని మంత్రి తెలిపారు.భర్తృహరి మహతాబ్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందే బిజు జనతాదళ్‌ని వీడి భాజపాలో చేరిన విషయం తెలిసిందే. కటక్ నుంచి భాజపా అభ్యర్థిగా పోటీచేసి ఏడోసారి విజయ దుందుభి మోగించారు. మరోవైపు, 18వ లోక్‌సభ సమావేశాలు జూన్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 24, 25 తేదీల్లో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం జరగనుంది. జూన్ 26న స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు.

# త్వరలో మంథనికి ఐటీ కళ

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యం : ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**మంథని, (జనంసాక్షి) :** అతి త్వరలో మంథనిలో ఐటి సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక చిన్న ఐటీ సంస్థ తో మాట్లాడడం జరిగిందని వారు అతి త్వరలో మంథనిలో ఐటి సంస్థను ఏర్పాటు కాబోతుందని తెలిపారు. మొదటగా 50 మంది యువతకు నెల రోజుల లోపు ఉపాధి కల్గుతుందని అన్నారు. మార్కెట్ లో వచ్చే కొత్త కోర్సులు, ట్రెండ్స్ నైపుణ్యాలు విద్యార్థులకు అందించడం కోసం ఐటిఐ లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. 65 అడ్వాన్స్ లెర్నింగ్ కేంద్రాలను దాదాపు 2234 కోట్ల రూపాయలు, టాటా కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కాటారం ఐటిఐ ఆధునీకరణ కోసం 6 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులంతా భవిష్యత్తులో నేను సెల్యూట్ చేసే స్థాయికి చేరుకోవాలని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి గా స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా కోకో కోలా అనే బహుళ జాతి కంపెనీ తీసుకోని వస్తున్నామని అన్నారు. చిన్న సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు తీసుకోని వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ కాలనీలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని, అదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు మన యువకులకు వచ్చేలా అవసరమైన నైపుణ్యం అందజేస్తామని మంత్రి తెలిపారు.

## పుణ్యక్షేత్రానికి మాయ మచ్చగా ఎస్ఐ వ్యవహారం



- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

**మంథని(జనంసాక్షి) :** నాటి నుంచి నేటి వరకు పోలీస్ వ్యవస్థలను ఎమ్మెల్యే కుటుంబం భ్రష్టుపట్టిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ విమర్శించారు. మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంథని నియోజకవర్గంలోని మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టింగ్‌కు ముడుపులు తీసుకుని ప్రస్తుత ఎస్ఐకి పోస్టింగ్ ఇప్పించారని ఆరోపించారు. రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిదిలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఓ మహిళాకానిస్టేబుల్‌పై అఘాయిత్యానికి పాల్పడటం ప్రతి ఒక్కరు ఖండించాలని, ఈ వ్యవహారం కాళేశ్వర క్షేత్రానికే మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. గతంలో ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐ వ్యవహారంపై తమ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే సదరు ఎస్ఐకి కాళేశ్వరంలో పోస్టింగ్ ఇప్పించారన్నారు. నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్‌లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారుతున్నాయని, ఇటీవల మహాదేవ పూర్ పోలీస్‌స్టేషన్‌లోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ జెడ్పీటీసీ భర్త డాన్స్‌లు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు.

**లైంగిక దాడిని రాజకీయం చేయడం సిగ్గుచేటు**

**మంథని(జనంసాక్షి):** ఎస్సై భవాని సేన్ లైంగిక దాడిని పుట్ట మధు రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటని మంథని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ మాట్లాడుతూ ఆరోపణలు దమ్మంటే నిరూపించాలని లేదంటే రాజకీయ సన్యాసం తీసుకోవాలని సవాలు విసిరారు. ఆరోపణలు వచ్చిన 24 గంటల్లోనే రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు స్పందించి ఎస్సైని విధుల నుండి శాశ్వతంగా తొలగించి విచారణ చేపట్టారని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఓడ్నాల శ్రీనివాస్, నూకల బాలయ్య, మంథని సత్యం, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు ,కొత్త శ్రీనివాస్ ,అజీమ్ ఖాన్ ,గోటికార్ కిషన్ జి ,మధ్యల రాజయ్య, ఆర్ల నాగరాజ్ ,ఆరెల్లి కిరణ్ గౌడ్ కాస్పేట బాపు , రోడ్డ రాజేశ్వర్. గొల్లపల్లి శ్రీనివాస్ ,ఎరుకల సురేష్ ,ఆర్ల నారాయణ పాల్గోన్నారు.






## పేదలకు నాణ్యమైన వైద్యసేవలందించాలి

వ్యాధి నివారణలో రోగనిర్ధారణ చాల ముఖ్యం • అపోలో డయాగ్నోస్టిక్స్‌ను ప్రారంబించిన షబ్బీర్ అలీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ శ్రీరాంనగర్ కాలనీ లో అపోలో డైయాగ్నోస్టిక్స్ ను ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఏ రోగానికైనా సరియైన చికిత్స జరగాలంటే అందులో రోగనిర్ధారణ పరీక్ష ముఖ్యం అన్నారు.వైద్య పరీక్షలు అత్యాధునికమైన టెక్నాలజీతో కూడిన పరికరాలు ఉపయోగించి సరియైన నిర్ధారణ జరుగుతేనే సరియైన వైద్యం అందుతుందన్నారు. కామారెడ్డి పట్టణంలో అపోలో సంస్థ వారు డైయాగ్నోస్టిక్ సెంటర్ పెట్టడం నాణ్యమైన వైద్య పరీక్షలు అతి తక్కువ ధరలకు అందించడం సంతోషకరం అన్నారు.అపోలో సంస్థ ద్వారా నిరుపేదలకు ప్రత్యేక డిస్కౌంట్ చేసి సేవలు అందించాలని సంస్థను కోరారు.

# త్వరలో బీజేపీలోకి మేయర్ సునీల్‌రావు

- అందుకే కేంద్రమంత్రి బండి నామసర్మణ
- పదవీ గండం తప్పడానికే మంత్రిపై పొన్నంపై లేనిపోని విమర్శలు
- కరీంనగర్ మేయర్‌పై ధ్వజమెత్తిన జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి):** జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ పై కరీంనగర్ నగర మేయర్ సునీల్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం రోజు నగరంలోని ప్రెస్ భవన్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... నగర మేయర్ అభద్రత భావంతో పదవి గండం తప్పించుకోవడం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ పై ఉద్దేశపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గతంలో బండి సంజయ్ వల్ల నగరానికి ఒక్క పైసా లాభం లేదని కేవలం కేసీఆర్ టిఆర్ఎస్ పార్టీ వల్లనే నగరంలో అభివృద్ధి జరుగుతుందని చెప్పిన మేయర్ సునీల్ రావు అవినీతి ఆరోపణల నుండి తప్పించుకోవడానికి బిజెపి తీర్థం పుచ్చుకునే ఆలోచనతోనే బిజెపి పార్టీని కేంద్రమంత్రి బండి సంజయ్ ని పొగుడుతున్నారని తెలిపారు. మేయర్ సునీల్ రావు అవినీతి చిట్టా సిద్ధమైంది అతి త్వరలోనే నగర ప్రజలందరికీ కరపత్రాల రూపంలో ఇంటింటికి చేరవేయడానికి అవినీతి పత్రాలు సిద్ధం చేస్తున్నామన్నారు. తీగల వంతెన, స్మార్ట్ సిటీ పనుల్లో కాకుండా భూకబ్జాలో కూడా నగర మేయర్ సునీల్ రావు హస్తం తప్పకుండా ఉందని సొంత బి.ఆర్.ఎస్ పార్టీ కార్పొరేటర్లు చేసిన ఆరోపణలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎంపీ ఎలక్షన్స్‌లో సొంత పార్టీ అభ్యర్థి వినోద్ కుమార్‌ను కాదని బండి సంజయ్‌కి సపోర్ట్ చేశారని సాక్షాత్తు కార్పొరేటర్లు గుసగుసలాడుతున్నారని రాష్ట్ర మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఎక్కడి సమిక్ష సమావేశంలోనైనా పాల్గొనే హక్కు రాజ్యాంగం కల్పించిందని సునీల్ రావు మాటలు రాజ్యాంగాన్ని పరిహాసం చేసే విధంగా ఉన్నాయన్నారు. అసలు సునీల్ రావుకు నగరానికి సంబంధమే లేదు తను బ్రతకడానికి వచ్చి , పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్నప్పుడు పార్టీ పదవుల కోసం ఆయన ఇంటి చుట్టూ నువ్వు ప్రదర్శనలు చేసిన మాట వాస్తవం కాదా..? ఆయన దయతోనే కాంగ్రెస్ పార్టీలో పిసిసి కార్యదర్శి, కార్పొరేటర్ వరకు ఎదిగింది నిజం కాదా..? అన్నారు. మేయర్ సునీల్ రావుకు ముందు ముందు చూపించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం.. బిడ్డ సునీల్ రావు ఖబర్దార్ ఊసర వెల్లి కన్నా వేగంగా పార్టీలు మార్చే ఘనుడివి నువ్వు అని నువ్వు మేయర్ అయిన తర్వాత చేసినటువంటి అభివృద్ధి పై చర్చించడానికి మేమంతా సిద్ధం.. కరీంనగర్ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడే వ్యక్తి పొన్నం ప్రభాకర్, గతంలో ఎంపీగా ఉన్నప్పుడు అనేక నిధులు తీసుకొస్తే ఆ అభివృద్ధి తప్ప ఇప్పటివరకు చేసిన అభివృద్ధి ఏమీ లేదు, పొన్నం ప్రభాకర్ ని విమర్శించే స్థాయి నీకు లేదు అతి త్వరలోనే నీ పదవి ఊడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు బాణోతు శ్రావణ్ నాయక్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పురం రాజేశం, నగర కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు సాయిరి దేవన్న, ప్రధాన కార్యదర్శి వరహాల చారి పాల్గొన్నారు.

# లండన్ 'టవర్ బ్రిడ్జి'పై టెన్నిస్ దిగ్గజం

ప్రపంచ టెన్నిస్‌ను రెండు దశాబ్దాల పాటు ఏలిన రోజర్ ఫెదరర్ ఆటే కాదు జీవితమూ స్ఫూర్తిదాయకమే. తన సొగసైన ఆటతో దిగ్గజంగా పేరొందిన ఫెదరర్ మళ్లీ అభిమా నుల ముందుకు వచ్చాడు. ఈసారి అతడు కోర్టులో రాకెట్ పట్టుకొని రాలేదు. తన కెరీర్‌లోని చివరి 12 రోజులు ఎలా గడిచాయో చెప్పడానికి వచ్చేశాడు.

అవును.. రెండేండ్ల క్రితం ఆటకు వీడ్కోలు పలికిన ఫెదరర్‌పై అమెజాన్ ప్రైమ్ రూపొందించిన 'ఫెదరర్ ట్వల్ ఫైనల్ డేస్'డాక్యుమెంటరీ విడుదలైంది. ఈ సందర్భంగా లండన్ టవర్ బ్రిడ్జిపై ఈ లెజెండరీ ఆటగాడి డాక్యుమెంటరీని ఆవిష్కరించారు. ఫెదరర్ జీవితంలోని అద్భుత క్షణాలను డిస్‌ప్లేపై ప్రదర్శించారు. విద్యుత్ కాంతుల వెలుగులో ఫెదరర్ విజయ ప్రస్థానాన్ని చూసిన అభిమానులు సంతోషం పట్టలేకపోయారు. తన డాక్యుమెంటరీ ప్రమోషన్‌లో భాగంగా ఫెదరర్ ఈమధ్య పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఒక ఆటగాడి తన కెరీర్‌కు వీడ్కోలు పలకడం అనేది ఓరకంగా అంతిమ యాత్ర లాంటిది. అదొక గొప్ప ఫీలింగ్. మీరు పూర్తిగా స్పృహతోనే ఉంటారు. కానీ, అప్పుడు జరుగుతన్న వన్నీ స్లో మోషన్‌లో మసకగా మసకగా అనిపిస్తాయి' అని ఫెదరర్ అన్నాడు.



**గ్రాస్ కోర్టు కింగ్**

స్విట్జర్లాండ్‌కు చెందిన ఫెదరర్ టెన్నిస్‌పై చెరగని ముద్ర వేశాడు. 'గ్రాస్ కోర్టు కింగ్'గా ఓ వెలుగు వెలిగాడు. అయితే.. రఫెల్ నాదల్, నొవాక్ జకోవిచ్, ఆండీ ముర్రేలు ఎంట్రీ ఇవ్వడంతో ఫెదరర్ ఏకఛత్రాధిపత్యానికి చెక్ పడింది. చివరకు 2022లో లావెర్ కప్ అనంతరం కన్నీటిపర్యంతమవుతూ తనకెంతో ఇష్టమైన ఆటకు ఫెదరర్ రిటైర్మెంట్ ప్రకటించాడు. అక్కడితో టెన్నిస్‌లో ఓ శకం ముగిసిపోయింది. కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు కొల్లగొట్టిన ఫెదరర్ అత్యధిక ట్రోఫీ వీరుల జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్(24), రఫెల్ నాదల్(22)లు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నారు.



# ఉప్పల్‌లో ఒక్కటే టీ20

## టీమిండియా 2024-25 షెడ్యూల్ విడుదల

టీమిండియా హోమ్ సీజన్ 2024-25కు సంబంధించిన షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. ఈ సీజన్‌లో టీమిండియా సొంతగడ్డపై మూడు దేశాలతో తలపడనుంది. సెప్టెంబర్ చివరి వారంలో బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌తో ప్రారంభమై.. వచ్చే ఏడాది ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో టీమిండియా హోమ్ సీజన్ ముగియనుంది. ప్రస్తుతం టీ20 ప్రపంచకప్ 2024 ఆడుతున్న టీమిండియా.. ఈ టోర్నీ అనంతరం జూలైలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అనంతరం శ్రీలంక పర్యటనలో మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లు ఆడనుంది. సెప్టెంబర్ చివరి వారంలో భారత్‌కు బంగ్లాదేశ్ రానుండగా.. ఆ జట్టుతో రెండు టెస్ట్‌లు, మూడు టీ20లు ఆడనుంది. మూడు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్ అక్టోబర్ 12న హైదరాబాద్‌లో జరగనుంది. అనంతరం అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది జనవరిలో ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్, మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌తో భారత హోమ్ సీజన్ ముగియ నుంది. ఆ తర్వాత ఐపీఎల్ 2025 ప్రారంభం కానుంది. ఈ హోమ్ సీజన్‌లో తెలుగు రాష్ట్రాలకు ఒకే ఒక్క మ్యాచ్ కేటాయించారు.

**బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌లు, మూడు టీ20లు**

| | |
|---|---|
| తొలి టెస్ట్: | సెప్టెంబర్ 19 నుంచి 23, చెన్నై వేదికగా ఉదయం 9.30 గంటలకు |
| రెండో టెస్ట్: | సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1, కాన్పూర్ వేదికగా ఉదయం 9.30 గంటలకు |
| తొలి టీ20: | అక్టోబర్ 6, ధర్మశాల, రాత్రి 7 గంటలకు |
| రెండో టీ20: | అక్టోబర్ 9, ఢిల్లీ, రాత్రి 7 గంటలకు |
| మూడో టీ20: | అక్టోబర్ 12, హైదరాబాద్, రాత్రి 7 గంటలకు |

**న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్..**

| | |
|---|---|
| తొలి టెస్ట్: | అక్టోబర్ 16-20, బెంగళూరు, ఉదయం 9.30 గంటలకు |
| రెండో టెస్ట్: | అక్టోబర్24- 28, పుణే, ఉదయం 9.30 గంటలకు |
| మూడో టెస్ట్: | నవంబర్ 1 నుంచి 5, ముంబై, ఉదయం 9.30 గంటలకు |

**ఇంగ్లండ్‌తో టీ20, వన్డే సిరీస్‌లు**

| | |
|---|---|
| తొలి టీ20: | జనవరి 22, చెన్నై, రాత్రి 7 గంటలకు |
| రెండో టీ20: | జనవరి 25, కోల్‌కతా, రాత్రి 7 గంటలకు |
| మూడో టీ20: | జనవరి 28, రాజ్‌కోట్, రాత్రి 7 గంటలకు |
| నాలుగో టీ20: | జనవరి 31, పుణే, రాత్రి 7 గంటలకు |
| ఐదో టీ20: | ఫిబ్రవరి 2, ముంబై, రాత్రి 7 గంటలకు |

**వన్డే సిరీస్**

| | |
|---|---|
| తొలి వన్డే: | ఫిబ్రవరి 6, నాగ్‌పూర్, మధ్యాహ్నం 1.30 గంటలకు |
| రెండో వన్డే: | ఫిబ్రవరి 9, కటక్, మధ్యాహ్నం 1.30 గంటలకు |
| మూడో వన్డే: | ఫిబ్రవరి 12, అహ్మదాబాద్, మధ్యాహ్నం 1.30 గంటలకు |



## సూపర్-8లో వెస్టిండీస్‌కు షాక్..

టీ20 వరల్డ్‌కప్ 2024 సూపర్-8 మ్యాచ్ లు ఈరోజు ప్రారంభమయ్యాయి. వెస్టిండీస్ - అమెరికా మ్యాచ్ తో షురూ అయ్యాయి. సూపర్-8లోని గ్రూప్ 2లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు జరిగాయి. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-అమెరికా జట్లు తలపడగా.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్, ఆతిథ్య వెస్టిండీస్ తలపడ్డాయి. కాగా.. తొలి మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలువగా.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో.. ప్రస్తుతం రెండు జట్లు చెరో 2 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాయి. సూపర్-8 గ్రూప్ 2 పాయింట్ల పట్టికను పరిశీలిస్తే.. ఇంగ్లాండ్ అగ్రస్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా కంటే నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉంది. మరోవైపు.. అమెరికా మూడో స్థానం, వెస్టిండీస్ నాలుగో స్థానంలో ఉంది. మరోవైపు.. సూపర్-8 గ్రూప్ 1 మ్యాచ్‌లు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్ భారత్-అఫ్ఘనిస్తాన్ మధ్య జరగనుంది. ఆ తర్వాత.. రెండో మ్యాచ్ ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ మధ్య జరగనుంది. రెండు గ్రూప్‌ల్లో టాప్ 2లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకుంటాయి.

## భారత మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ మృతి



భారత మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ మృతిచెందారు. ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి జారిపడి మరణించారు. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ 52 ఏళ్ల డేవిడ్ ప్రాణాలు కోల్పోయారు. డేవిడ్ జాన్సన్ మరణ వార్త విని దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే, బీసీసీఐ సెక్రటరీ జై షా ట్విటర్ వేదికగా సానుభూతి వ్యక్తం చేశారు. "నా సహచర క్రికెటర్ డేవిడ్ జాన్సన్ మరణ వార్త విని చాలా బాధపడ్డాను. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. 'బెన్నీ' చాలా త్వరగా వెళ్లిపోయావు" అని కుంబ్లే ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. "భారత మాజీ ఫాస్ట్ బౌలర్ డేవిడ్ జాన్సన్ కుటుంబానికి, సన్నిహితులకు ప్రగాఢ సానుభూతి. ఆటకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ నిలిచిపోతుంది" అని జైషా ట్వీటాడు. డేవిడ్ జాన్సన్ గత కొన్నాళ్ల నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారు. గత వారం రోజులు ఆసుపత్రిలోనే గడిపారు. డిశ్చార్జ్ అయిన మూడు రోజులకే ప్రాణాలు కోల్పోయారు. టీమిండియా తరపున డేవిడ్ జాన్సన్ రెండు టెస్టులే ఆడినప్పటికీ కర్ణాటక తరఫున దేశవాళీ క్రికెట్‌లో సత్తాచాటారు. 1996లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేశారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లి డర్బన్‌లో టెస్టు ఆడారు. అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో ఆయనకు అదే చివరి మ్యాచ్. కర్ణాటక తరపున డేవిడ్ జాన్సన్.. శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్, దొడ్డ గణేష్‌తో కలిసి ఆడారు. 1990 దశకంలో కర్ణాటక పవర్‌ఫుల్ పేస్ దళంగా సత్తాచాటడంలో జాన్సన్‌ది కీలకపాత్ర. అయితే కర్ణాటక స్టేట్ క్రికెట్ బోర్డు కర్ణాటక ప్రీమియర్ లీగ్ ప్రారంభించడంతో ఫస్ట్ క్లాస్ రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని తిరిగి ఆడారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో డేవిడ్ జాన్సన్ 39 మ్యాచ్‌ల్లో 125 వికెట్లు పడగొట్టారు. 28.63 సగటు, 47.4 స్ట్రైక్‌రేటుతో ఈ ఫాస్ట్ బౌలర్ సత్తాచాటారు. బంతితో పాటు కీలక సమయాల్లో లోయర్ ఆర్డర్‌లోనూ బ్యాటుతోనూ రాణించారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని పేరిట ఓ శతకం ఉంది. 33 లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లో 41 వికెట్లు సాధించారు. 2015లో కర్ణాటక ప్రీమియర్ లీగ్‌లో చివరిగా పోటీ క్రికెట్ ఆడారు.

## తెలుగు రాష్ట్రాలకు బీసీసీఐ అన్యాయం..!

**తెలుగు రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్స్‌కు భారత క్రికెట్ నియంత్ర ణ మండలి(బీసీసీఐ) మరోసారి తీరని అన్యాయం చేసింది. టీమిండియా 2024-25 హోమ్ సీజన్‌కు సంబంధించిన షెడ్యూల్‌లో ఒకేఒక్క మ్యాచ్ కేటాయించింది. అది కూడా బంగ్లాదేశ్‌తో చివరి టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్‌ను వేదికగా ఎంపిక చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ మ్యాచ్ జరగనుంది. మరోవైపు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)కు ఒక్క మ్యాచ్ ఇవ్వలేదు. వైజాగ్ వేదికగా ఒక్క మ్యాచ్‌ను కూడా షెడ్యూల్ చేయలేదు. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 సమయంలోనూ తెలుగు రాష్ట్రాల పట్ల బీసీసీఐ ఇదే వివక్షను కొనసాగించింది. హైదరాబా ద్ వేదికగా ఇతర దేశాల లీగ్ మ్యాచ్‌లను కేటాయించిన బీసీసీఐ.. వైజాగ్‌కు ఒక్క మ్యాచ్ ఇవ్వలేదు. దాంతో తెలుగు రాష్ట్రాల అభిమానులు బీసీసీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అధికారులు బీసీసీఐలో కీలక పాత్ర పోషించే వరకు ఇదే పరిస్థితిని ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు.**

# కోహ్లి నిజస్వరూపం సూపర్-8లో కనిపిస్తుంది

## టీమిండియా మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్

ఇప్పటివరకు బ్యాట్స్‌మెన్‌కు పిచ్‌లు అనుకూలించని అన్ని లీగ్ దశ మ్యాచ్‌లను భారత్ అమెరికాలో ఆడింది. ఈ క్రమంలో.. సూపర్-8 మ్యాచ్‌లు న్యూయార్క్ పిచ్‌లపై జరుగనున్నాయి. దీంతో.. కోహ్లి పరుగులు సాధిస్తాడని అందరూ అనుకుంటున్నారు. ఈ క్రమంలో.. టీమిండియా మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ కోహ్లి గురించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. సూపర్-8లో విరాట్ కోహ్లి నిజ రూపాన్ని చూస్తామని తెలిపారు. పెద్ద మ్యాచ్ లలో ఎలా నిలబడాలో అతనికి తెలుసని ఇర్ఫాన్ పఠాన్ అన్నారు. కోహ్లి ప్రత్యేకమైన ఆటగాడు.. జట్టు కోసం పోరాడుతాడని తెలిపారు. ఇప్పటి నుంచి మంచి షాట్లు ఆడుతాడని, న్యూయార్క్ లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి.. మీరు నిజమైన కోహ్లిని చూస్తారని పఠాన్ చెప్పారు. విరాట్ కోహ్లి కీలక సమయాల్లో నిలకడగా రాణిస్తున్నాడని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నారు. గ్రూప్ మ్యాచ్ లలో ఎక్కువ పరుగులు చేయకపోయినప్పటికీ, ప్రత్యర్థి బౌలర్లను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో బరిలోకి దిగాడన్నారు. ఈ టీ20 ప్రపంచకప్ లో విరాట్ కోహ్లి ఓపెనర్ గా వస్తున్నారు. ఇంతకుముందు జరిగిన ఐపీఎల్ 2024లో ఓపెనర్ గా మంచి ప్రదర్శన కనబరిచాడు. దీంతో.. టీ20 వరల్డ్ కప్ లో ఓపెనర్ గా బరిలోకి దిగుతున్నాడు. ఇప్పటి వరకూ ఓపెనర్ గా రాణించపోయినప్పటికీ.. కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఏ మాత్రం అసంతృప్తి చెందడం లేదు.



## ఇంగ్లండ్ స్టార్ ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ పెను విధ్వంసం

ఇంగ్లండ్ స్టార్ ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ పెను విధ్వంసం సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ 2024 సూపర్-8లో భాగంగా సెయింట్ లూసియా వేదికగా గురువారం వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య విండీస్ బౌలర్‌లను ఊచకోత కోశాడు. సాల్ట్ ఫోర్లు, సిక్స్‌లతో రెచ్చిపోయి హాఫ్ సెంచరీ (87 నాటౌట్‌బీ 47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) చేశాడు. ముఖ్యంగా రొమారియో షెఫర్డ్ వేసిన 16వ ఓవర్‌లో మూడు సిక్సర్లు, మూడు ఫోర్లతో ఏకంగా 30 పరుగులు పిండుకున్నాడు. ఇందుకు సంబందించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.ఇనింగ్స్ రెండో ఓవర్ వేసిన రొమారియో షెఫర్డ్ 11 రన్స్ ఇచ్చాడు. దాంతో విండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ అతడికి బంతిని ఇవ్వలేదు. 16వ ఓవర్‌లో బంతిని ఇవ్వగా.. ఫిలిప్ సాల్ట్ రెచ్చిపోయాడు. తొలి బంతిని ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫోర్ బాదిన సాల్ట్.. రెండో బంతిని స్ట్రయిట్ సిక్సర్‌గా బాదాడు. మూడో బంతిని అప్పర్ కట్‌తో బౌండరీ బాదగా.. నాలుగో బంతికి లాంగాఫ్ మీదుగా భారీ సిక్సర్ కొట్టాడు. ఐదవ బంతిని డీప్ బ్యాక్వర్డ్ స్వేర్ మీదుగా సిక్సర్ బాధగా.. ఆఖరి బంతిని మిడాఫ్ మీదుగా ఫోర్ కొట్టాడు. దాంతో ఓవర్‌లోని అన్ని బాల్స్ ఫోర్లు, సిక్స్‌లే వెళ్లాయి.




## చేవెళ్లలో ఫర్టిలైజర్స్ షాపులను టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



**చేవెళ్ల, జూన్ 20 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ షాపులను టాస్కోర్స్ బృందం గురువారం తనిఖీ చేశారు. బృందం సభ్యులు ఏడిఏ చంద్రశేఖర్, ఎడిఎ సీడ్స్ సర్టిఫికేషన్ శివ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, చేవెళ్ల మండల కేంద్రంలో తిరుమల సీడ్స్, సాయినాథ్ సీడ్స్ మనగ్రోమోర్ సెంటర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విత్తనాలు కొన్న రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ వివరాలను నమోదు చేయాలన్నారు. రైతులకు కావల్సిన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. లూజు విత్తనాలు షాప్ యజమానులు అమ్మకూడదని వాటిని రైతులు కొనొద్దన్నారు. ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ దరకు విక్రరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఏడిఏ రమాదేవి, చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రరీలో తాళపత్ర గ్రంథాలు



ఏ పాఠశాలలో లేనివిధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత కళాశాలలో లైబ్రేరియన్ ఉంది. ఇందులో విద్యార్థులకు 5000 పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండడంతో పాటు వందకుపైగా తాళపత్ర గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేస్తే భవిష్యత్ తరాలకు అందించిన వారం అవుతామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రయివేటుకు దీటుగా సంస్కృత పాఠశాల

### 85 ఏండ్లుగా కొనసాగుతున్న విద్యాబోధన

- ఆధ్యాత్మిక క్షేత్రంలో విలసిల్లుతున్న విద్యాసంస్థలు
- బాల బాలికలకు ఉచిత విద్య, వేర్వేరు వసతి సదుపాయం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 20 (జనంసాక్షి) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో సంస్కృత విద్యా సంస్థలు (పాఠశాల, కళాశాల) నిర్వహిస్తున్నారు. కళాశాలలో విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నారు. కళాశాలలో బాల బాలికలకు వేర్వేరు వసతి గృహ సముదాయాలు ఉన్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యాబోధన కొనసాగుతుండడంతో పాఠశాల, కళాశాలలో అడ్మిషన్లు సైతం ప్రస్తుత విద్యా సంవత్సరంలో దొరకని పరిస్థితి నెలకొంది. వేములవాడలో 1939లో సంస్కృత విద్యాసంస్థలను ప్రారంభించారు. సంస్కృతంపై అవగాహన ఉన్నటువంటి బ్రాహ్మణుల ఇళ్లలో మొదటగా విద్యాభ్యాసం కొనసాగింది. అనంతరం 1952లో హైదరాబాద్ ముఖ్యమంత్రిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు సంస్కృత పాఠశాలను ప్రారంభించారు. 1956లో సంస్కృత పాఠశాల ఎయిడెడ్‌గా గుర్తింపు పొందింది. 1971 -72 విద్యా సంవత్సరంలో కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయి.




**యేటేటా పెరుగుతున్న ప్రవేశాలు**

సంస్కృత విద్యాసంస్థల్లో ఆరవ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యాబోధన కొనసాగుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 400 మందికిపైగా విద్యార్థులు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. వేములవాడతో పాటు ఉత్తర తెలంగాణవ్యాప్తంగా ఉన్నటువంటి విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ఆసక్తి కనబరుస్తుండడంతో ప్రవేశాలు దొరకని పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలకు దీటుగా పాఠశాల, కళాశాలలో విద్యాబోధన కొనసాగుతూ ఉండడం, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుం డటం, ఉచిత వసతి అందిస్తూ ఉండడంతో ప్రవేశాల సంఖ్య ప్రతియేటా పెరుగుతోంది. 2004 విద్యా సంవత్సరంలో కరీంనగర్‌లోని సంస్కృత పాఠశాల విద్యార్థులను సైతం ఇక్కడి పాఠశాలకు తరలించారు. 2015-16 విద్యా సంవత్సరంలో కరీంనగర్ పాఠశాలను మూసివేశారు.

**పీజీ కళాశాల ఏర్పాటైతే ఉపయోగం**

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత విద్యాసంస్థల పాఠశాల డిగ్రీ కళాశాల వరకు మాత్రమే విద్యాబోధన కొనసాగుతుంది. డిగ్రీ పూర్తయిన అనంతరం విద్యార్థులు ఉన్నత విద్య కోసం హైదరాబాద్, వరంగల్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పీజీ కళాశాల ఏర్పాటు చేసే విధంగా చొరవ తీసుకుంటే విద్యార్థులకు ఇబ్బందులు తొలగనున్నాయి.



**ఉన్నతస్థాయిలో పూర్వ విద్యార్థులు**

సంస్కృత పాఠశాల, కళాశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారు. డాక్టర్ నీలకంఠ శర్మ హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత విభాగం హెచ్‌ఓడిగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ సచ్చిదానందమూర్తి తిరుపతి కేంద్ర విద్యాలయంలో ప్రొఫెసర్‌గా, డాక్టర్ ఎం కిషన్ ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, వినయ్ శృంగేరి పీఠంలో సంస్కృత ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## కాలనీలో చెత్తను శుభ్రం చేసిన కౌన్సిలర్

### చెత్త వేస్తే రూ.ఐదు వేలు జరిమానా : కౌన్సిలర్ వెంకట్ రెడ్డి



**కీసర, జూన్ 20 (జనంసాక్షి) :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిల్ మాదిరి వెంకట్ రెడ్డి కోరారు. గురువారం నాగారం మున్సిపాలిటీలోని 15వ వార్డులోని ఈస్ట్ గాంధీనగర్ రోడ్డు పక్కన వేసినటువంటి చెత్తను స్థానిక కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి శుభ్రం చేశారు. చెత్తను కాలనీవాసులు దయచేసి, మున్సిపల్ చెత్త ఆటోలో మాత్రమే వేయాలని, రోడ్డుపై వేయరాదని కాలనీవాసులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని, అందరూ గుర్తించాలని అన్నారు. చెత్త వేసినవారి పై మున్సిపల్ వారు రూ.ఐదు వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ప్రవీణ్, సాయిబాబా కాలనీ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, మోహన్ నాయక్, వివిధ కాలనీలకు కి చెందిన కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## భవిషత్తులో మరిన్ని పథకాలు సాధించాలి

### పోలీస్ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తాం

### కానిస్టేబుల్‌ను అభినందించిన సిపి




**మల్కాజిగిరి,జూన్20 (జనంసాక్షి) :** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో విధులు నిర్వహిస్తూ పాన్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో మూడు బంగారు పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్‌ను రాచకొండ కమీషనర్ తరుణ్ జోషి నేరెడ్ మెట్ లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో అభినందించారు. వీటితో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి 22 నుంచి 25 తేదీలలో థాయ్ లాండ్ దేశములో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ -2024లో 45 సంవత్సరముల విభాములో నాలుగు పతకాలు (1 బంగారు పతకం, 3 కాంస్య పతకాలు) అనిల్ కుమార్ సాధించడం జరిగింది. అందులో 4ఐ400 మీటర్ల రిలేలో ఒక బంగారు పతకం మరియు 800 మీటర్లు, 1500 మీటర్లు, 5000 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకాలు సాధించడం జరిగింది. త్వరలో సెప్టెంబరులో ఆస్ట్రేలియాలో జరుగనున్న అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటున్న సందర్భంగా పోలీసు శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని కమీషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్రీకాంత్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 21 జూన్ 2024

# ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారం

- పిల్లల చదువు భారం తడిసి మోపెడు




నిజామాబాద్, జూన్20 (జనంసాక్షి) : ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫీజుల విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాలు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వాటి నియంత్రణ దిశగా కనీస చర్యలకు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడి ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో విద్యను వ్యాపారం చేసేలా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దనే నిబంధనను ఉల్లంఘి స్తున్నా.. చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారు. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమీషన్లతో వ్యాపారం .. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి. కొన్ని ప్రైవేటు బడుల్లో ఫీజులుం కొనసాగుతోంది. వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా నాణ్యమైన విద్య ముసుగులో అక్రమార్జనకు కొన్ని పాఠశాలలు తెరతీస్తున్నాయి. బడుల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దని.. ప్రభుత్వం, న్యాయస్థానం ఆదేశించినా జిల్లాలో ఆ వ్యవహారం బాహాటంగానే సాగుతోంది. కాసుల కక్కుర్తితో బడిలో వ్యాపారం నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారు చెప్పిన ఫీజును కాదనలేక.. పుస్తకాలను మరో చోట కొనలేక నానాతంటాలు పడుతున్నారు. ఎల్‌కేజీ విద్యార్థి పుస్తకాలకే రెండువేల వరకు ఖర్చవుతోంది. ఇక కెజీ పెరిగిన కొద్దీ రకరకాల పుస్తకాలు కావాలంటే జేబు గుల్లకాక తప్పడంలేదు. వీటికితోడుగా రాత కోసం మరో 10 నోటు పుస్తకాలను కొనాల్సిందే. బడికి బస్సులోనే పంపాలి. ఇందుకోసం నెలకు రవాణా రుసుం కట్టాలి. పుస్తకాలకు డ్రెస్‌లకు మరో రెండు వేలు, బెల్టు, బ్యాగు, బూట్లు ఇతర నోటు పుస్తకాలకు మరో మూడువేలు వసూల చేస్తున్నారు. పిల్లలుఫలానా షాపులోనే ఇవన్నీ కొనే విధంగా రహస్య ఒప్పందాలు కొందరు కుదుర్చుకున్నట్లు సమాచారం. పుస్తక దుకాణాల వారే అధికంగా అన్ని పాఠశాలలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 400 నుంచి 1200 మంది పిల్లలు ఉంటున్నారు. ఇలా వారి సంఖ్యను బట్టి బడులకు కమీషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలన్నీ అక్కడే కొనాలే నిబంధనను పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాసంస్థలు కోట్ల రూపాయల్లో లావాదేవీలు చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధరల్ని నిర్ణయించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలతోపాటుగా నోటు పుస్తకాలను అమ్ముతున్నారు. ఏ ఒక్కటి తీసుకోకున్నా ఒప్పుకోవడం లేదు. సట్టణంలో ఒకటి రెండు బడులకు మినహాయిస్తే ఏ ఒక్క చోట విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. పైగా విద్యార్థులకు క్రీడల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఫీజు వసూలు చేస్తున్నారు. మైదానం సంగతేంటని.. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారంలో ఒక రోజు పట్టణశివారులో ఉన్న మైదానానికి పిల్లలను బస్సులో తీసుకెళ్తామనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

# ఖజానా ఖాళీ చేసిన బీఆర్ఎస్

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



మందమర్రి, జూన్ 20 (జనంసాక్షి) : బీఆర్ఎస్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ఎంపిడిఓ కార్యాలయంలో మందమర్రి మండలంలోని 58 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదిముభారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ శాఖల నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేసిందని, తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రజా పాలన అందిస్తూ నిధులను సమకూర్చే దిశగా సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సింగరేణి సంస్థ లో కొత్త గనులను తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రూపొంది స్తున్నారన్నారు. సింగరేణిలో కొత్త.గనుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల ఓదెలు,మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు,ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కాలేజీ సీట్ల రెండో జాబితా విడుదల

- ఈనెల 26వ తేదీలోగా రిపోర్ట్ చేయాలి
- టిజిఆర్డిసి సెట్ - 2024 కన్వీనర్ బడుగు సైదులు

హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) : రాష్ట్రంలోని బీసీ వెల్ఫేర్ , సోషల్ వెల్ఫేర్ , ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కాలేజీల్లో మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తూ రెండో జాబితా విడుదల చేశామని టి జి ఆర్ డి సి సెట్ – 2024 కన్వీనర్ బడుగు సైదులు తెలిపారు. సీట్ల కేటాయింపు వివరాలు https://tgrdc-cet.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సీట్లు కేటాయించబడిన విద్యార్థులు ఈనెల 26వ తేదీ లోగా సంబంధిత కాలేజీల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు. డిగ్రీలో బీఏ (హెచ్‌పీఎస్, ఎప్సా, ఈపీహెచ్, హెచ్ఈపీ, ఈపీపీ, హెచ్‌పీఈ, హెచ్ఈఎస్, ఐఆర్ఈపీ, పీపీజీఈపీ), బీకాం(సీఏ, బీఏ, జీ), బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంపీజీ, ఎంఎస్‌సీఎస్, ఎంఈసీఎస్, ఎంఎస్‌డీస్, ఎంఎస్ఏఇ, ఎంఎల్, బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీటీబీసీసీ, బీబీసీసీ, ఎన్‌జెడ్‌సీ, ఎంబీజెడ్‌జీ, బీబీటీసీ, ఏఎన్‌పీహెచ్‌బీసీ) కోర్సులు కలవు. వీటితో పాటు బీబీఏ, బీఎఫ్‌టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్స్ లో 40 సీట్లు ఉన్నాయి మరిన్ని వివరాలకు https://tgrdccet.cgg.gov.in వెబ్ సైట్ సంప్రదించాలని సైదులు సూచించారు.

## దయనీయంగా పేద బ్రాహ్మణుల పరిస్థితి

- మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి

హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) : రాష్ట్రంలో పేద బ్రాహ్మణుల పరిస్థితి దయనీయంగా మారిందని ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. వేలాది అర్చక కుటుంబాలు పేదరికంలో కొట్టుమిట్టాడు తున్నాయని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే కళ్లు చెమరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో పేద బ్రాహ్మణులను అనేక విధాలుగా ఆదుకున్నారన్నారు. 2017లో రూ.వంద కోట్లతో బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఆలయాల్లో అర్చకులకు కేసీఆర్ గౌరవ వేతనం ఇచ్చారని గుర్తుచేశారు. ధూపదీప నైవేద్య పథకంలో భాగంగా ప్రతి ఆలయానికి నిధులిచ్చారని తెలిపారు. వృద్ధులైన వేద పండితులకు ఆర్థిక సాయం అందించారని వెల్లడించారని, బ్రాహ్మణ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ఫెలోషిప్ ఇచ్చారని చెప్పారు. కొత్త ప్రభుత్వ పాలనలో బ్రాహ్మణులకు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. విదేశీ విద్యానిధి కింద చదువుకుంటున్న విద్యార్థులు బాధపడుతు న్నారని చెప్పారు. విదేశీ విద్యానిధికి రూ.30 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు రూ.15 కోట్లు ఇవ్వాల్సి ఉందని, బ్రాహ్మణపరిషత్ ఉద్యోగులకు 3 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే వారికి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## నగరంలో ఆందోళన కలిగిస్తున్న హత్యలు

హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలో రోజూ ఎక్కడో ఒక చోట నేరాలు జరుగు తున్నాయి. గత 24 గంటల వ్యవధిలోనే హైదరాబాద్ పరిధిలో 5 హత్యలు, 2 హత్యాయత్నాలు చోటు చేసుకున్నాయి. పాతబస్తీ శాలిబండ పోలీసు స్టేషన్ పరిధిలో నిమ్రా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని రఫీక్ దారుణ హత్యకు గురయ్యాడు. శాలిబండ పోలీసు స్టేషన్ పరిధిలో వజీద్, ఫక్రుద్దీన్‌పై హత్యాయత్నం జరిగింది. సికింద్రాబాద్‌లోని తుకారాం గేట్ పోలీసు స్టేషన్ పరిధి అడ్డగుట్టలో రోజాను ఆమె భర్త హత్య చేశాడు. ఆసిఫ్‌నగర్‌లో అలీం అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కాచిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఖిజార్ అనే వ్యక్తిని దుండగులు హతమార్చారు. సనత్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో అజార్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సుద్ద తరలింపులో రాయల్టీకి ఎగనామం?

- ఆదాయం కోల్పోతున్న సర్కార్



వికారాబాద్, జూన్20 (జనంసాక్షి) : సుద్దకు చాలామంది యజమానులు రాయల్టీ చెల్లించకుండా పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఇలా చేయడంతో గనుల శాఖకు సమకూరాల్సిన ఆదాయం రాకుండా పోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు వేగంగా స్పందించడంలేదు. లీజు గడువు ఇంకా ఉండటంతో తమ గనులకు పక్కనే ఉన్న భూముల్లో తవ్వేస్తున్నారు. చిన్నతరహా ఖనిజాల పరిధిలోకి వచ్చే సుద్ద అక్రమ రవాణా తవ్వకాలు, రవాణా జిల్లాలో యథేచ్ఛగా సాగిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని గనుల నుంచి సుద్ద బయటికి వస్తోంది. అదేస్థాయిలో హైదరాబాద్, వికారాబాద్, మర్పల్లి, ఒగులాపూర్ గ్రామాల సమీపంలోని పరిశ్రమల తోపాటు కర్ణాటక, మహారాష్ట్రలోని పరిశ్రమలకు తరలుతోంది. ముఖ్యంగా మలేషియా, సింగపూర్ లకు తరలివెళ్లే సుద్దను చమురును శుద్ధి చేసేందుకు వాడుతున్నారు. ముఖ సౌందర్య వినియోగానికి సంబంధించిన ఉత్పత్తులు, ఎరువుల తయారీకి సైతం ఉపయోగపడుతుంది. దేశీయంగా మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో ఎరువుల తయారీలో వినియోగిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలోని పెద్దేముల్ మండలం మారెపల్లి, ఇందోల్, ఒగులాపూర్, రుద్రారం, గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, మోమిన్‌పేట మండలం టేకులపల్లి, ధారూర్ మండలం జైదుపల్లి, మర్పల్లి మండలం కోట్‌మర్పల్లి గ్రామాల సమీపాల్లో లీజులు పొందిన సుద్దగనులు వందకు పైగా ఉన్నాయి. ఒక్కో గని విస్తీర్ణం ఎకరం నుంచి అయిదు ఎకరాల వరకు ఉంది. లీజు కాల పరిమితి పదేళ్లకు పైబడి ఉంటుంది. కూలీలు తవ్వకాలు జరిపితే గనుల్లోంచి ముడిసరకు నామమాత్రం గానే బయటికి వస్తుంది. ఇది తమకు గిట్టుబాటు కాదంటూ ఏకంగా జేసీబీలను వినియోగి న్నారు. ప్రతిరోజూ వందల కొద్ది టన్నులను వెలికి తీస్తున్నారు. పదేళ్లలో వెలికి తీయాల్సిన సుద్దను కేవలం నెలల పరిధిలోనే పూర్తి చేస్తున్నారు. పగటివేళ గనుల్లోంచి జేసీబీలను వినియోగించి ముడిసుద్దను వెలికి తీస్తున్నారు. టిప్పర్లు, లారీల్లో నింపి సమీప వ్యవసాయ పొలాల్లో భారీగా నిలువ చేస్తున్నారు. పరిశ్రమల నుంచి వచ్చిన ఆర్డర్లను అనుగుణంగా రాత్రివేళల్లో లారీల్లో నింపి తరలిస్తున్నారు. ప్రతిరోజు డిమాండ్‌ను బట్టి వందల కొద్ది లారీల్లో సుద్ద తరలిపోతోంది. సుద్ద ఖనిజం తరలింపుతో అక్రమ రవాణా విషయంలో విమర్శలు వెల్లు వెత్తడంతో అధికారులు స్పందించారు. అడపాదడపా దాడులుచేసి ఎలాంటి పత్రాలు లేకుండా సరకును తరలిస్తున్న లారీలను జప్తు చేసి జరిమానా విధించారు.

## మత్తడివాగును ఆధునీకరించాలి

- ఆయకట్టు రైతుల వినతి

ఆదిలాబాద్, జూన్20 (జనంసాక్షి) : జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీనిని పూర్తిస్తాయిలోకి అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు మేలు జరుగనుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాందా–టి. సిర్సన్న, భోరజ్, సావర్‌గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాల నిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆధునీకీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారను న్నాయని రైతులు అంటున్నారు.

## ప్రత్యామ్నాయ ఉపాధిలో బీడి కార్మికులు

- ఇతరవృత్తుల్లో స్థిరపడుతున్న మహిళలు



నిర్మల్, జూన్20 (జనంసాక్షి) : ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా జిల్లాలో బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకు పోతోంది. రోజురోజుకూ బీడీ పరిశ్రమ బలహీన పడుతుం డటం కార్మికులకు శాపంగా మారుతోంది. అంతర్జాతీ య మార్కెట్ పరిస్థితులు, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు, సిగరెటc వినియోగ ప్రాబల్యం పెరగడం లాంటి అంశాలన్నీ బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ వస్తున్నాయి. వేలాది మంది బీడీ కార్మికులకు ఉపాధిపై భరోసా రోజురోజుకూ కరవవుతున్న క్రమంలో తప్పుకుంటు న్నారు. పొగాకు దుష్ఫలితాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం లక్షలాది మంది బీడీ కార్మికుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. కారణం.. బీడీ పరిశ్రమ కేంద్రీకృతమైన ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. బీడీ వినియోగం తగ్గిపోవడంతో ఈ పరిశ్రమ యజమానులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బీడీకి డిమాండ్ వారిపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ స్వయం ఉపాధిపై, వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో నెట్టుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో బతుకులు బాగుపడనున్నాయి. నిర్మల్ జిల్లాలో ఉన్న 60 వేల మంది కార్మికులతో పాటు వారిపై ఆధార పడుతున్న దాదాపు మరో 1.50 లక్షల మందికి ఉంటారని కార్మికశాఖ అధికారులు అంచనా వేశారు. ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగర్‌బత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధశాఖల్లో దినసరి ఉద్యోగాలుగా పనులు చేసేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టైలరింగ్, బ్యూటీషియన్, బ్యాంకింగ్, ÷నాన్స్, బీమా ఏజెంట్లు, ఆసుపత్రుల్లో సేవలు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్, పశువైద్య సేవలపై శిక్షణ ఇవ్వనున్నారు. బీడీ కంపెనీలు ఎప్పుడు మూతపడు తున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బీడీలు చుట్టుడమే జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

# అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో జాతీయ శరణార్థుల దినోత్సవం




కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనం సాక్షి) : ప్రపంచంలో మానవాళికి అన్ని రకాలుగా సహాయపడాలని ప్రత్యేకంగా ఆహారం, వస్త్రాలను అందించడంలో ప్రధాన పాత్ర పోషించి ఖ్యాతి గడించడమే కాకుండా అత్యుత్తమ జీవనాన్ని కొనసాగించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో జాతీయ శరణార్థుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి సమాజంలో శరణార్థులు నిర్లక్ష్యానికి గురైనారని వారి పట్టింపు ఎవరికి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ఇలా వ్యవహరించడం చాలా విచారకరమని తెలుపుతూ ప్రతి ఒక్కరు శరణార్థులకు ఆపన్నహస్తం అందించి సేవలో ముందంజలో ఉండాలని తెలిపారు. నేడు ప్రతి ఒక్కరు తీరిక లేకుండా పలు కార్యకలాపాలలో పాల్గొనడంతో శరణార్థులకు ఎటువంటి వసతులు దొరకడం లేదని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శరణార్థులు ఉన్నారని వారికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారని చెప్పారు. ఐక్యరాజ్య సమితి వారు సైతం శరణార్థులకు తగు గుర్తింపునివ్వడం ద్వారా వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తు ప్రతి ఒక్కరు శరణార్థులకు చేయూతనివ్వడంతో పాటు వారి అభివృద్ధికి పలు వనరులను అందించి సహాయ పడాలని కోరారు. విద్యార్థులకు సమాజంలో పలు సమస్యలను ఎదురుకుంటున్న , నిర్లక్ష్యానికి గురైన శరణార్థుల గురించి తెలియజేయ డానికై పలు కార్యక్రమాలని రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం వారు వారి శ్రేయస్సుకై పలు నిధులను కేటాయించారని సలహాలను ఇస్తున్నారని తెలుపుతూ ప్రతి ఒక్కరు వారి అభివృద్ధికై చేయూతనివ్వడమే కాకుండా తగు సూచనలు చేయాలని కోరారు. నేడు ప్రపంచంలోని యువత వివిధ అసాంఘీక శక్తులకు భానిసలవుతు కనీసం గా మాట్లాడలేకపోతున్నారని విచారం వ్యక్తం చేస్తు మాట్లాడారు. యువత , ప్రజలు శరణార్థులు ఎదురుకుంటున్న పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెల్లి వారి శ్రేయస్సుకై , సమస్యల పరిష్కారినికై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆదర్శంగా జీవనాన్ని కొనసాగించి ఖ్యాతి గడించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరుగా మంచినీటి వ్యాపారం

సిరిసిల్ల, జూన్20 (జనంసాక్షి) : నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఇళ్ల సమీపంలోనే గొట్టపుబావులను తవ్విస్తూ అనుమతులు లేకుండానే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వందలాది నీటిశుద్ధికేంద్రాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తి పర్యవేక్షణలో వివిధ రసాయనాలను కలిపి నీటిని శుద్ధి చేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా నీటిలో ఉండే ఖనిజలవణాలు, పోషకాలు పూర్తిగా తొలగిపోతున్నాయి. ఇలాంటి నీరు తాగడంతో కొద్ది రోజులకే ఎముకలు, కీళ్ళ సంబంధిత వ్యాధులు సోకుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల జిల్లాలో తాగునీటికి తీవ్ర ఎద్దడి నెలకొనడంతో కరవులోనూ కొందరు వ్యాపారులు శుద్ధజలం పేరిట సొమ్ముచేసుకున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్ష ణ కొరవడటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా నీటిదందా కొనసాగుతోంది. ఈ నీటిని తాగిన ప్రజల ఆరోగ్యం మెరుగుపడకపోగా మరింత క్షీణించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో వినియోగం ఎక్కువగా ఉండటంతో పాటు శుభకార్యాలు ఎక్కువగా జరిగే ప్రస్తుత వేసవిలో సాంకేతికకు తిలోదకాలు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

## పాడైన మటన్‌తో బిర్యానీ

- అల్ఫా హోటల్‌కు లక్ష జరిమానా

హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) : ఇటీవల నగరంలోని పలు హోటళ్లలో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం రాత్రి సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్‌లోసోదాలు చేసిన అధికారులు.. నాసిరకం ఆహార పదార్థాలు వాడుతున్నట్లు గుర్తించారు. పాడైపోయిన మటన్‌తో బిర్యానీ వండుతున్నట్లు గమనించారు. ఫుడ్ ముందుగానే తయారుచేసి ఫ్రిడ్జ్‌లో పెట్టి కస్టమర్లు వచ్చిన వేళ దాన్ని అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఆల్ఫా హోటల్‌లో తయారు చేసే బ్రెడ్‌తో పాటు ఐస్‌క్రీమ్ డేట్ బ్యాచ్ లేకుండా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. టీ ఫౌడర్ కూడా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు. కిచెన్‌లో అపరిశుభ్రంగా దారుణ పరిస్థితులు ఉన్నట్లు వెలుగులోకి తెచ్చారు. ఈ క్రమంలో నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు హోటల్‌పై కేసు నమోదు చేసి రూ.లక్ష జరిమానా విధించారు.

## పోలీసుల వైఫల్యమే అల్లర్లకు కారణం

బిజెపి నేతల బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన ఎంపి

మెదక్, జూన్20 (జనంసాక్షి) : బక్రీద్‌కు రెండు రోజుల ముందు మెదక్‌లో చోటుచేసుకున్న అల్లర్లు పోలీసుల వైఫల్యంతోనే అని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ అల్లర్లలో అరెస్టు అయిన బీజేపీ నేతల బెయిల్ పిటిషన్ గురువారం దాఖలు చేశారు. వారి తరపున మెదక్ జిల్లా న్యాయస్థానంలో ఎంపీ, న్యాయవాది రఘునందన్ రావు వాదించారు. సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ... పోలీసుల వైఫల్యాలను కోర్టు పెద్దలకు వివరించామని చెప్పారు. పిటిషన్ ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే మెదక్‌లో అల్లర్లు జరిగేవి కావని తెలిపారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ 21 కి వాయిదా వేశారన్నారు. కార్యకర్తలకు కష్టమొస్తే అక్కడ రఘునందన్ ఉంటాడని అన్నారు. ఎంపీలకు సన్మానం ఉన్నా ..కార్యకర్తలకంటే ఎక్కువ సన్మానాలు కాదని ఇక్కడికి వచ్చానని అన్నారు. కార్యకర్తల కష్టంతోనే మెదక్ ఎంపీగా గెలిచానని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370